శ్రీరామ జయహనుమన్

# భద్రాద్రిలో సీతారామ కళ్యాణం జరగకపోవడం బాధాకరం



**భరత శత్రుఘ్నులు తమ మూలరూపాలైన, శంఖచక్రాలుగా ఉన్నట్లు హనుమంతుడూ తన మూలరూపమైన శివునిగా ఇక్కడ చేరాడు.**

ఈ గ్రంథం చదివిన వారందరూ భద్రాద్రిలో సీతారామ కల్యాణం విషయంలో జరుగుచున్న అన్యాయాన్ని గూర్చి విచారం కొందరు, ఆవేదన కొందరు, కోపం కొందరు వ్యక్తం చేస్తున్నారు. వేలాదిమంది ఆ అందరి అభిప్రాయాలు అందించడం కష్టం కాన పరిమితంగా కొందరు ముఖ్యుల అభిప్రాయాలు లిఖితపూర్వకంగా స్వీకరించి మీ ముందుంచు తున్నాను. పెద్దల అభిప్రాయాలు శ్రద్ధగా గ్రహించండి. అసలు గ్రంథం పూర్తిగా చదవండి. మీ ఆత్మీయులందరిచే చదివించండి. వేలాదిమంది మీ ఆత్మీయులకు, గ్రూపులకు దానిని పంపి ఈ రామసేవలో మీరూ భాగస్వాములుకండి.

సమాచారమంతా sribhadradri.blogspot.com నుండి తెలుసుకొనవచ్చును. యావత్తు సమాజానికి ఈ రామాపచారాన్ని తెలియజేయడం ప్రథమ కర్తవ్యం. తమ అభిప్రాయములందించిన మహనీయులందరకూ కృతజ్ఞతలు.

భద్రాద్రి శ్రీసీతారామసేవలో ... **అన్నదానం చిదంబర శాస్త్రి**

# విషయసూచిక

1) శ్రీరామునిది హరిహరాద్వైత తత్త్వం ........................... 4
2) కంచర్ల గోపన్న ప్రథమశాఖ నియోగియైన హరిహరాద్వైతి
వ్యవస్థను క్రమంగా ఎలా మార్చారో గమనించండి. .......... 5
3) శివలింగాన్ని పీకేశారు........................................... 6
4) పన్నిద్ద ఆళ్వారులను పెట్టేశారు. .............................. 9
5) రామదాసు గురువును మార్చేశారు ............................. 10
6) శిలాఫలకంలోనిది మార్చి వ్రాశారు............................ 15
7) పుస్తకాల విషయం మార్చారు .................................. 15
8) రామదాసే తమను శ్రీరంగం నుండి తీసుకొని వచ్చారని...... 17
9) శివపరివారమును తొలగించే యత్నం చేశారు ................ 18
10) క్షేత్రపాలకుని మార్చారు. ...................................... 19
11) గోత్ర ప్రవరలు మార్చారు ..................................... 20
12) రాముని పేరే మార్చేశారు ..................................... 25
13) ఇదో పెద్ద చీటింగు కేసు ...................................... 37
14) విలువలు మార్చేస్తున్నారు. .................................... 38
15) కుడ్య చిత్రాలు మార్చేశారు .................................... 39
16) సేవా కైంకర్యాలు మార్చేశారు ................................. 39
17) సీతారాములను బ్రాహ్మణులుగా మార్చేశారు ................ 40
18) వ్యాఖ్యానాలు మార్చేశారు...................................... 41
19) శుభలేఖల తీరు మార్చేస్తున్నారు.............................. 44
20) అన్నదాతకు అన్యాయం........................................ 47
21) ఉత్సవమూర్తిని మార్చారు...................................... 48
22) కీర్తన మార్చారు ................................................ 49
23) రామనారాయణ వాదానికి కీలకం........................... 49
24) సాధుసంతుల అభిప్రాయాలు ................................ 57
25) పండితుల అభిప్రాయాలు ..................................... 70

# ముందుమాట

మనమంతా హిందువులం. హిందూధర్మరక్షణకు కృషి చేయటం, ఏమయినా అపకారం జరుగుచుంటే ఆందోళన చెందటం, సరిచేయ జూడటం మన కర్తవ్యం. మన ధర్మానికి ప్రతీక శ్రీరాముడు. 'రామో విగ్రహవాన్ ధర్మః' అనిపించుకున్న ధర్మమూర్తి. ఆయనను కూడా ఒక మతానికి పరిమితం చేయజూడటం భరింపరాని విషయం. అందుకోసం భద్రాద్రిలో వ్యవస్థనంతనూ ఇష్టం వచ్చినట్లు మార్చేయడం జరుగుతోంది. ఈ గ్రంథం చదివితే సమస్తమూ మీ కవగతమవుతుంది. హిందూ ధర్మంలోని ఇటువంటి స్వమతద్వేషాన్ని ఎవ్వరూ సమర్థింపకూడదు. వారి తగని రీతులను ఖండించానని నన్ను వైష్ణవ ద్వేషినంటూ నిందిస్తున్నారు. నేను అనేక భాగవత సప్తాహాలు చేసిన విష్ణుభక్తుడను. హనుమద్రామ మంత్ర జాపకుడు నయిన నేను రామాపచారాన్ని భరింపలేక వారి చర్యలను ఖండిస్తున్నాను. సంకుచిత మత భావాలు లేని ఏ రామభక్తులయినా, హనుమద్భక్తులయినా నా తపనను గ్రహించి నన్నంగీకరింప గల్గుతారు. శ్రీరాముని తలవకుండా అన్నం తినకూడదని పద్మపురాణం చెప్పింది. అటువంటి అన్నం పెట్టిన రామునికి అన్యాయం జరగడం బాధాకరం. ఈ రామాపచార ప్రమాదం సమాజానికి పూర్తిగా తెలియకపోవడం వల్లనే పరిష్కారం కాకుండా మిగిలి ఉంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేస్తే సమస్య అదే పరిష్కార మవుతుంది.

ఈ విషయంలో 'భద్రాద్రి పరిరక్షణ సమితి" రామచంద్రుని కోసం విశేష కృషి చేస్తోంది. శ్రీ తాళ్ళూరి రమణమూర్తి గారు ఈ సత్యాన్ని విశ్వానికి తెలియ జేస్తున్నారు. గోపన్నవంశీయులయిన శ్రీ కంచర్ల వెంకటరమణగారు తమ రామదాసు ఆశయాలకు జరుగుచున్న అన్యాయాన్ని పెద్దలందరినీ కలిసి తెలియజేస్తూ విశేషకృషి చేస్తున్నారు. రామాపకారులు ఇక్కడే కాదు. దేశంలో ఎక్కడా రామచంద్ర కల్యాణం జరుగనీయమని ఆడియో విడుదల చేశారు. వారిని అన్యాయమని గ్రహిస్తే ఆధర్మస్వరూపుని రాముని సేవలో మాకు తోడు నిలవండి. రామాపచారాన్ని ఖండిస్తూ తమ అభిప్రాయం అందించిన సాధుసంతులకు, పండిత, భక్తులకు కృతజ్ఞతలు. రామభక్తులందరకూ శతకోటి వందనాలు.

ఇట్లు,
హనుమత్సేవకుడు
**అన్నదానం చిదంబరశాస్త్రి**

హైదరాబాద్
వికారిమాఘము

## 1. శ్రీరామునిది హరిహరాద్వైత తత్త్వం

ఎవరిని నిర్ణయించేదిరా? శివుడవో, మాధవుడవో ! శివమ,ంత్రమునకు 'మ' జీవము. మాధవ మంత్రమునకు 'రా' జీవము – అని కీర్తన వ్రాశాడు త్యాగరాజు. నారాయణాష్టాక్షరి మంత్రంల జీవాక్షరమైన 'రా', శివపంచాక్షరిలో జీవాక్షరమైన 'మ' కలిసి రామశబ్దమేర్పడింది. రామ అనేది శివ కేశవ అభేదతత్వం. రామ నామాన్ని మొట విష్ణుమూర్తి శివునకే ఇచ్చినట్లు, దానిని కాశీలో మరణించిన వారి కుడిచెవిలో ఉపదేశిస్తున్నట్లు శివుడు ఆనందరామాయణంలో చెప్పాడు. ఆ శివుడే హనుమంతునిగా జన్మించి 'రామ' నామ మహిమను నిరూపించాడు.

**"నారాయణాష్టాక్షరే చ – శివ పంచాక్షరే తథా**
**సార్థకార్ణద్వయం ప్రాప్య – రామ ఇత్యక్షర ద్వయం**
**గృహీత్వా రామనా మైవం – వసిష్ఠః దత్తవానితి**
**తస్మా ద్రామః హరిహరో (ఉ) భయాత్మకః ఇతి స్పష్టమ్"**

అని రామాయణ సారోద్ధారం. అంటే నారాయణాష్టాక్షరి నుండి 'రా' అనేది, శివ పంచాక్షరి నుండి 'మ' అనేది తీసుకొని వసిష్ఠుడు దశరథుని జ్యేష్ఠ పుత్రునకు రాముడని పేరు పెట్టాడు. అందువల్ల రాముడు హరిహరులిద్దరి తత్త్వమని రామాయణ సారోద్ధారం చెప్పింది. రామదాసు కూడా దానిననుసరించే 'హరిహరరామ ! నన్నరమర చూడకు' అని వేడాడు.

దక్షిణాశాస్యం గురుంవందే దక్షిణాశాస్యం అని కీర్తన వ్రాస్తూ చివర

లలాట నేత్రం భద్రాచ లేశం భక్తార్తి నాశం అన్న ఆయనను హరిహర అద్వైతి అనక ఆ ఆలయం హరి హరరామ క్షేత్రం అనక ఏమనాలి?

త్యాగరాజు 'శివుడనో, మాధవుడనో, ఎవరని నిర్ణయించేది' అని కీర్తన వ్రాశాడు. అది ఒకరికి భరింపరాని విషయమయింది. 'రామచంద్రస్వామినే వరాయ' అని అప్పటి వరకూ అనేవారు. 'రామనారాయణస్వామినే వరాయ' అని చెప్పనారంభించారు.

**వారు రామచంద్రుని కాదని రామనారాయణడనటంలో కారణం ఒక మహనీయుని వలన అవగతమయింది. 'రామశబ్దంలోని 'రా' అనేది విష్ణు మంత్రాక్షరం 'మ' అనేది శివమంత్రాక్షరం అనేది సర్వవిదితం. అ లా ఆయన శివకేశవ స్వరూపం.**

**అందుకే వ్యాసుడు, భద్రుడు, రామదాసు, నరసదాసు భద్రాచల వాసుని రామచంద్రుడు అన్నారు. అయితే అందులో 'మ' అనే శివుని పైన ఉండే చంద్రునితో కలియటంతో ఆపదం ఎక్కువ శివసంబంధం కలదవుతోంది. కాన దానిని పనికిరాదని 'రామనారాయణ'గా అచటి అర్చకపక్షం వారు మార్చేస్తున్నారు. అందుకేమో వంకలు చెప్తున్నారు. ఇది న్యాయమా? ధర్మమా? అందరూ ఆలోచించాలి.**

అందుకే రామదాసు కూడా 'హరిహరరామా!' అని కీర్తించాడు. ఆలయంలోనే శివలింగము ప్రతిష్ఠించి గోపురాన శివపరిపార మేర్పరచాడు. శ్రీ భద్రాచల క్షేత్రం చరిత్ర 76 వ పుటలో కొండపల్లి రామచంద్రరావు గారు హరిహరమంత్రముల నుండి మౌలికాక్షరములు గ్రహించి జతపరచి వసిష్ఠుడు రామనామం సృష్టించినట్లు వ్రాశారు. శ్రీరాముని నవ అవతారాలలో శివరామం ఒకటి. ఈ శివరామం గూర్చి యజ్ఞోపవీతం ఫిబ్రవరి 2020 సంచికలో విపులమయిన వ్యాసం వచ్చింది. ఇలా శ్రీరామచంద్రుడు హరిహరాద్వైత తత్త్వము అనేది స్పష్టం.

## 2, కంచర్ల గోపన్న ప్రథమశాఖ నియోగియైన హరిహరాద్వైతి

కంచర్ల గోపన్న దాశరథీ శతకంలో "అల్లన లింగమంత్రి సుతుడ త్రిజగోత్రజుడాది శాఖ కంచర్ల కులోద్భవుండ" నని తనను ప్రథమశాఖనియోగి బ్రాహ్మణుడుగా చెప్పుకొన్నాడు.

భద్రాచల క్షేత్ర చరిత్ర 82 వ పుటలో కొండపల్లి రామచంద్రరావుగారు "శ్రీరామాలయం ప్రక్కనే రాజవీధి కావలవైపున శ్రీకాశీ విశ్వనాథుని పేర నొక శివలాయ మున్నదని, దీనిని రామదాసు ప్రతిష్ఠించినట్లు చెప్తారని" వ్రాశారు. ఆయన వైష్ణవుడయితే ఇలా మరల మరల శివలింగ ప్రతిష్ఠలు చేయడు కదా!

ఈ పరిస్థితులలో ఏదో ఒక దశలో ఆలయం శ్రీ వైష్ణవుల చేతిలోకి వెళ్ళింది. వారు వైఖానసులవలె విశాల దృక్పథము సమన్వయ ధోరణి కలవారు కాక సంకుచిత భావులై ఆలయాన్ని శాశ్వతంగా తమపరంగా చేసికొనాలని, తమ సిద్ధాంతాన్ని కనుకూలంగా మలచుకొనాలని ఆలోచించారు. వ్యవస్థనంతనూ మార్చనారంభించి తుదకు నేటికి అసలు ఆ శ్రీరామచంద్రుని పేరునే మార్చేసే ఎక్కడా రాముని కల్యాణం

జరుగనీయమనే దుస్థితికి వచ్చారు. అన్ని విషయాలూ సప్రమాణికంగా తెలుపబడు చున్నాయి. గ్రహించితోటి వారికి కూడా అందించండి. వ్యవస్థను ఎలా మార్చాలో గమనించండి.

**వ్యవస్థను క్రమంగా ఎలా మార్చారో గమనించండి.**

## 3. శివలింగం పీకేశారు

రామదాసు ప్రతిష్ఠించిన హనుమంతుని మూలరూపమైన శివలింగం అక్కడ నేడు లేదు. శక్తి బంధం చేసి దూరంలో ప్రతిష్ఠించి అప్రధానంగా దానినుంచారు. ఆ శివలింగ మేమయినదీ మనకు 'భద్రగిరి వైభవం' 244వ పేజీలో కనబడుతుంది. ఆ గ్రంథాన్ని దేవస్థానం ట్రస్టు బోర్డు ముద్రించింది. గ్రంథకర్త దేవస్థానం అర్చకులు శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగాచార్యులు గారు. అంతకంటే ప్రమాణమేముంటుంది ? అందులో ఇలా ఉంది.



"ఇందు కొండకు దిగువ భాగమున ప్రసిద్ధమైన పురాతనమైన శ్రీకాశీ విశ్వనాథ, శ్రీరామలింగేశ్వరస్వామి వార్ల ఆలయములున్నాయి. ఇందలి శివ లింగము కథ మిక్కిలి విచిత్రమైనది. పూర్వమిది శ్రీరామచంద్రుని మ్రోలనుండెడిదట. శ్రీవైష్ణవులగు అర్చకస్వామివారు సూర్యోదయ సమయమున తీర్థ బిందెకు గోదావరి కేగునపుడు దీనిని బిందెలోపల దాచుకొని పోయి నదిలో పడవేయుచుండిరి. పగలంతయు వీరికి గుడిలో లింగోపద్రవము తప్పుచుండెను. ఉదయమే మరల నాలయపు తలుపులు తెరువగా ఇది స్వామి మ్రోల ప్రత్యక్షముగా తిష్ఠ వేసుకొని యుండి దర్శన మిచ్చుచుండెడిదట. వారు మఱల మోసుకొని పోయి దీనిని నీటిలో బారవేయు చుండిరి. కాని ఫలితము లేకుండెను. పిమ్మట ఈ పీడ శాశ్వతముగా వదిలించుకొను మార్గము నరయుచు శ్రీరామార్చకులీ లింగమునకు ప్రత్యేకాలయము గట్టించి యందు శ్రీరామలింగేశ్వరస్వామి యను

గౌరవనామముతో ప్రతిష్ఠించిరి. తదనంతరము ఈ శివలింగం శ్రీవైష్ణవుల జోలికి పోలేదు". ఇది గ్రంథమందలి యథాతథా విషయం. ఆ శివునకు ఆలయం పునర్నిర్మించి పునఃప్రతిష్ఠ జరిపితే మరల తన శక్తియుక్తులు చూపి భక్తుల ననుగ్రహిస్తారనటంలో సందేహం లేదు. పూర్వపు అర్చక స్వామి తాను శ్రీవైష్ణవుడయ్యు యథార్థం వ్రాసినందుకు వారికి జోహారులర్పించ వలసిందే. ఏనాడో ప్రాచీన కాలంలో వ్రాసిన గ్రంథమని దానిని ప్రక్కనపెట్టవలసిన పనిలేదు. రామనారాయణ వాదానికి ముఖ్య వ్యక్తి అయిన శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులు గారు గౌరవ సంపాదకులుగా నున్న 'భద్రాద్రి రామదర్శిని' మాసపత్రిక ప్రత్యేక సంచిక 27వ పేజీలో కూడా ఈ అంశం కనపడుతోంది. ఇటీవల కూడా ఆ విషయం ప్రచురితమయి నందున పై శివలింగ సంఘటన యథార్థమని స్పష్టం.

ఈ శివలింగపు యథార్థ చరిత్ర లోకం గ్రహించేటట్లు వ్రాయటం వలన ఇటీవల కొందరికి గ్రంథకర్త శ్రీమాన్ రంగాచార్యులుగారిపై కోపంగా ఉంది. వారి మీద కూడా కుట్రలు ఆరంభించారు. ఆయనకు మెంటల్ వచ్చి అలా వ్రాశారని, అందుకే ఆ గ్రంథాలన్నీ దాచిపెట్టి, గోదావరిలో పారేశామని స్వయంగా శ్రీమాన్ మురళీ కృష్ణమాచర్యులు గారే 12-3-2018 నాడు జరిగిన భక్తి టి.వి. చర్చావేదికలో చెప్పారు. యూ ట్యూబ్‌లో అందరూ చూడవచ్చు. అలనాటి వారు శివలింగాన్ని గోదావరిలో పారేస్తే నేటి మహానుభావులు ఆ చరిత్రనే గోదావరిలో పారేసి దాని నామరూపాలు లేకుండా చేద్దామనుకున్నారు. మర్డరు కేసుకు ఉన్న సాక్షిని కూడా మర్డరు చేసినట్లన్నమాట. ఎంతటి క్రిమినల్ బ్రెయిన్‌లో ఆలోచించండి. ఇక్కడ వారి దురదృష్టవశాత్తు కొన్ని గ్రంథాలు గోదావరిలో దొరికాయో, ఎలా స్వీకరించారో బయటకు వచ్చాయి. దైవద్రోహం కప్పి పుచ్చగలరా ? అసలు తమ గౌరవ సంపాదకత్వం గల పత్రిక సంచికలోకూడా ఆ విషయం ఉన్నదంటే దీనికి ఎవరిని మెంటల్ వారుగా ప్రకటించాలి ? ఎన్ని గ్రంథాలు గోదావరిలో పడెయ్యాలి ఇక నాకు, నా యీ గ్రంథానికి ఏ గతి పట్టిస్తారో ! అన్నట్లుగానే ఒక పెద్ద మనిషి విలేఖరుల ముందే దీనిని చించాడు. మరోవ్యక్తి భద్రాద్రి సీతారామలక్ష్మణులు సీతమ్మ మంగళ సూత్రాలు, కల్యాణమండపం ఉన్న ఈ పుస్తకాలను తగలబెట్టమని పిలుపునిచ్చాడు. అదీ వారి సంస్కారం. వారన్నట్లు రచయిత రంగాచార్యులుగారు మెంటల్ మనిషి అనుకుంటే ఆ గ్రంథం యం.ఎల్.సి. అయిన శ్రీ ఎస్.టి.పి. కూర్మా చార్యులుగారి పర్యవేక్షణలో

వ్రాయబడినట్లు గ్రంథాదిన ఉంది. మరి కూర్మాచార్యులు గారికి కూడా మెంటలే అంట గట్టుతారా ?

నాటి ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ అల్లూరి మూర్తిరాజుగారు. వారు స్వయంగా ముందుమాటలో ఇలా వ్రాశారు. "పెద్దల సలహా ననుసరించి ఈ పుస్తకము అచ్చువేయించ సంకల్పించి ఈ పని సంస్కృతాంధ్ర పండితులు, మా ట్రస్టు బోర్డు సభ్యులు శ్రీమాన్ యస్.టి.పి.వి. కూర్మాచార్యులుగారికి, పండిత ప్రముఖులు, దేవస్థానం అర్చకులు శ్రీమాన్ పొడిచేటి శ్రీరంగాచార్యులు గారికి అప్పచెప్పగా వారు శ్రమించి అనేక పౌరాణిక, చారిత్రక విషయములను సేకరించి" వ్రాసినట్లు చెప్పారు. ఇద్దరూ వైష్ణవులే అనేది గుర్తించాలి. ఇలా ప్రమాణాలను తూలనాడటం ఎట్టివారికిని తగదు. సత్యాన్ని అంగీకరించగలదే ఉత్తమ స్థితి. ఈ విషయం ఆ పూర్వకాలపు రచనలలోనే కాదు, ఇటీవల వెలువడిన 'భద్రాద్రి రామదర్శని' శ్రీరామచంద్రస్వామి వారి సమాచార పత్రికలో కూడా 25వ పుటలో ఉంది. శ్రీరామాలయానికి దక్షిణంగా రంగనాయకుల గుట్ట క్రింద అతి ప్రాచీనమయిన శివాలయం ఉంది. ఆ శివమూర్తి రాముని మ్రోల ఉండేది. అర్చకస్వామి ఆ శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారని ఒక ఐతిహ్యం ఉంది అని ఉంది.

స్థపతిగారు కూడా తమ గ్రంథంలో ఇలా వ్రాశారు. "ఇచ్చట భద్రాద్రి చతుర్భుజరాముని మూర్తులు బింబ ప్రాసాదమని, లింగ ప్రాసాదమని రెండు విధములుగా ఉన్నవి. "కాశ్యపశిల్పే లింగప్రాసాదః, బింబప్రాసాదః, లక్షణ విధానే నామ పటలాః" లింగం స్వయంభువుగా ఉండుటచే దాన్ని కదిలించకుండా దాని ప్రమాణంగా, విగ్రహాన్ని అనుసరించి, దేవాలయం నిర్మించడం జరుగుచున్నది. అదే విధంగా బింబ ప్రాసాదం, స్వయంభూ మూర్తి గావున, దాని ప్రమాణంగా ఆలయం పూర్వపు కొలతలతో నిర్మాణం ప్రారంభింపబడినది" అని.

శివలింగం పీకిన యథార్థాన్ని ఏ సంకుచిత భావాలూ లేని మహానుభావులు కాబట్టి శ్రీమాన్ పొడిచేటి రంగాచార్యులు గారు గ్రంథస్థం చేశారు. వారి కుమార్తె శ్రీ దేవిగారి మాటల్లో ఒక మారు శివకల్యాణం చేయించటానికి పురోహితులు లభించక తమ తండ్రిగారి నడిగితే వారు చేయించారట. వారిది ఎంతటి ఉదాత్త వ్యక్తిత్వం! వారిని వారి కుమార్తె శ్రీదేవిగారు ఈ శివలింగ వృత్తాంతం అడిగితే ఆ నిజాన్ని చెప్తుంటే కన్నులలో వెలుగు కన్పడ్డదని చెప్పారు. ఆ శివలింగం రాముని ముందు

ఇప్పుడు పాత్రలు వంటివి పెట్టే ప్రాంతంలో రాముని పొందు ఉండెడిదని చెప్పారట. వారియందసూయతో దూషించే వారి పాపానికి నిష్కృతి లేదు.

అర్చక కుటుంబానికి చెందిన శ్రీమతి చక్రవర్తుల లక్ష్మీనరసమ్మగారు వ్రాసిన శ్రీ భద్రాచల క్షేత్ర మాహాత్మ్యం లోని 59వ పేజీలో కూడా ఈ శివలింగం విషయం చెప్పబడింది. ఇంకా విశేషము ఏమంటే ఆ గ్రంథాన్ని చారిత్రాత్మకంగా ప్రామాణికమైన రీతిలో పొందుపరచినట్లు శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు గారు ప్రశంసిస్తే శ్రీ కోటి రామకృష్ణమాచార్యులు గారు ప్రామాణికమైన అనేక చారిత్రక విషయాలతో సమగ్రంగా వెలయించారని కొనియాడారు. కాబట్టి ఈ శివలింగం వృత్తాంతాన్ని ఇద్దరూ ఒప్పుకున్నట్లే కదా!

## 4) పన్నిద్ధ ఆళ్వారులను పెట్టేశారు.

తాము తలచినట్లు దానిని కేవల వైష్ణవ క్షేత్రం చేయాలంటే పన్నిద్ధరాళ్వారులను ప్రతిష్ఠించాలని నిశ్చయించారు. అందుకు ప్రతిబంధకమైన శివలింగం పీకేశారు. కాని ఒక స్మార్తుడు పన్నిద్ధ ఆళ్వారులను పెట్టాడంటే నమ్మరు. కాబట్టి తమ వ్యూహాలన్నీ నెరవేరాలంటే అసలు గోపన్ననే వైష్ణవుణ్ణి చేస్తే సరిపోతుందని ఆలోచన వచ్చింది.

కంచర్ల గోపన్నగారి 9వ తరం పండితులు శ్రీ కంచర్ల పాండురంగశర్మగారు ఆగష్టు 2017 దర్శనం పత్రిక కిచ్చిన ఇంటర్వ్యూలో ఆళ్వారులను రామదాసు ప్రతిష్ఠించలేదు. ఆళ్వారుల విగ్రహాలతో బాటు తన విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయాలని అనుకుంటే రామాలయంలోనే తన బొమ్మను పెట్టుకొనేవాడు కదా! రామదాసుగారి తర్వాత కాలంలో ఆళ్వారుల ప్రతిష్ఠ జరిగింది. వైష్ణవ అర్చకస్వాములే శివలింగాన్ని తీసివేసి ఆళ్వారులను ప్రతిష్ఠించారని చెప్పారు. దేవస్థానం వారు వేయించిన ప్రాచీన గ్రంథం భద్రాచల క్షేత్రచరిత్రలో తరువాత కాలంలో స్వామివారి ప్రధానాలయం చుట్టూను ఆళ్వారులు వేంచేసి యుండిరి అన్నారు. వీళ్ళు పెట్టుకున్నవే కాబట్టి మళ్ళీ మళ్ళీ మార్చటాలూ జరిగింది. కొండపల్లి వారి గ్రంథంలో ఆలయమును ప్రదక్షించి వచ్చునప్పుడు భద్రుని కోవెలయు, మంటపమును రామదాసు నిర్మితములు కలవు అన్నారు తప్ప ఆళ్వారులను ప్రతిష్ఠించిన ఊసేలేదు. వీరు పెట్టిన పన్నిద్ధరాళ్వారుల స్థానంలో మార్పు ఉంది. ఆళ్వారులు ప్రపన్నులు. భగవంతునకు ప్రపన్నులు కుడివైపు,

దాసులు ఎడమవైపు ఉంటారు. కాని తరువాత కాలంలో పెట్టే ఈ పన్నిద్దరాళ్వారులు ఎడమవైపున పెట్టబడ్డారు.

## 5) రామదాసు గురువును మార్చేశారు

అసలు గోపన్నకు గురువు కబీరుదాసు. ఈ దాస సంప్రదాయం ఉత్తరాదిదే. కాళిదాసు, తులసీదాసు, సూరదాసు, కబీర్‌దాసు. ఆ బాటలో నడచిన దక్షిణాదివారు. పురందరదాసు, రామదాసు. వారి ప్రతిపాదన కొక మంచి సాకు నెంచుకున్నారు. అదేమంటే కబీర్‌దాసు 15వ శతాబ్దివాడు. రామదాసు 16వ శతాబ్దంవాడు. ఆయన ఈయనకు ఎలా ఉపదేశిస్తాడు ? కాబట్టి మా భట్టరుగారే రామదాసు గురువని వాదన ఆరంభించారు.



శ్రీజియర్ స్వామివారి దర్శనం చేసివచ్చామంటే వారిప్పుడెక్కడున్నారు ? అంటే ఎలా? వారి పరంపరవారంతా జియర్ స్వాములుగానే గ్రహించడం లేదా? అలా కబీరు పరంపర అంతా కబీరుగా చెప్పబడతారు. ఈ విషయం వేదం వేంకటరాయశాస్త్రి ప్రభృతు లెందరో చెప్పారు. రామదాసు చరిత్ర తెలిపే ప్రాచీన గ్రంథాలేవి చూచినా రామదాసు గురువు కబీరనే స్పష్టంగా ఉంటుంది. 1832లోనే కబీరుదాసు కటాక్షమున గాంచె రామనామమును అని గాండ్ల వరదరామదాసు చెప్పారు. 1911లో వావిళ్ళ రామస్వామి సన్స్ వారిచే ముద్రితమయిన శ్రీ తిక్కడియూరు శ్రీకృష్ణదాసు గ్రంథంలో కబీరు వచ్చి రామమంత్రం ఉపదేశించినట్లున్నది. రఘునాథ భట్టరు లేరు. 1926 నాటి కేశిరాజు వెంకట సుబ్బరాయ కవి రామదాసు గ్రంథంలో రఘునాథ భట్టరు ఊసు లేదు. 1923 ప్రాంతంనాటి కేతవరపు శివరామశాస్త్రి గారి

భక్త రామదాసు ధర్మవరపు గోపాలాచార్యులుగారి 'రామదాసు' నాటకాలలో కూడా కబీరే గురువుగా చెప్పబడ్డాడు. భట్టరు లేరు. వేటూరి ఆనందమూర్తిగారు భక్త కబీరుదాసు రామ మంత్రం ఇచ్చాడని, అపుడు రామదాసు 'తారక మంత్రము కోరిన దొరకెను ధన్యుడనైతిని 'ఓరన్నా ! కీర్తన వ్రాశా'డని చెప్పారు.

కేసిరాజు సుబ్బరాయ కవి వేదం వేంకటరాయశాస్త్రి గారి వలె నారుమంచి సుబ్బారావుగారి గ్రంథమందు కూడ కబీరు శిష్య పరంపరలోని కబీరు ఉపదేశించినట్లు చెప్పారు. నాదెండ్ల పురుషోత్తమ కవి రామదాసు చరిత్ర యందు, హిందూస్థానీ నాటకమున కబీరు ఉపదేశించినట్లున్నది. చల్లా పిచ్చయ్య గారు కూడా కపీరు రామదాసుకు రామమంత్రోపదేశం చేసినట్లు చెప్పారు. తూము నరసింహదాసుగారి అనుయాయి సింగరదాసుగారి రామదాసు చరిత్రలో కపీర్‌దాసు ఉపదేశించినట్లే ఉంది. ఇలా పూర్వకవులందరూ కబీరుదాసు రామదాసుకు రామమంత్రోపదేశం చేసినట్లే స్పష్టంగా చెప్పారు. రఘునాథ భట్టరు ఊసులేదు. కొండపల్లి రామచంద్రరావుగారు కూడా 23 వ పుటలో శ్రీ పొడిచేటి వారి గ్రంథం 74వ పుటలో కబీరుదాసు ఉపదేశించినట్లే వ్రాశారు. భద్రాచలంలో కబీరుదాసు విగ్రహము రామదాసు గురువయినందున ఉన్నది తప్ప రఘునాథ భట్టరు విగ్రహం లేదు.

రామదాసు రచనలలో నిశ్చయంగా చెప్పదగినది. బహుళ ప్రచారంలో ఉన్నది దాశరథీ శతకం. దానిని తమ వ్యూహానికి సాధనంగా వినియోగించుకున్నారు. దానిలో కొన్ని పద్యాలను ప్రక్షిప్తాలుగా చేర్చారు. అంటే తరువాత చేర్చినవన్నమాట. సాహిత్యంలో ఈ విధానాలు భారత భాగవత రామాయణాలలోనూ ఉన్నాయి. శంకరాచార్యుల వారి భజగోవింద శ్లోకాలు పెరగటం, వేమన శతకం పెరగటం ఇట్టిదే. ఆనాడు కాదు ఈనాడు భద్రాద్రిలో అట్టివి చాలా జరిగినవి ముమ్ముందు చూస్తారు. అలా దాశరథీ శతకంలో ప్రక్షిప్త వ్యూహం జరిగింది. శతకంలో గ్రంథాది స్తుతి అయిన పిదప మూడవ పద్యం.

**"అగణిత సత్యభాష ! శరణాగతపోష ! దయాలసజ్జరీ**
**విగత సమస్తదోష ! పృథివీ సురతోష ! త్రిలోకపూతకృత్ 3**

అని తన బాణీలో దీర్ఘపూర్వక షకారం అంత్యప్రాసగా చూపాడు.

4వ పద్యంగా

**“రంగ దరాతి భంగ ! ఖగరాజతురంగ ! విపత్పరంపరో**
**త్తుంగ తమః పతంగ ! పరితోషితరంగ ! దయాతరంగ సత్సంగ ! 4**

అని స్తుతి పరంగానే బిందుపూర్వక గకార అంత్య ప్రాసతో వ్రాశాడు. 5వ పద్యంగా

**శ్రీద! సనందనాది మునిసేవిత పాద ! దిగంతకీర్తి సం**
**పాద ! సమస్త భూత పరిపాల వినోద ! విషాద వల్లికాచ్ఛేద ! 5**

అంటూ ఇలా అంత్యానుప్రాసలతో స్తుతులతో పద్యాలు నడిచిపోయాయి. కాని మధ్యలో 6వ పద్యంగా వీరి ప్రక్షిప్తం చేర్చారు. గ్రంథాదినే గురువందనం కూడా చేయటం పద్ధతి. దైవలీల – వారి దొంగ చేష్ట బయట పడేటట్లు ఇక్కడ ఒక పద్యం చక్కగా భట్టరాచార్యులను ప్రాసలో ఇరికిస్తూ ఉన్నది. అది

**ఆర్యులకెల్ల మ్రొక్కి వినతాంగుడనై రఘునాథ భట్టరా**
**చార్యుల కంజలెత్తి కవి సత్తములన్ వినుతించి కార్య సౌ**
**కర్య మెలర్ప నొక్క శతకం బొనగూర్చి రచింతు నేడు తా**
**త్పర్యమునన్ గ్రహింపు మిది దాశరథీ ! కరుణాపయోనిధీ ! 6**

శతకం వ్రాస్తానంటూ చెప్పే వ్యక్తి మొదట్లో ఆ మాట చెప్పి గురువందన సుకవి స్తుతులు చేస్తాడు కాని కొన్ని పద్యాలయాక గ్రంథాదికృత్యాలు నిర్వహిస్తాడా ? తొలిలో ఉండవలసినది భగవల్లీలవల్ల ఇక్కడ ఇరికించారు. దాని పిదప

**మసకొని రేగుపండ్లకును మౌక్తికముల్ వెలవోసినట్లు దు**
**ర్వ్యసనముజెంది కావ్యము దురాత్ముల కిచ్చితి మోసమయ్యె. 7**

ఇత్యాదిగా ఏడవ పద్యాన్ని ఉంచారు. ఇది మరీ ఘోరం. రామదాసు దుర్వ్యసనాల పాలవటం కాని, డబ్బు కోసం కవిత్వం అమ్ముకొనటం కాని అసంగతమయిన విషయాలు. ఆ పుణ్యాత్మునకు వ్యసనము లంటగట్టడం విచారకరం. చిననాటి నుండి గోపన్న భక్తుడు, యోగ్యుడు తప్ప దుర్వ్యసనుడనటానికి ఆధారం లేదు. అసలు రామదాసు రచనలలో అట్టిది లేదు. అలా కొనుక్కొన్న కృతి భర్త ధనికుడయినపుడు దాన్ని స్థిరపరిచేవాడే. వైష్ణవుడు కాకముందు అతడు దుష్టుడని, వైష్ణవుడయ్యాక సన్మార్గుడు అయ్యాడనీ, అనటం కోసం దీనిని పెట్టారు. ఇదంతా భట్టరనే గురువను కల్పించటం కోసం చేసిన కుట్ర. ఈ రెండు పద్యాల తరువాతి పద్యం 8వ పద్యం.

**"శ్రీరమణీయ హార ! యతసీ కుసుమాభ శరీర ! భక్త మం**

**దార ! వికారదూర ! పరతత్త్వ విహార ! త్రిలోక చేతనోద్ధార !   8**

అని దీర్ఘపూర్వకరేఫ అంత్యాను ప్రాసగా నడిచింది. 3, 4, 5 పద్యాల నడక మరల ఇందులో కనపడుతుంది. ఇది గోపన్న రచనా విధానం. మధ్యలో రెండు పద్యాల తేడా ఎవ్వరయినా గుర్తించగలరు. మరల 9వ పద్యం.

**"దురిత లతా లవిత్ర ! ఖరదూషణ కానన వీతిహోత్ర ! భూ**

**భరణ కళావిచిత్ర ! భవబంధ విమోచన సూత్ర !   9**

అనేది ఇందు 'త్ర' అనేది అంత్యప్రాసగా నడిచింది. రామదాసు రచనగా ఇది స్పష్టమవుతుంది. 6, 7 పద్యాలు మధ్యలో చేర్చిన ప్రక్షిప్తాలుగా పండితులకే కాదు, పరిశీలిస్తే బాలకులకు కూడా అర్థమవుతుంది. కాబట్టి ఈ ఉన్న ఒక్క భట్టరాధారమూ కల్పితము, కృత్రిమము, ప్రక్షిప్తము అని స్పష్టం. ఇలాగే చివరలో తన తండ్రిని గూర్చి వ్రాసికొన్నచోట భట్టరుగారి పద్యం ఇరికించారు. వైష్ణవం చేయదలచినందున "శ్రీరమ సీతగాగ" అనే పద్యాన్ని కూడా ఇరికించారు. అందువల్ల కొన్ని ప్రతులలో పద్య సంఖ్య పెరిగి, కొన్నిట తరిగి వేర్వేరు ప్రతులలో, 100 నుండి 114 దాకా ఉన్నాయి. వీటిలో 14 దాకా ప్రక్షిప్తాలని అంచనా 108 పద్యాలకు స్థిరం చేసిన ప్రతిని బట్టి చూస్తే ఆరు పద్యాలు ప్రక్షిప్తాలని అర్థం. చాలా మంది 103 పద్యాలు స్వీకరించారు. ఆ పక్షాన 11 పద్యాలు ప్రక్షిప్తాలని గ్రహించాలి. అలాగే కొన్ని పదాలు కబీరు గురువన్న వేమయిన ఉంటే తొలగించారా అనేది కూడ చెప్పలేము. దీని పరిణామ మేమంటే భట్టరుగారిని పద్యాలలో ఇరికించిన పిదప వచ్చిన రామదాసు చరిత్రలలో మాత్రం రచయితలు రామదాసు గురువు భట్టరు నుట్టంకించారు. ఎటూ తేల్చుకోలేని కొందరు ఇద్దరినీ ప్రస్తావించారు. అలనాడు చేసిన కవిత్వపు ద్రోహాన్ని ఇటీవలివారు కొందరు గుర్తించటంతో ఈ కాలపువారు కూడా పూర్వపు దోషుల పాపంలో పాలు పంచుకుంటున్నారు.  అది ఎలా జరిగిందో గమనించండి.

ముందుగా తెలుగు దాశరథీ శతకం దేవాలయంలో భట్టరుగారి పద్యం 6వదిగా ఉంచుచునే శిలాఫలకంగా లిఖింపబడింది. అప్పటికి ప్రక్షిప్తం చేర్చటంలో జరిగిన తప్పును గుర్తించలేదు. తరువాత గుర్తించిన వైష్ణవ సమాలోచకులు శ్రీమాన్ ఎస్.టి.జి. వరదాచార్యులుగారు తాము దాశరథీ శతకాన్ని సంస్కృతంలోకి అనువదిస్తూ 6వ పద్యాన్ని 9వ పద్యంగా మార్చింది శిలాఫలకంలో వేయించారు.

దానిని మరింత స్థిరం చేయటంలో భాగంగా శ్రీమాన్ జి. మురళీకృష్ణమా చార్యులు గారి ముందు మాటతో 2011లో వెలువరించిన శ్రీభద్రాద్రి స్తోత్ర మంజరిలో దాశరథీ శతకంలో కూడ భట్టరు గారి పద్యాన్ని 9వ పద్యంగా మార్చివేశారు. వారి కృషి వృథా పోలేదు. ఇటీవల శ్రీమాన్ ఎస్.టి.జి. అంతర్వేది కృష్ణమాచార్యులవారు పై తమ వారిది ప్రమాణంగా భావించి శ్రీరామసేవా సమితి, ఢిల్లీ వారు ప్రచురించిన దాశరథీ శతకంలో 9వ పద్యంగా యిచ్చారు. వీరికి దురాలోచన లేదు కాబట్టి జరిగిన పొరపాటును సూచిస్తూ ఆ సంస్థ వారు స్టాంపు తయారు చేయించి వేసి మిగిలిన ప్రతులు వినియోగిస్తున్నారు. ముందుతరాలవారు ఈ పాపంలో భాగస్వాములు కాకుండాలనే సదభిప్రాయంతో ఈ విషయాన్నింతగా వివరింపవలసి వచ్చింది. ఇప్పటి వరకు మాత్రం దాశరథీ శతకాల నందరూ భట్టరు గారి ప్రక్షిప్త పద్యాన్ని 6వ పద్యంగానే ఇచ్చి ఉన్నారు. మరో విచిత్రమేమంటే శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యుల గారి స్తోత్రమంజరి 2008 ముద్రణలో ప్రక్షిప్తాన్ని 6వ పద్యంగానే ఇచ్చారు. 2011 నాటి పునర్ముద్రణ సమయానికి వరదాచార్యులుగారి ఆంతర్యం గ్రహించి 9వ పద్యంగా ఇచ్చారు. సాహిత్యపు లోతు నెరిగి ప్రక్షిప్తాన్నేర్పరచటంలో పై వారి పొరపాటు గుర్తించి సంస్కృత శిలాఫలకంలో 9వ పద్యంగా ప్రకటించటానికి మార్గం చేశారు కాని తెలుగు శిలా ఫలక శతకంలోని 6వ పద్యాన్ని 9గా మార్చలేరు కదా. ఇలా ఏదో సాధించామనుకొన్నారు కాని పప్పులో కాలు బాగా లోతుకి పోతోందని గుర్తించ లేదు. అదేమంటే గ్రంథాదిని ఉండవలసిన గురుస్తుతి, సుకవిస్తుతి కొంత రచన అయ్యాక ఆరవదిగా ఇవ్వటమే తప్పుగా భావించాం. అది ఇంకా దూరం 9వ పద్యానికి వెళ్ళటమంటే తప్పును మరింత పెంచుకొన్నట్లేగా

మరో ముఖ్య విషయం ఏమంటే కంచర్ల గోపన్న నేలకొండపల్లెలోని తన గృహాన్ని పురోహితులైన జన్నాభట్ల సీతారామయ్య గారికి దానమిచ్చారు. దానపత్రం నకలు నేటికీ ఉంది. అంతే తప్ప భట్టరుగారికి ఇవ్వలేదు. అసలు భట్టరు అనే వారు ఉంటే కదా ! ఆయన కల్పిత వ్యక్తి కాక నిజమై ఉంటే అన్నీ తానైన భట్టరుకే ఇచ్చేవారు. భట్టరుగారు నిజమై, గతించి ఉంటే మరే వైష్ణవునికో ఇచ్చి ఉండేవారు. ప్రభుత్వ నియామకాలు జరిగే ప్రస్తుత కాలంలో కూడా స్మార్తులే పురోహితులుగా ఉండటం గమనార్హం.

## 6) శిలాఫలకంలోనిది మార్చి వ్రాశారు

అలా పద్యాలను మారుస్తారా ? చేరుస్తారా ? అని సందేహించనక్కర్లేదు. ఆ హస్తలాఘవాలు నేడూ జరుగుతున్నాయి. భద్రాద్రి ఆలయంలోని రాముణ్ణి రామ నారాయణునిగా మార్చడం కోసం చాలా తంటాలు పడుతున్నారు. దాశరథీ శతకాన్ని శ్రీమాన్ యస్.టి.జి. వరదాచార్యులు గారు సంస్కృతంలో అనువదించారు. అది శిలాఫలకాన చెక్కబడింది. ఆలయంలో శిలాఫలకంపై 'సీతారామ రమేశరామ మహిత జ్ఞాన స్వరూప ప్రభో' అని ఉంది. దానిని శ్రీభద్రాద్రి రామస్తోత్రమంజరి (పేజీ 89)లో 'సీతారామ రమేశ రామ చిన్మయ హరే శ్రీరామనారాయణ' అని మార్చడం జరిగింది. ఛందస్సు భంగమైపోయింది. దీనిని పండితులు గ్రహిస్తారనే స్పృహ కూడా లేకుండా మనం ఎలా మారిస్తే అలాగే దానిని ప్రజలు గ్రహిస్తారనే ధీమాతో రచయితలు వ్యవహరించారు. దీనికి నిదర్శనం శ్రీమాన్ యస్.టి.జి. కృష్ణమాచార్యుల వారి 'శతపత్రం' అనే గ్రంథమే. అందులో స్తోత్రమంజరి ననుసరించి వ్రాసేశారు తప్ప ఫలకం లోని రచయిత మూలాన్ని స్వీకరించలేదు. ఇప్పుడిలా చెప్పకపోతే అదే స్థిరమవుతుందని మూలం మార్చి వ్రాసిన వారి ఆశ.

## 7) పుస్తకాల విషయం మార్చారు

రామనారాయణ అనేది ఆఫ్టర్ థాట్. అది ముందే కనుక వచ్చి ఉంటే శతకంలో చాలా చోట్ల ఆ ప్రకారం చేర్చేసేవారు. అలా ఎందుకు చేస్తారని అనుకోనక్కర్లేదు. గోపన్న వంశంలోని 9వ తరం పండితులు కంచర్ల పాండు రంగశర్మగారు 'రామదాసు చరిత్ర' వ్రాసి, 1963, 96లలో ముద్రించారు. దానిని మరల అన్యుల పరిష్కారంతో పునర్ముద్రించారు. మూలంలో తను 'రామనారాయణ' అనే పదప్రయోగం ఒక్కసారి కూడా చేయలేదని శర్మగారు వాపోయారు. ఐతే పునర్ముద్రణలో ఆ పదం 11 సార్లు ప్రయోగింపబడింది. రఘునాథ భట్టరు అనే పదాన్ని 39సార్లు ప్రయోగించారు. మోసం జరిగిందని శర్మగారు తరువాత వాపోతే ప్రయోజనమేముంది ?

చరిత్రకు సత్యం కావాలి. కల్పనకు ఏదైనా చెప్పవచ్చు కదా ! అలా కల్పిత వ్యక్తి అయిన రఘునాథ భట్టరుకు అన్ని పదవులూ అంటగట్టారు. చిన్నప్పుడు

రామదాసుకు పాఠాలు చెప్పింది ఆయనే. ఉర్దూ నేర్పింది ఆయనే. వైద్యుడు, అర్చకుడు, చివరకు రామదాసుకు సన్యాసదీక్షను ఇచ్చినది కూడా ఆయనే అని వ్రాశారు. ఆయన ఎన్నేళ్ళు బ్రతికారో ఊహించలేము.

సన్యాసాశ్రమం స్వీకరించి ఇచ్చే అర్హత కలవారు జీయరులు. భట్టరు గారు సన్యాస దీక్షా వస్త్రాలిచ్చారని అంటూ ఆ భట్టరు సంప్రదాయాన్నే మోసగించడం బాధాకరం. అంతేకాదు. బులుసువారి గ్రంథంలో, జనవ్యవహారంలో కూడా రామదాసు పూర్వజన్మలో శివభక్తుడని ఉంది. శివభక్తిచే ఇటువంటి అదృష్టం కలుగుతుందనే అన్వయాన్ని భరించలేక ఈ గ్రంథంలో అక్బరు గత జన్మలో శివారాధకుడని కల్పించి వ్రాశారు. అంటే శివారాధన చేస్తే తురుష్కుడుగా పుడతాడని చెప్పడం వారి లక్ష్యం. పాపం ఎవరు చేసినా, గ్రంథం మీద పేరు తనదే కాబట్టి కంచర్ల పాండురంగ శర్మగారు అందుకు చాలా బాధపడ్డారు.

వీరి వ్యూహం ఇంతటితో ఆగలేదు. కొండపల్లి రామచంద్రరావుగారి భద్రాచల క్షేత్ర చరిత్రము 28-9-1956 నుండి ఆంధ్ర పత్రికలో ఆదివారాలలో ధారావాహికంగా వెలువడింది. స్థల విశేషములు అనే 13వ శీర్షిక వరకు ఈ రచన చేయబడింది. ఆ శీర్షిక అయ్యాక " నీ కథ నీకే యొసగెద" అనే పద్యం వ్రాసి మంగళమ్' అని 'సమాప్తం' అని రచన ముగించారు. స్వయంగా లైబ్రరీలో 1956 నాటి పాతపత్రికలు తీయించి చూచాను. అయితే తరువాత ఎవరు పెంచారో కాని మరో 14 పేజీలు పెంచి అందులో 80వ పేజీలో మొదటి పేరా తరువాత దీనిని చదువుకొన వలెను అంటూ రామదాసుగా శ్రీసీతారాములను లక్ష్మీనారాయణులని అనేక విధాల నిరూపించి యున్నారని, రామనారాయణ అన్నారని, అచ్యుత గోత్రం, సౌభాగ్య గోత్రం చెప్తారని, జానకీ దశరథుల ప్రసక్తి ఇచ్చుటలేదని ఇప్పటి వాదానికి కావలసినదంతా కల్పి అనంతరం ముద్రించి దీనిని తమకు సాక్ష్యంగా చెప్పుకొంటున్నారు. ఈ కూట సాక్ష్యం, దొంగ సాక్ష్యం ఎలా చెల్లుతుంది ? ఇంతటి సాహితీ ద్రోహ, దైవద్రోహ, ధర్మద్రోహం చేసేవారిని భగవంతుడు క్షమిస్తాడా ? అనేది భగవద్భక్తులాలోచించాలి. ఈ రచనలో రామచంద్రరావుగారు జానకీ దశరథ పరివారంగానే చెప్పుకొనేవారని, సీతారామచంద్రుల కళ్యాణం వైభవంగా జరిగేదని చెప్పారు. ఇలా వారు స్వవచన వ్యాఘాతం చేసుకోరు కదా ! కాబట్టే దీన్ని ప్రత్యేకంగా రామనారాయణ వాదులు కల్పించి కల్పుకున్నారు. ఈ ప్రత్యేకంగా ఇచ్చిన విషయం

అందు ఏ రీతిని అతుకదు. పత్రికలో ప్రకటించినదే వారి రచనము. అనంతర భాగంలో రామచంద్రరావుగారి దెంతో, వీరిదెంతో చెప్పజాలము. కొంత కల్పుటే కాదు. మహీధర జగన్మోహనరావు గారు రెండు పర్యాయాలు ముద్రింపించారు. అవి మాత్రమే రామచంద్రరావు గారి పరిధిలో వెలువడినవి. అనంతర ముద్రణమున ఎవరి హస్తలాఘవము లెంత జరిగినవి చెప్పజాలము. పరిచయ వాక్యాలు వ్రాసిన ఖండవల్లివారివి, పూజ్యుల ఆశీస్సులు ఉంటే అవియు కనపడుట లేదు. వారికి కండ్లుపోయిన విషయం వారి శతకం వలన స్పష్టం. తదుపరి చేర్చిన ఈ రామనారాయణ, కళ్యాణ ప్రవరలు వారు చూచి యుండక పోవచ్చు కూడా. ఈ కృత్రిమ చర్యలు తమకు ప్రమాణములుగా కల్పించుకొనుట సమ్మతం కాదు.

## 8) రామదాసే తమను శ్రీరంగం నుండి తీసుకొని వచ్చారని బొంకారు

ఏనాడో అది శ్రీవైష్ణవార్చకుల చేతిలోకి పోయింది. రామదాసే ఐదు కుటుంబాలను శ్రీరంగం నుండి అర్చకులుగా తెచ్చారంటారు. వారు పొడిచేటి, అమరవాది, కోటి, గొట్టిపూళ్ళ, తూరుకోటి ఇంటిపేర్ల వారు. కానీ కొండపల్లి రామచంద్రరావు గారు తమ గ్రంథం 26వ పుటలో కాంచీనగర ప్రాంతమునుండి ఆయా గోత్రముల వారగు వివిధ కుటుంబాలను నిలిపి పూజలు జరిపించినట్లు చెప్పారు. పొడిచేటి రంగాచార్యులుగారు శ్రీ భద్రాచల క్షేత్ర మాహాత్మ్యం 196వ పేజీలో “శ్రీరామదాసుగారు శ్రీరామచంద్రమూర్తి వారి ఆరాధన నిమిత్తం 5 విభిన్న గోత్రముల వారిని వివిధప్రాంతముల నుండి కొనివచ్చినట్లు స్పష్టంగా వ్రాశారు. ఆ ఐదు కుటుంబాలలో పొడిచేటి కూడా ఒకటి. కాన ఇది సత్యము కావచ్చు. శ్రీరంగమునుండి తేవడం ఒక అబద్ధపు అల్లిక. అసలు వీరు ఇక్కడివారే. ఇవన్నీ తెలుగుపదాలే. వీరి మూలాలు శ్రీరంగంలో ఉన్నవా అనేది లోతుగా పరిశీలిస్తే తేలుతుంది. పొడిచేడు అనేది తెలంగాణలో నల్గొండ జిల్లా మోత్కూరు మండలంలో ఉంది. అమరవాది ఇంటి పేరుతో అన్నపూర్ణ, చిదంబరయ్య, సుబ్బమ్మ, శివకామసుందరి, సుబ్బరామయ్య, సదా శివయ్య, పార్వతి వంటి పేర్లవారు ఇక్కడ కనబడుతున్నారు. ఈ పేర్లు వైష్ణవులవి కావు. శ్రీరంగానివీ కావు. గొట్టిపూడి అనే ఊరు చిత్తూరు జిల్లాలో ఉంది. ఏమైతేనేమి, రామదాసు మరణించాక ఆలయ వైష్ణవార్చకులకు ఈ హరిహరాద్వైత క్షేత్రాన్ని పూర్తి వైష్ణవ క్షేత్రంగా మార్చాలని బుద్ధి పుట్టింది.

## 9) శివపరివారమును తొలగించే యత్నం చేశారు

అనంతరం వారి దృష్టి గోపురంపై ఉన్న శివపరివారం మీద పడింది. నిర్నిమిత్తంగా ఆ శిలామూర్తులను తొలగించటం సాధ్యం కాదు. గర్భాలయం కొలతలు మార్చాలని ఆలోచన చేశారు. గర్భాలయాన్నే మార్చేటట్లయితే ఆ ముసుగులో తక్కిన నిర్మాణాలనుకూడా మార్చివేసే వీలు కలుగుతుంది. కాబట్టి ఈ రహస్య అజండాతో 1960లో ఆలయ పునరుద్ధరణకు పూనుకున్నారు. ప్రజలలలో వీరి పన్నాగమెరిగిన ఒక వర్గం దానిని ప్రతిఘటించింది. వాదప్రతివాదాలు పత్రికలకు, శాసనసభకు పాకాయి. తుదకు వ్యవహారం శ్రీ కంచి కామకోటి శంకరాచార్య స్వామికి నివేదించి, వారి తీర్పును ఉభయపక్షాలూ అంగీకరించాలని నిర్ణయించారు. ఎస్.టి.జి. వరదాచార్యులవారు కంచి వెళ్ళి, తమ వాదాన్ని వినిపించి వచ్చారు. దివ్యదృష్టి కలిగిన పరమాచార్యుల వారు ఇక్కడివారి ఆంతర్యాలను గ్రహించి ఉంటారు. ఆలయం కొలతలను మార్చవలసిన అవసరం లేదని వారు సూటిగా తేల్చిచెప్పారు. ముందు స్వామివారి మాటను వింటామన్నవారే, పరమాచార్యుల నిర్ణయం వెలువడిన తదుపరి తమ మాటను మార్చి అద్వైత మత ప్రవర్తకులైన కామకోటి శంకరాచార్యుల జోక్యం కూడదనేశారు. అంతటితో ఆగక ఆ వ్యవహారాన్ని హైకోర్టుకు లాగారు. కోర్టులో వారి వాదం నెగ్గలేదు. ఒక అద్భుతం జరిగి ఆ వరదాచార్యులుగారు, వారి కుమారులే ఆ అద్వైత స్వామివారినే మేనాలో ఉంచి స్వయంగా మేనా మోశారు. (నడిచే దైవం – శ్రీ నీలంరాజు వెంకటశేషయ్య).

ప్రస్తుతం ఆలయాన్ని వైభవంగా తీర్చడం కోసం ప్రభుత్వం కొన్ని కోట్లు కేటాయించడం ఆనందదాయకం. ఆ నెపంతో రామదాసు చేసిన హరిహరాద్వైత వ్యవస్థను పూర్తిగా తుడిచి వేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఆ ఆలయాన్ని విల్లిపుత్తూరు, శ్రీరంగం, శ్రీముష్ణంలా మారుస్తామని శ్రీ చినజియర్ స్వామివారు ప్రకటించారు. ఆలయం తెలంగాణా సంస్కృతి నుండి దూరమైపోయి శివ సంబంధం తుడిచి వేయబడవచ్చు. వారు ఏమి చేసినా మనం నోరుమూసుకొని ఉండటమే

వారి విజృంభణకు కారణం. అలా మనము పరోక్షంగా అన్యాయం చేస్తున్నట్లే. ఇక్కడ పీకిన శివలింగాన్ని పునః ప్రతిష్ఠించ గలిగితే ఇక వాళ్ళు మన శివపరివారం జోలికి రారు. కాబట్టి వెంటనే శివభక్తులం జాగరూకులమై భద్రాద్రి ఈశ్వర పరివారాన్ని రక్షించుకోవాలి. భక్తులంతా ముందుకు రండి.



దక్షిణామూర్తి



పార్వతీపరమేశ్వరులు, నంది



గణపతి



నాగేంద్రుడు

## 10) క్షేత్రపాలకుని మార్చారు.

ఆ క్షేత్రానికి సంబంధించి ఏ శివసంబంధమూ ఉండరాదని ప్రక్షిప్తకారుల ఆలోచన. అందుకు తదుపరి చర్యగా క్షేత్రపాలకుడిని మార్చారు. భద్రాద్రి క్షేత్రానికి క్షేత్రపాలకుడుగా వీరభద్రుడు ఉండేవాడు. (శ్రీ భద్రగిరి వైభవం – పేజీ 226). ఆయన శివపరివారం కాబట్టి ఆయనను కాదని, బొబ్బల నరసింహుడనబడే యోగానంద నరసింహమూర్తిని భద్రాచలానికి తీసుకు వచ్చి, గోదావరి తీరంలోని గుట్టపై శ్రీ పాంచరాత్ర ఆగమోక్త విధానంతో క్షేత్రపాలకునిగా ప్రతిష్ఠించారు. ఇలా క్షేత్రపాలకుడిని మార్చడం శాస్త్ర విరుద్ధం. భద్రాద్రి రాముడిని సేవించడానికి ముందు

ఈ క్షేత్రపాలకుడిని సేవించాలని చెబుతారు. అసలు వైష్ణవాలయాలలో శివమూర్తులు, శివాలయాలలో విష్ణుమూర్తులు క్షేత్రపాలకులుగా ఉంటారు. శివద్వేషం ముందు ఆ నియమాలు కూడా పని చేయలేదు. తిరుపతి వేంకటేశ్వరుని క్షేత్ర పాలకుడు శివుడేనని జగమెరిగిన సత్యం. క్షీరారామం రామలింగేశ్వరుని క్షేత్ర పాలకుడు జనార్దనస్వామి. ఇలా అన్నిటా ఉంటాయి. ఆ విచక్షణ కూడా లేని పరిస్థితి భద్రాచలంలోని దుస్థితి ఇది.

## 11) గోత్ర ప్రవరలు మార్చారు

భద్రాద్రికి ముఖ్యమైన కార్యక్రమం కల్యాణం. దానిని సీతారామ కల్యాణంగా శ్రీరామ నవమినాడు నిర్వహించే వ్యవస్థను రామదాసు చేయగా, తెలుగు వారందరూ దానినే అనుసరిస్తున్నారు. భిన్నవాదులు తమ వ్యూహంలో భాగంగా దానిని మార్చడానికి పూనుకొని, ముందుగా గోత్రప్రవరలు మార్చడం మొదలు పెట్టారు. రామునకు కాక, నారాయణునకే అక్కడ కల్యాణం చేస్తే సరిపోతుందని వారి ఆలోచన. దీనితో రాముని గోత్రమైన వశిష్ఠ కాకుండా, నారాయణుని గోత్రమైన అచ్యుతను, సీత గోత్రమైన గౌతమను కాకుండా లక్ష్మీదేవి గోత్రమైన సౌభాగ్య గోత్రాన్ని చెప్పడం మొదలు పెట్టారు. అలాగే సీతారాముల ప్రవరలను కూడా మానేసి లక్ష్మీనారాయణుల ప్రవరలను చెప్పనారంభించారు. సీతారాముల పేర్లు వినపడడం వల్ల భక్తులు ఆ సందోహంలో ఈ మార్పులను గుర్తించలేదు. విజ్ఞులు గుర్తించి, అడిగితే వారిని తృణీకరిస్తూ వచ్చారు. దానికి కాస్త అలవాటు పడగానే రాముడి పేరు మార్చి రామనారాయణుడనే పేరుని సంకల్పంలో చెప్పనారంభించారు. ఎందుకంటే రాముడు శివతత్త్వాన్ని ఎక్కువ చాటుతాడు కదా !

ముందు ఒక మాట వదలటం కొన్నేళ్ళకు దాని నారంభించి మధ్య మధ్య చెప్తూ ఉండటం, క్రమంగా దాన్ని స్థిరం చేయటం వారి రీతి. రామనారాయణ శబ్దం కొండపల్లి వారేదో ఒక్కమారు 1956 లో పత్రికలో వ్యాసరూపంలో ఇచ్చిన భద్రాచల క్షేత్రచరిత్రలో ఇచ్చారు. అది వారి ఆలోచనకు సాధనమయింది. ఆరామనారాయణతో బాటు గోత్రప్రవరలు లక్ష్మీనారాయణులవి చెప్తారని మాటవదిలారు. క్రమంగా ముందు గోత్ర ప్రవరలు భక్తులకు అర్థం కాలేదు కాబట్టి మార్చి తరువాత 2012 ప్రాంతానికి పేరు కూడా రామనారాయణగా మార్చి సమాజం గ్రహించి ఎదురు తిరిగే ఈ

స్థాయికి తెచ్చుకొన్నారు. శ్రీ కొండపల్లి రామచంద్రరావుగారి గ్రంథం పత్రికలో కాని 1970లోపల వెలువడిన రెండు గ్రంథప్రచురణలలో కాని లక్ష్మీనారాయణ గోత్ర ప్రవరలు లేవు. ఆయా గ్రామాల నుండి వచ్చే భక్తులు దశరథుని పక్షంగా మగపెళ్ళివారుగా, జనకుని పక్షంగా ఆడపెళ్ళివారుగా విభాగమై చెప్పుకొనే వారని ఆయన స్పష్టంగా వ్రాశారు. 1971లో వేసిన మూడవ ప్రచురణలో కూడా లక్ష్మీనారాయణ గోత్రప్రవరల ప్రస్తావన లేదు. అప్పటికీ ఆ గోత్ర ప్రవరలు చెప్పలేదు. దాని అనుబంధమంటూ పెట్టి ఈ మార్పు చేసే వారు గ్రంథంలో 80వ పుటలో చదువుకోండి, 84వ పుటలో చదువుకోండి అంటూ అలా కల్పించారు. 1973 లో సాగినేని రంగారావుగారు కల్లూరి చంద్రమూళిగారు, జమ్ములడక మాధవరామశర్మ గారు ప్రభృతుల అభిప్రాయాలతో 'భద్రాద్రి సీతారాముల కల్యాణము' అనే గ్రంథం వ్రాశారు. ఉన్నది ఉన్నట్లు కళ్ళకు కట్టినట్లు వ్రాశారని దానిని అందరూ మెచ్చుకొన్నారు. అందు సీతారాములతో బాటు దశరథ జనకులే చెప్పబడ్డారు తప్ప నేడు చెప్పే గోత్ర ప్రవరల ప్రసక్తి లేదు. అలాగే శ్రీమాన్ పొడిచేటి రంగాచార్యులగారు రచించగా దేవస్థానం ప్రకటించిన 1983 నాటి గ్రంథంలో కూడా ఈ గోత్ర ప్రవరల గూర్చి చెప్పలేదు.

రామనారాయణ నామం లాగానే గోత్ర ప్రవరలు మార్చటం గూర్చి ప్రస్తావనలు మాత్రం ముందు జరిగాయి. 1975లో నేటి రామనారాయణ వాది శ్రీ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు గారి తండ్రిగారు శ్రీమాన్ గుదిమెళ్ళ వెంకట నరసింహాచార్యులు గారు గోత్ర ప్రవరల మార్పు చేశారట. వీరి కాలంలోనే కొండపల్లి రామచంద్రరావు గారి గ్రంథానికి ప్రక్షిప్తాలేర్పరచటమూ జరిగింది. అందుకే భద్రాద్రి రామదర్శినిలో వీరిని గూర్చి "వీరి నిర్దేశకత్వం భద్రాద్రి రామాలయంలో ఒక నూతనాధ్యాయం సృష్టించింది. ఆలయంలో ఆరాధనలు క్రమబద్ధీకరించి ఒక విశిష్టమైన విధానాన్ని, ఒరవడిని ప్రవేశపెట్టినవా"రని చెప్పబడింది.

స్థానాచార్యులవారు కాబట్టి కాదనలేక ఒకమారు అనటం, మరోమారు మానటం ఇలా మొత్తానికి ఆ గోత్రప్రవరల మార్పు స్థిరం కాలా. అందుకే పొడిచేటి వారి గ్రంథంలోకి ఎక్కలా. మరికొందరి జోక్యంతో 1985 నుండి అచ్యుత గోత్రం, సౌభాగ్యగోత్రం చెప్పి ప్రవరలు మార్చటం స్థిరపడింది. ఇదే అంశం పూర్వపు ట్రస్టీ పి.టి.ఐ. విలేఖరి అయిన శ్రీ టి.వి.బి.ఆర్. కృష్ణమూర్తి గారు తమ ఇంటర్వ్యూలో స్థానాచార్యులు వచ్చారు. వాళ్ళ

పీఠం తరఫున ఒక పండితుడు వచ్చాడు. వాళ్ళు ఈ పరిస్థితిని మార్చారు అని చెప్పారు. వారి వ్యూహం ఇలాగే ఉంటుంది. రామనారాయణ విషయంలోకూడా 1956 ప్రాంతాన కొండపల్లి రామచంద్రరావు గారు ప్రయోగించారు. దానిని అప్పుడప్పుడు ప్రస్తావించారు. 1991లో శుభలేఖ కెక్కించటం జరిగింది. 2012లో వార్షిక కల్యాణంలో చెప్పటం మొదలు పెట్టి 2015లో నిత్యకల్యాణంలోకూడా చెప్పసాగారు. ఆ మార్చిన గోత్ర ప్రవరలు పేరు గూర్చి సమర్థించుకుంటూ వ్యాఖ్యానాలు సాగించారు.

అనంతరం 85 ప్రాంతం నుండీ అచ్యుత గోత్రం సౌభాగ్య గోత్రాలు కల్యాణంలో చెప్పటం ఆరంభించినట్లు ప్రత్యక్ష సాక్షుల వ్రాతల వల్ల తెలుస్తుంది. అలా గోత్ర ప్రవరలు, రంగాచార్యులు గారి కాలంలోనే రచన అనంతరం ప్రవేశపెట్టబడింది. పిదప 20 ఏళ్ళ తరువాత పేరు మార్చటం, అది కూడా ఒక మారు చెప్పి, ఒక మారు చెప్పక ఇలా జరిగింది. కానీ వీరు నామగోత్ర ప్రవరల మార్పును రామదాసుకే అంటకడుతున్నారు. వారు దేనికయినా చాలినవారనేది ప్రతి అంశం చెప్తోంది కదా!

ఒకప్పటి భద్రాద్రి క్షేత్రం ట్రస్టీ, పి.టి.ఐ. విలేఖరి అయిన 97 ఏళ్ళు జీవించిన శ్రీ టి.వి.బి. ఆర్. కృష్ణమూర్తిగారు తమ కాలంలో సీతారామ ప్రవరలే చెప్పేవారని, ఇటీవలే మార్చారని స్పష్టం చేశారు. (సనాతన ధర్మజ్యోతి జనవరి 18 సంచిక 64వ పుట) ఆలయ విశేషాలు ఎన్నింటినో చెప్పిన ఆ ఇంటర్వ్యూ చదివి తీరవలసినది. అందులో కూడా వారు మాధవరామ శర్మగారు వ్యాఖ్యానం చేసే రోజులలో సీతారాముల గోత్ర ప్రవరలే చెప్పేవారని రూఢి చేశారు. గోత్ర ప్రవరలు మార్చటం గూర్చి చెప్తూ వారు "మాధవరావు ఇ.ఓ.గా చేసిన సమయంలో ఆలయం ఎండోమెంటుకు మారింది. అనంతరం స్థానాచార్యులు వచ్చారు. వాళ్ళ పీఠం తరఫున ఒక పండితుడు వచ్చాడు. వాళ్ళు ఈ పరిస్థితికి మార్చారు" అని చెప్పారు.

గోత్రనామాలు మార్చడం తప్పు అనీ, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని పెద్దలంతా చెప్తున్నారు. 1930 నాటి విషయం చెప్తూ శ్రీ జటావల్లభుల జగన్నాథం గారనే వృద్ధపండితులు ఆనాడు అర్చకులంతా శిష్టాచారులు. దశరథ జనకుల గోత్ర ప్రవరలే చెప్పేవారంటూ భద్రాద్రివాసుడు ముమ్మాటికీ రామచంద్రుడే. అది కాదంటే మహాపచారం అన్నారు. అసలు రామనారాయణ శబ్దం తప్పుఅని, దాని అర్థం

రాముడే నారాయణుడుగా వచ్చినట్లవుతుందని, పూర్వ సంప్రదాయాన్ని పునరుద్ధరించి సీతారాముల పేర్లు, గోత్ర ప్రవరలే చెప్పాలని ఒక పత్రికా వ్యాసంలో కోరారు.

'రామచంద్రో హరిస్సాక్షాత్' అని యిచ్చారు. అందువల్ల రామనారాయణు డనటం తగదు. అలాగే రామాయణం యుద్ధకాండలో బ్రహ్మ పల్కిన 'భవాన్ నారాయణోదేవః - శ్రీమాన్ చక్రాయుధో విభుః' అనేది కూడా కొందరు 'రామనారాయణు'డనటానికి కారణంగా చెప్తున్నారు. అది తెలివితక్కువతనము, పాపభూయిష్ఠము. పై వాక్యాలలో మొదటిది అనుభయా భేదరూపకాలంకారం. రెండవది న్యూనాభేదరూపకాలంకారం. అలంకార జ్ఞానం లేక భద్రాచలంలో ఆ వంకతో తప్పు చేస్తున్నారు. విషయి, విషయము రెండూ అక్కడ ఉన్నాయి. అలంకారం ద్వారా అభేదత్వం చెప్పారని గ్రహించాలి. మంచి దేశభక్తుని చూచి 'వాడు నిజంగా గాంధీ మహాత్ముడేరా' అంటే కస్తూరిబా గాంధీ భర్త అని అనుకోవటమేనా? సత్యం పల్కే మంచి వాణ్ణి చూచి 'వాడు సత్యహరిశ్చంద్రుడురా!' అంటే చంద్రమతి భర్తగా అనుకోవటమేనా? అలంకార జ్ఞానశూన్యులు అలా అనుకొని అలా ప్రవర్తిస్తారు. అందే 'చైత్రశుద్ధే' శ్లోకంలో లక్ష్మణ, శత్రుఘ్న, సీతా, భరత, ఆంజనేయులతో రాఘవుని పూజింపుమని స్పష్టంగా ఉంది. అందు నారాయణునిగా పూజింపు మన లేదుకదా! ఏమిటి మీ సమాధానం? 'రాఘవత్వే భవేత్ సీతా, రుక్మిణీ కృష్ణజన్మని' అని మీరే విష్ణుపురాణ శ్లోకంగా యిచ్చారు. రుక్మిణీ కృష్ణుల కల్యాణం వారి నామ, గోత్ర ప్రవరలతోనే చేయటం మీకుతెలుసు కదా! అలా సీతారాములకు కూడా వీరి నామగోత్ర ప్రవరలతోనే చేయాలనే ఇంగిత జ్ఞానం ఉండాలి గదా! 'సీతా శ్రీరివకర్తవ్యా' అంటే సీతను శోభాయమానంగా అలంకరించాలని అర్థం. అంతేకాని రాముని ప్రక్కన లక్ష్మిని కూర్చోపెట్టాలని కాదు,

200 ఏళ్ళకు పూర్వం శ్రీభద్రగిరి వరదరామదాసు గారు ఇచ్చిన అర్చక హుకుం 7-4-1968 నాటి ఆంధ్రప్రభ దినపత్రిక కళాసాహిత్య విజ్ఞానవేదికలో ప్రచురితమయంది. అందు 'శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులను, శ్రీ భద్రాచల సీతారామచంద్ర మహాప్రభువు వారి" అని మొదలయింది. ఆనాడలాగే అనటం తప్ప రామనారాయణ వంటి రామాపచార వాదాలు అప్పుడు లేవు. ఇలా ఆదినుండీ సీతారామ ప్రవరలే చెబుతూ ఇటీవల మార్చారనడానికి అనేక ప్రమాణాలున్నాయి.

అసలు సంగతికి వస్తే భద్రాద్రి ప్రమాణంగానే ఆంధ్రదేశమంతా సీతారామ కళ్యాణం మొదలయింది. లోకమంతా ఆనాటి గోత్రప్రవరలే నేటికీ చెబుతున్నారు. కానీ మూలస్థానంలో వాటిని మార్చేసిన సంగతి లోకానికి తెలియదు. ఇంగ్లాండులోని బర్మింగ్‌హామ్ భద్రాద్రి క్షేత్రంలో 18 ఏళ్ళుగా భద్రాచలం పద్ధతినే అనుసరిస్తున్నామని ప్రకటించిన సంగతి సుప్రసిద్ధం. అక్కడ వసిష్ఠ, గౌతమ గోత్రాలనే చెబుతూ వస్తున్నారు. అంటే 18 ఏళ్ళ క్రిందట భద్రాచలంలో చెప్పినది అదే అన్నది రూఢి. ఇపుడు అమెరికాలో భద్రాద్రి రామచంద్రస్వామి దేవాలయం నిర్మాణమవుతోంది. అందు ఇప్పటి వంచన కొనసాగుతోంది. ఈ సత్యాలన్నీ అమెరికా రామ భక్తులకు తెల్పాలి.

మచిలీపట్నంలో భద్రాద్రి రామాలయం నిర్మించి ఇక్కడ లాగా అన్నీ నిర్వహించేవారు. రెండేండ్ల ముందు దాక సీతారామచంద్రులకు వారి నామ గోత్రాలతోనే కల్యాణం జరిగేది. ఇప్పుడు దాన్నీ మార్పించారు. క్రమంగా అన్ని రామాలయాలలో మారుస్తామని ఆడియో సవాళ్ళు చేస్తున్నారు. పండితులు శ్రీమాన్ వేదాల సీతారామాచార్యులు గారు, శ్రీమాన్ పరాంకుశం కేశవాచార్యులు గారు, శ్రీ రామావఝుల రవికుమార్ గారు, శ్రీ బూసిరెడ్డి శంకరరెడ్డి గారు ప్రభృతులెందరో ప్రత్యక్షంగా కన్న విన్న విషయాలు వ్రాశారు. ఈ మార్పు చాలా ప్రణాళికా బద్ధంగా జరిగింది.

ఇప్పటికి కల్యాణంలో శ్రీరామనవమినాడు సీతారాములను మానుష విధానంలో కూర్చొన బెడుతున్నారు. నిత్య కల్యాణంలో మాత్రం ప్రక్క ప్రక్కన కూర్చోబెడుతున్నారు. అంతా ఆగమవిధానంలో చెప్పినట్లు జరుగుతుందని బొంకుతారు. వారి ఆగమశాస్త్రం ఒక కల్యాణంలో ఒక రకంగా, మరో కల్యాణంలో మరో రకంగా కూర్చోపెట్టమని చెప్పిందా చూపమనండి. నామ గోత్ర ప్రవరల మార్పుకీ ఆగమ ప్రమాణం లేదు. ఏమీ లేదు అన్ని అబద్ధాలు చెప్పటమే.

మానుష కల్యాణానికి ఎదురెదురు కూర్చోబెట్టటం చూస్తున్నాము. ధర్మప్రవృత్తిలో అలా ఎదురెదురుగా కూర్చోపెట్టటం చెప్పబడింది. దేవతలకు ప్రక్క ప్రక్కన కూర్చోపెట్టటం తిరుపతి, సింహాచలం వంటి అన్ని చోట్లా చూస్తున్నాం. ఇక్కడ నారాయణుడయి ఉంటే అలాగే ప్రక్కన కూర్చోపెట్టేవారు. మనుషావతారం రాముడు కాబట్టే మనుజుల వలె ఎదురెదురు కూర్చోపెట్టే ప్రత్యేకత ఈ ఆలయం కల్యాణంలోనే

ఉంది. త్వరలో శ్రీరామనవమి కల్యాణంలో కూడా ఎదురెదురుగా కూర్చుండబెట్టటం ఎత్తేస్తారేమో. గమనించండి. వారు దేనికయినా చాలినవారు.

## 12) రాముని పేరే మార్చేశారు

ఈవిధంగా గోత్రప్రవరలతో పాటు రాముని పేరుని కూడా రామనారాయణుడని మార్చడంతో అనేకమంది భక్తులు అర్చకుల వ్యూహాన్ని గ్రహింప జొచ్చారు. రామనారాయణ శబ్దాన్ని స్థిరం చేయడం కోసం అర్చకులు అనేక పాట్లు పడజొచ్చారు. శిలాఫలకంలోని పదాన్ని మార్చి, 'రామనారాయణ'గా ముద్రించడం, కంచర్ల వారి రామదాస చరిత్రంతా మార్చడం, రామనారాయణుని పేరుతో శ్లోకాలు వ్రాసి ప్రచారం చేయడం, నిత్య, నైమిత్తిక కల్యాణాలలో రామనారాయణ శబ్దాన్ని సమర్థించడమే పనిగా పెట్టుకోవడం – ఇలా అనేక విధాలుగా కొత్తదారులు తొక్కనారంభించాయి.

ఎవరైనా ఇదేమిటి, పేరు మార్చారని అడిగితే రామదాసు కాలం నుండే ఇలా చెప్పేవారంటూ బుకాయించ సాగారు. బాలసారె రోజు మనం నామకరణం చేసినట్లు ప్రతిష్ఠ సమయంలో ఆయా విగ్రహాలకు నామకరణం చేయడం జరుగుతుంది. అదే దాని శాశ్వత నామం. ముఖ్యనామం. తదుపరి ఎవరికి తోచినట్లు వారు మారుపేర్లు పెట్టుకున్నా అవి ముఖ్యనామాలు, కల్యాణనామాలు కావు. అలా భద్రాద్రి రామునకు చేసిన నామకరణం రామచంద్రుడని. అదే దేవస్థానం పేరులోను చేర్చబడింది. ఆయన పెట్టే పేరును ఆయనే మారుస్తాడా? దేవస్థానం స్థిరాస్తులు, చరాస్తులు అన్నీ శ్రీరామచంద్రుని పేరుతో ఉన్నాయి తప్ప రామనారాయణుని పేరుతో లేవు అనేది గుర్తించదగినవి. కల్యాణంలో రామచంద్రస్వామినే చెప్పాలి తప్ప ఏవో ఆలోచనలతో పెట్టేవన్నీ తగవు. 1956లో కొండపల్లి రామచంద్రరావు గారు ఒక్కచోట ప్రయోగించాక రామనారాయణ శబ్దం బాగుందని జమ్మలమడక, కల్లూరి, ఏలూరుపాటి, కొండవీటి, ఉషశ్రీ వంటివారూ, ఎక్కడైనా ప్రయోగించి ఉంటే ఉండవచ్చు గాక! కల్యాణంలో మాత్రం అసలైన పేరు 'రామచంద్రస్వామిని' మార్చే అర్హత ఎవరికీ లేదు. పంతానికి మారుస్తామనడం తగదు. భద్రాద్రి రామకల్యాణం విషయంలో భద్రుడు, రామదాసు, నరసదాసు గార్లు తప్ప వేరెవ్వరూ ప్రమాణం కాజాలరు. ఏకంగా రామదాసుకే

ఎసరు పెట్టి, చిన్నప్పుడు రామదాసు రామనారాయణ శతకం వ్రాశాడని అంటూ రామదాస చరిత్ర తొలిముద్రణలో లేని దానిని మలి ముద్రణలో వ్రాసేశారు.

వారి దురదృష్టం కొద్దీ భక్తులకు ఒక సి.డి. దొరికింది. అందులో ఇంతకు ముందు 'రామచంద్రస్వామినే వరాయ' అని ఉంది. దానిని చూపించే సరికి "దానిదేముంది ? అలాగూ అనవచ్చు, ఇలాగూ అనవచ్చు. పాఠాంతరం" అనేశారు. అసలు రామదాసు పెట్టిన పేరుని మార్చవలసిన అగత్యమేమిటి ? పాఠాంతరాలు పదాలకుంటాయి కానీ ప్రక్రియలకుంటాయా ? ఆలయ అధికారులు భయపడి తమకెందుకులే అని సర్దుకుపోతున్నారు. వారి భయానికి కారణం... ఒక ఇ.వో గారు ఈ వ్యూహాన్ని గమనించి, గోత్రనామాలు మార్చడానికి వీలులేదు. పూర్వంలాగానే చెప్పండని ఆదేశించిన ఘటన. దానితో అర్చకులు ఆయనపై ధ్వజమెత్తి, ధర్నాకు దిగి, నానా యాగీ చేశారు. పత్రికల్లో అన్నీ వచ్చాయి. ఆయన బదిలీ కావడంతో తిరిగి అన్నీ మామూలే. భక్తులు అధికారులకు ఎన్నో విజ్ఞప్తులు చేసుకున్నారు. కానీ అవన్నీ ఎక్కడ నిలిచిపోతున్నాయో తెలియదు.

భక్తులు కొందరైనా ఇలా ప్రశ్నిస్తూ ఉండడం అర్చకులకు నచ్చలేదు. అద్భుతమైన ఆలోచన ఒకటి చేశారు. నరసాపురంలో ఒకరు "మీరు రామనారాయణ అనే అనా" లంటూ కోర్టుకు వెళ్ళి, వీరికీ ఒక నోటీసు పంపారు. వీరు సరే అంటే ఉభయ పక్షాల మాటా ఒకటే అయి అదే తీర్పుగా వచ్చేస్తుంది కదా ! ఇక దాని మీద ఎవరు నోరెత్తుతారు? ఈ ప్లాను వెనుక ఎవరుంటారో ఊహించవచ్చు ! కానీ దైవం తాను ఉన్నానని నిరూపిస్తున్నట్లుగా రాష్ట్ర విభజన జరిగింది. దాంతో విచారణ పరిధి మారి ప్లాను దెబ్బతింది.

1944 నుండి కుంభహారతి సేవలో ఉన్న 70 ఏళ్ల వృద్ధులు శ్రీశేషం రాధాకృష్ణగారు కల్యాణంలో గోత్ర ప్రవరలు కొంతకాలం క్రితమే మార్చారని, రామ నారాయణ పేరు ఇటీవల మార్చినదే అని 23-7-2017 నాటి ఇంటర్వ్యూలో చెప్పారు.

2012 నుండి కల్యాణంలో రామనారాయణ ఆరంభించారు. కాని అదే రామనారాయణ అనేది ఈ వివాదం ప్రబలాక 2015 నుండి నిత్యకళ్యాణంలో ఆరంభించారు. దీన్ని రామదాసు ఏర్పరచాడన్ని అబద్ధం ఆడతారు. వీరి చేష్టలనేమనాలి? ప్రజలు అమాయకులని ఇష్టం వచ్చినట్లు మార్పులు చేసుకుపోతున్నారు.

నాలుగు చేతులతో దర్శనమివ్వడం వలన 'రామనారాణుడు' అనాలనేది

అర్చకుల మరో వాదన. అది చెల్లదు. రామునికి నాలుగు చేతులు ఉండడాన్ని వారి ఆగమమే చెప్పింది. పాంచరాత్రాగమం శ్రీరామమూర్తిని నిర్ణయం చేస్తూ "కుఞ్చితే నాఙ్ఘ్రిణా స్తోకం శర శార్ఙ్గ ధనుర్ధరః। అపరాభ్యాం హస్తాభ్యాం శంఖచక్రం చ ధారయేత్॥" (పాద్మ సంహిత) అని చెప్పింది. అంటే నాలుగు చేతుల ధనుర్బాణాలు, శంఖ చక్రాలు కలిగినది శ్రీరామమూర్తియే అని అర్థం. కణ్వసంహిత త్రయోదశోఽధ్యాయంలో కూడా

**"రామస్య రాఘవ స్యాఽథ వక్ష్యామి లక్షణం శుభమ్**
**శరకార్ముక హస్తశ్చ - శఙ్ఖ చక్రధరం ప్రభుమ్ ॥ 86**
**చతుర్భుజ ప్రతిమాయాం - ద్విభుజేశరకార్ముకే**
**సీతాలఙ్కృతవామాంకం - జ్ఞానముద్రా సమన్వితమ్ ॥ 87**

అని యిలా చతుర్భుజుడుగానూ రాముడు ఉంటాడని చెప్పబడింది తప్ప అట్టివాడు రామనారాయణుడనబడతాడని చెప్పలేదు. ఆ అతితెలివి ఇప్పుడు పుట్టింది. వసిష్ఠ సంహితయందు గోలోక అయోధ్య గూర్చి చెప్పిన చోట

**"తన్మధ్యే రాజతేఽయోధ్యా - సచ్చిదానందరూపిణీ**
**తత్రలోకే చతుర్బాహూ - రామో నారాయణ ప్రభుః ॥**

అనేది ఇచ్చారు. దానిలో సాక్షాత్తు శ్రీమన్నారాయణుడయిన శ్రీరాముడే ఈ భద్రాచల మందు దెలిసిన భగవంతుడు అనటం ద్వారా నారాయణ అవతారుడయిన రామునిగానే తెల్పారు. అది ఎవ్వరికీ అభ్యంతరం కాని విషయం.

**"తత్రాయోధ్యా పురీరమ్యా- యత్ర నారాయణో హరిః**
**రామరూపేణ రమతే - సీతయా పరయా సహ ॥**

అని చెప్పబడింది. హరి రామరూపంలో సీతతో అయోధ్యలో ఉన్నాడనే. అయినంత మాత్రాన 'రామహరి' అనవలసిన పనిలేదు. ఆ హరియే నారాయణుడే రామునిగా అవతరించాడు. అక్కడ ఉన్నది రాముడే అని అర్థం. అందే 59లో చతుర్భుజ రూపం తెల్పి వామాంకే జానకీదేవీ - కిశోరీ కనకోజ్జ్వలా అన్నారు తప్ప సీతా మహాలక్ష్మి అనలా.

ఏప్రిల్ 1987లో ప్రకటించిన మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవ ప్రత్యేక సంచిక (సావనీర్)లో 1966 మార్చి 27 భవాన్స్ జర్నల్‌లో ఉదహరించిన రాముని భిన్న రూపాలుగా కోదండరామ, ప్రతాపరామ పట్టాభిరామ, తారకరామ, శివరామ, వీరరామ, భద్రాచల చతుర్భుజ రామ అంబికా రూపవశ్యరామ, పాంచ రాత్రాగమ రామమూర్తి రూపాలుగా తొమ్మిది ఈయబడ్డాయి తప్ప 'రామనారాయణ' అనేది లేదు. అందు భద్రాచల చతుర్భుజుడు రాముడనియే చెప్పబడెను తప్ప రామనారాయణుడు కాదు. సీతాదేవి అనియే తప్ప సీతామహాలక్ష్మి అని కాదు. లక్ష్మణుడు కూడ ఉన్నట్లు చెప్పబడింది.

రామచరిత మానస్‌లో కూడా రాముడు చతుర్భుజుడుగా వర్ణింపబడ్డాడు కాని రామనారాయణునిగా చెప్పబడలేదు. అగస్త్య మహాముని శిష్యుడయిన సుతీక్ష్ణుడు రాముని వర్ణిస్తూ తన్మయత్వంలో స్మృతి కోల్పోగా రాముడు చతుర్భుజుడుగా దర్శన మిచ్చాడు. అపుడు "భూప రూప తబరామ దురావా – హృదయఁ చతుర్భుజ రూప దెఖావా ॥ అని తులసీదాసు వర్ణించాడు. భద్రునకే కాక ఇలా సుతీక్ష్ణాదులకును దర్శనమిచ్చాడు. ఇలా ఎవ్వరూ రామనారాయణ అనలేదు. ఆదిశంకరులు "వామాంక స్థిత జానకీ పరిలసత్' అని చెప్పిన ప్రసిద్ధ శ్లోకంలో కూడా నాల్గు చేతులున్నాయి కాని 'రామంభజే శ్యామలం' అన్నారే తప్ప 'రామనారాయణ' అనలా.

'ఆయతాశ్చ సువృత్తాశ్చ బాహవః పరిఘోపమాః' అన్న కిష్కింధలో బాహవః అని బహువచన ప్రయోగం బట్టి రాముడు చతుర్భుజ దర్శనమిచ్చినట్లు వివరించారు. పంపా సరస్తీరంలో హనుమంతునికి రాముడు చతుర్భుజునిగా దర్శనమిచ్చినట్లు (కిష్కింధ 3/15) గోవిందరాజీయవ్యాఖ్య, వాసుదాస స్వామి వారి మందరం మొదలైనవి చెబుతున్నాయి. అక్కడ నాలుగు చేతులతో దర్శనమిప్పించినందున రామనారాయణుడని హనుమంతుడు అనలేదు. వాల్మీకి అనలేదు. వ్యాఖ్యాత వారు అనలేదు. రామాయణ అరణ్యకాండ 24వ సర్గలో 26వ శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ గోరఖ్‌పూర్ రామాయణంలో ఆ ఘట్టంలో స్కాందపురాణమున వర్ణితం చెప్పారు. "శంఖం చక్రం చ శూలం చ పినాకం ఖేటమేవచ – ఖట్వాంగ, ఘంటాం చ డమరుం, బాణం, పాశాంకుశం, తథా చాపం వజ్రం చ, ఖడ్గం చ పరశుం త్రాసకారకా । జయశ్రియం చ గంగాం

చ దదృశుః సిద్ధ చారణాః" అందు శ్రీరాముడు ధరించిన శంఖచక్రాలు, బల్లెం, పినాకత్రిశూలం, శివధనస్సు, డాలు, ఘంట, దమరు, బాణ, పాశం, అంకుశం, వజ్రం, ఖడ్గం, పరశు చెప్పబడ్డాయని శివరాముడంటామా ? అనకూడదు. అట్లే రామనారాయణ అనకూడదు. నాలుగు చేతులు రామునికి ఉండడం గురించి అగ్నిపురాణం కూడా చెప్పింది. స్కాంద పురాణాంతర్గత శ్రీమద్రామాయణ మాహాత్మ్యంలో 'శంఖ చక్ర గదా పాణిః రామభద్రః సమాగతః' (62 శ్లో 69) అని ఉంది. కాబట్టి నాలుగు చేతులుఉన్నా రాముడే తప్ప నారాయణుడు కాదు.

**ఆగమధిక్కారం :** వారి ఆగమం ప్రకారం పాద్మసంహిత, మార్కండేయ సంహిత, కణ్వసంహిత, బృహత్ బ్రహ్మ సంహిత , పరాశరసంహిత ఇత్యాది పాంచరాత్రాగమ సంహితలలో పేర్కొనబడినప్పటికీ వాటిని ప్రమాణాలుగా స్వీకరించక శాస్త్ర ప్రమాణాలను తృణీకరిస్తూ, సామాన్యవ్యక్తులు వ్రాసిన వచనాలు, వ్యాసాలను ప్రమాణంగా చూపడం తిన్న ఇంటి వాసాలను లెక్కబెట్టిన రీతిగా ఉన్నది. నారాయణునికి కుడి చేతిలో చక్రం ఉండాలి. కానీ భద్రాద్రి రామునికి కుడి చేత శంఖం ఉంటుంది. 'శంఖ చక్ర ధనుర్బాణ సీతాలక్ష్మణ సంయుతః । నివస త్వం రఘుశ్రేష్ఠ ! మమ మూర్ధని" – ఇది రాముని రూపమే అని, అదే తనపై నిలవాలని భద్రుని కోరిక. ఆయన రఘుశ్రేష్ఠునిగానే కోరాడు (క్షేత్ర మాహాత్మ్యం).

నారాయణుడు ఎలా ఉండాలంటే "శంఖ పద్మ గదా చక్రధరం నీలాంబుద చ్ఛవిమ్ । సర్వాలఙ్కార సంయుక్తం కుర్యాన్నారయాణం తతః (అహిర్బుధ్న్య సంహిత) "నారాయణ శ్శఙ్ఖ పద్మ గదా చక్రధరః స్మృతః" (పాద్మ సంహిత) ముఖ్యమైన ప్రశ్నేమిటంటే భద్రునకు సాక్షాత్కారించినది నారాయణుడైతే పక్కన లక్ష్మణుడు ఎలా ఉంటాడు ? శ్రీరామ నవాయతన పూజ, పంచాయతన పూజ, దశావరణ మహాపూజలలో సీతారాములకు కుడివైపున భరతుడు (శంఖం) ఉండాలనీ, ఎడమవైపు శత్రుఘ్నుడు (చక్రం) ఉండాలనీ చెప్పబడింది. కాబట్టి భద్రునికి సాక్షాత్కరించిన రాముడి శంఖచక్రాలు భరత శత్రుఘ్నులుగా గ్రహించాలి. సీతారామ లక్ష్మణులతో అది రామపంచాయనతంగా గ్రహించాలి తప్ప దానికి నారాయణ శబ్దం వాడడం తగదు.

శ్రీవత్సము, కౌస్తుభము, ఉష్ణీషము, వనమాల అనే నాలుగు ఉన్నవాడు నారాయణుడని శ్లోకం చూపారు. రామునకు శ్రీవత్సం ఉండవచ్చుగాక. అయినా

నారాయణడు కాదు. శ్రీవత్సమంటే "శ్రీవత్సో నామ వక్షస్థలే మహాపురుష లక్షణో రోమావర్త విశేషః" అని అంటే శ్రీవత్సమంటే మహాపురుషులకు వక్షస్థలాన ఉండే వెంట్రుకల సుడి. అది రామునకే కాదు. మహాపురుషులందరికీ ఉంటుంది. అలా వెంట్రుకలున్న వారందరినీ నారాయణ అంటారా? ఏమి తెలివండీ! అలాగే రెండవదయిన కౌస్తుభం రామునకు లేదు. కాన అలాగూ నారాయణుడు కాదు, మూడవది ఉష్ణీషము. ఉష్ణీషము అంటే ఎండ ఉష్ణము తగులకుండా శిరస్సున ధరించే తలపాగా, లేదా కిరీటం. ఇదీ అందరికీ ఉండేదే. రైతు, కూలీ లందరూ తలపాగా ధరిస్తారు. రాజులందరూ కిరీటం ధరిస్తారు. వీరి లెక్కన వారందరినీ నారాయణ అనాలి. అది తగునా? అలాగే రాముని కూడా నారాయణునిగా అనరాదు. వనమాల అంటే పాదాల దాకా వ్రేలాడే పుష్పమాల. ఇది విష్ణువుకు నియతం కాని రామునకు కాదు. కాబట్టి మీరు చెప్పిన లక్షణాలను బట్టే రాముని, నారాయణుడనటానికి తగిన చిహ్నములు లేవని స్పష్టమవుతోంది.

అధ్యాత్మలో (14, 17, 18 శ్లోకాలు చెప్తూ) వసిష్ఠుడు దశరధునితో నీవు సామాన్యుడవు కావు. పూర్వం బ్రహ్మపుత్రుడవైన కశ్యప ప్రజాపతివి. విష్ణువును పూజించి, తప మొనర్చ సాక్షాత్కరించి వరమేమి కావలెనన, పుత్రునిగా జన్మింపుమన సరే అనే "తథేత్యు క్త్వాద్య పుత్రస్తే – జాతో రామః సఏవ హి, శేషస్తు లక్ష్మణో రాజన్ ! రామ మే వాన్వసభ్యత! జాతౌ భరత శత్రుఘ్నౌ శంఖ చక్రే గదా భృతః, యోగమాయాపి సీతేతి జాతా జనకనందినీ ॥ అని భరత శత్రుఘ్నులు శంఖ చక్రములవటం స్పష్టం. కాబట్టి శంఖ చక్రాలున్నాయని రామనారాయణుడనటం ఏవిధంగానూ సముచితం కాదు. భరతుడు కుడివైపు ఉంటాడు కాబట్టి కుడిచేతిలో శంఖముంది. శత్రుఘ్నుడు ఎడమవైపున ఉంటాడు కాన ఎడమవైపు చక్రం ఉంది. నారాయణునకు అలా కాక కుడిచేత చక్రం, ఎడమచేత శంఖం ఉంటాయి. ఈ భేదాన్ని గుర్తించక రామనారాయణు డనటం అసమంజసం. ఇలా అంటున్నామని ఇప్పుడు అలంకారంలో కుడిచేతిలో చక్రం పెడుతున్నారు. మూలమూర్తికి అలా మార్చలేరు కదా! ఎందుకీ తప్పు పనులు!

రామదాసు ముఖ్యకీర్తన 'ఇక్ష్వాకు కులతిలక' అనేది. అందులో 'భరతునకు చేయిస్తి పచ్చల పతకము' అనీ, దానికి పదివేల వరహాలైనట్లు, భరత శత్రుఘ్నులు ఇద్దరికీ ఆభరణాలు చేయించినట్లు చెప్పారు. భరత శత్రుఘ్నులు ఏరీ అంటే ఉన్నారు. వారు శంఖ చక్రాల రూపంలో ఉన్నారు. కాబట్టే వారికీ చేయించాడు. ఈ ఆభరాణాలను

వివరిస్తూ **అర్చకులు శ్రీమాన్ ఎ. మురళీకృష్ణమాచార్యులుగారు ఇదే విషయం చెప్పారు. హెచ్.యం. టి.వి.వారి వీడియోలో యూట్యూబ్‌లో దీన్ని చూడవచ్చు.** ఆ కీర్తనలో 'ఇక్ష్వాకు కుల తిలకుడిని, అయోధ్యా రాముడి'నే పిలిచాడు. అంతే తప్ప వైకుంఠ నారాయణుడిని కాదు. వచ్చి, తానీషాకు చెల్లించినది కూడా అయోధ్య నాణాలనే. ఇప్పటికీ రామపట్టాభిషేక ముద్ర కల ఆనాటి నాణాలను చూడవచ్చు.

భద్రుడు తనకు రామదర్శనం కాగానే, "నమస్తే ! దేవదేవేశ ! శంఖచక్ర గదాధర ! ధనుర్బాణ ధరానంత రామచంద్ర ! నమోస్తుతే" అని స్తుతించాడు. (బ్రహ్మపురాణం – భద్రాచల క్షేత్రమాహాత్మ్యం). అందులో రామచంద్ర ! అని సంబోధించాడు కానీ నాలుగు చేతులతో కనపడ్డాడని రామనారాయణ అనలేదు. అంటే కనిపించినది రాముడు తప్ప, రామనారాయణుడు కాదు. అందుకే రామదాసు కూడా 'సీతారామచంద్ర స్వామి దేవస్థానాన్నే ఏర్పరచి, 'రామచంద్రస్వామినే వరాయ' అనే అనిపించాడు. దానిని మార్చి, 'రామనారాయణ' అనడం భద్రుడు, గోపన్నల ఆశయాలకు విరుద్ధం. అది తగదు. 'రామాయ రామభద్రాయ, రామచంద్రాయ వేధసే' అనడం 'రామచంద్రాయ జనకరాజజా మనోహరాయ' అనడం జగమెరిగిన సత్యం. 14–06–2014న కొందరు స్వాములు, భక్తులు ఇది గమనించి అడ్డం తిరిగితే అప్పుడు మళ్ళీ 'సీతారామచంద్రస్వామినే వరాయ' అని చదివారు. ఎందుకంటే నాటి వ్యవహారం పోలీసు ఫిర్యాదు దాకా పోయి, పోలీసుల సన్నిధిలో జరిగింది. ఈ విషయం అప్పుడు పాల్గొన్న హిందూ ధర్మ రక్షా సమితి వారు తమ లేఖలో తెలిపారు. కొత్తగా తెచ్చినదంతా వారు కల్పించినదే కాబట్టి, అప్పటికి తప్పించుకోవడం కోసం వారు అలా చెప్పారు. అంటే అడిగేనాథుడు లేకనే వాళ్ళ ఆటలు సాగుతున్నాయి.

రాముణ్ణి ఎలాగయినా అనచ్చు. ఆయన నారాయణుని అవతారమే కదా ! అని ఒకమారు వివరణ. అయితే విష్ణు సహస్రనామాలన్నీ అనవచ్చు. ఎందుకంటే 'శ్రీరామ రామరామేతి' అని సహస్రనామతత్తుల్యం కదా ! అలా వాడుకొనటం తగుతుందా ? ఒక అబ్బాయి పేరు 'రామచంద్రరా'వయితే ఇంట్లో బుజ్జి అంటారు. ఫ్రెండ్సు రాము అంటారు. కొందరు చంద్రుడూ ! అంటే పనివాళ్ళు అబ్బాయిగారూ! అంటారు. బ్యాంకుకు వెళ్ళి బుజ్జి అని సంతకం పెడితే డబ్బిస్తారా ? పెళ్ళి శుభలేఖలో బుజ్జి అనే వరునకు అన్ని వ్రాయచ్చా ? బుజ్జి నామధేయస్య అని పూజ, పెళ్ళి సంకల్పంలో చెప్తారా ? చెప్పరు, చెప్పకూడదు, చెప్పటం చెల్లదు. అలాగే ఇక్కడ

కూడ మన బుద్ధి కేదో ఆలోచన తట్టిందని దాన్ని సమాజమంతటికీ రుద్దుతామంటే ఊరుకోరు. అలాగే శ్రీరామచంద్రుని స్థానంలో రామనారాయణ అని పేరు మార్చటం, ఆ పేరును బట్టి అసలు రామునే వదలి నారాయణుని గోత్రప్రవరలే చెప్పటం తగదు. రామనారాయణ అనే పదము వాడటానికి ఏ ప్రమాణమూ లేదు. అవసరం కోసం ఇటీవలి వారు వ్రాసినవి, వ్రాయించినవి ప్రమాణాలు కాదు.

భద్రాద్రిరామ విషయంలో ముఖ్యంగా ప్రమాణాలు మూడు. ఆ మూడింటా రామనారాయణ పదప్రయోగమే లేదు కాన అవివాడుట తగదు. మొదటి ప్రమాణం బ్రహ్మపురాణాంతర్గత శ్రీభద్రాచల క్షేత్రమాహాత్మ్యం. అందు రామపదం = 26 సార్లు ప్రయోగింపబడింది. రామభద్ర = 6 సార్లు, సీతారామ = 2, రఘూత్తమ = 4, రాఘవ = 7, రామచంద్ర = 2 సార్లు అయితే వీరు చెప్పే వైకుంఠరామ = 0, ఓంకారరామ = 0, రామనారాయణ = 0 సార్లు ప్రయోగింపబడింది. రెండవ ప్రమాణం దాశరథీ శతకంలో దాశరథి = 108 సార్లు, రామ = 24, రఘురామ = 2, రఘువీర, రఘుపుంగవ = 2, సీతాపతి = 1, వైకుంఠరామ = 0, ఓంకార రామ = 0, రామనారాయణ = 0, ఇక రామదాస కీర్తనలలో చూస్తే రామ = 316, రామచంద్ర = 72, రామభద్ర = 1, రఘురామేత్యాది = 36, రామస్వామి = 1, దశరథసుతేత్యాది = 11, సాకేతవాస = 1, అయోధ్యావాస = 1, కౌసల్య ముద్దుపట్టి = 1, సీతారామేత్యాది = 23, పట్టాభిరామ = 4, కోదండరామ = 13, సీత విషయంలో సీత = 2, సీతమ్మ = 3, జానకీ = 2, ఓంకారరామ = 0, వైకుంఠరామ = 0, రామనారాయణ = 0.

ఇలా వారి ప్రయోగాలు 'రామనారాయణ' వంటి మూడూ అప్రామాణికాలే.

అసలీ రామనారాయణ ఎక్కడిదీ అంటే భద్రుడన్నదీ కాదు, రామదాసన్నదీ కాదు. ఎవరో ఒకరి పుర్రెలో పుట్టిన కల్పన. లేదనకుండా వారూ దానికో ఆధారపు దారం పట్టుకున్నారు. కాని అది నిలిచేది కాదు. దానికాధారంగా వారు చూపేది దాశరథీ శతకంలోని 97వ పద్యమందలి 'శ్రీయుత ! జానకీ రమణ ! చిన్మయరూప! రమేశ ! రామ ! నారాయణ ! అనే మొదటిపాదం. వారా పద్యాన్ని 'రామునితోక పివరుండు' అన్నట్లుగా అనుచిత విభాగం చేసి తమ అవసరానికి వాడుకొంటున్నారు. వారి భ్రాంతిని సమాజంపై రుద్దుతున్నారు. అతి తగదు. ఆ పద్యంలో ఒక మంత్ర

రహస్యం ఉంది. అది రామాయణంపై జరిగిన జాతీయ సదస్సులో కూడా ఒక పండితునిచే వివరింపబడింది. భాగవతంలోని అద్భుతమయిన పద్యం “శ్రీకృష్ణా! యదుభూషణా!” అనేది. అందు క్రమంగా అష్టాక్షరీ మంత్ర ప్రతినిధులయిన సంబోధనలు ప్రయోగింపబడ్డాయి. అది ఆ పద్యశక్తి. అలాగే ఈ ‘శ్రీయుత ! జానకీ రమణ పద్యంలోనూ రామషడక్షరీ ప్రతినిధులుగా క్రమంగా ఆరు సంబోధనలు జరిగాయి. శ్రీయుత ! జానకీరమణ ! చిన్మయరూప ! రమేశ ! రామ ! నారాయణ! అని. మకుటం వేరు. ఈ క్రమము ఆరూ షడక్షరి ప్రతినిధులుంటారు పండితులు. అందుకే అందరూ తమ శతకంలో ఆరు పదాలుగానే చూపారు. అంతేకాదు ఈ పద్యంలో మరో రహస్యం ఉంది. అది ఒక క్రమాలంకారం.

ఈ ఆరు సంబోధనలు మూడు క్రమాలు.

శ్రీయుత – జానకీరమణ – చిన్మయరూప

రమేశ – రామ – నారాయణ

శ్రీ అంటే రమయే. శ్రీయుతుడు రమేశుడే. జానకీరమణుడు రాముడే కదా ! చిన్మయ రూపుడు నారాయణుడు ! ఇది క్రమాన్వయం. ఈ క్రమాన్ని తప్పించి రామనారాయణ అని కల్పేసి దాన్ని వాడుకొనటం ఎంతటి అజ్ఞానం ! ఇలా మహనీయులు ప్రతిభావంతులయిన కవుల రచనలలో ఎన్నో రహస్యాలు ఇమిడి ఉంటాయి. ఈ రహస్యం తెలిసిన శతక వ్యాఖ్యానకర్తలు, ముద్రాపకులు అంతా అలాగే విభజించి చూపారు. అది చూచి అయినా వీరు గ్రహింపకపోవటం దురదృష్టం. పరమ ప్రామాణికులు శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులుగారు రామ ! నారాయణ! అని విడగొట్టే చూపారు. పరిశీలించండి. అవి రెండు సంబోధన పదాలు, ఒకటి కాదు,

దాశరథీ శతకానికి మానసోల్లాస వ్యాఖ్య వ్రాసిన డా॥ యం. కులశేఖరరావుగారు కూడా రామ ! నారాయణ ! అని విడిగానే ఇచ్చారు. శ్రీ పి.వి.కె. ప్రసాదరావు కూడా వ్యాఖ్యలో రామ ! అని విడిగా, నారాయణ! అని విడిగా ఇచ్చారు. విక్టరీ పబ్లిషర్సు వారి దాశరథీ శతకంలోనూ రామ ! వేరు, జె.సి. శాస్త్రిగారు, గుంటూరు వారి వ్యాఖ్య. విశేషాంశాలలో రామ = రమింపజేయు వాడా ! నారాయణ ! = సాయుజ్యము నొసగువాడా ! అని విడిగానే ఈయబడింది.


ఆలయంలో శిలాఫలకపు శతకం తెలుగులో రామ – నారాయణ అని వ్యవధానం చూపించారు. వికిపీడియాలోది, శ్రీ డా॥ మహాభాష్యం సీతారామనాథ్ గార్ల శతకంలోను వ్యవధానముంది. తెలుగుభక్తి డాట్‌కామ్‌లోని శతకంలోనూ రామ, నారాయణ విడిగానే ఉన్నాయి, విచిత్రమేమంటే రామనారాయణ వాదానికి హేతుభూతులుగా కానవచ్చే వారు రూపకర్తగానున్న శ్రీభద్రాద్రిరామ స్తోత్రమంజరిలో కూడా అందరివలె రామ, నారాయణల మధ్య వ్యవధాన ముంచారు. అన్యాయం చేయటం మరచారన్నమాట. రామనారాయణ వాదానికి హేతుభూతులనటానికి కారణం లేకపోలేదు ! విపులంగా ప్రత్యేక శీర్షికలో ఈయబడింది. మొత్తానికి దాశరథీ శతకంలో రామనారాయణ శబ్దం రామదాసు ప్రయోగించాడనటం పచ్చి అబద్ధమని తేలింది. అనుచిత విభాగం చేసి సమాజాన్ని మోసం చేయటం ఇకనయినా మానేస్తారని ఆశిద్దాం.

ఇక వీరికి దొరికిన మరో ఆధారపు దారమేమంటే అచ్యుతాష్టకంలోని 'అచ్యుతం కేశవం – రామ నారాయణం' అనేది. రామదాసుకు, భద్రాద్రికి సంబంధించని దానిని తీసికొని వ్యవస్థనే మార్చేస్తాననటం అనుచితం. అసలు దీనిని ఆధారంగా చూపుకొనడం తప్పు. ఎందుకంటే ఇది అచ్యుతాష్టకము కాని రామాష్టకం కాదు. కాబట్టి అన్వయం రామ స్వరూపుడయిన నారాయణునిలోకే వస్తుంది. అది అటుంచి అసలిచ్చటి రామ నారాయణ ఒక పదం కాదు. పై దాశరథీ శతకంలో లాగే రామ, నారాయణ అనేవి రెండు పదాలు. 1985లో సాధన గ్రంథమండలివారు అచ్యుతాష్టకం ప్రచురించారు. దానికి వ్యాఖ్యానం వ్రాసినవారు ఋషిసత్తములయిన శ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారు. అందు వారు స్పష్టంగా రామ, నారాయణ పదాలు విడిగా చూపారు. రామ పదము గూర్చి 'యోగి హృదయములను రంజించువాడవై రాముడవైతివి, సర్వజ్ఞాన నివాసమై నారాయణుడవైతివి' అన్నారు. అలా నారాయణ పదమునకు విడిగా అర్థం చెప్పారు తప్ప 'రామ నారాయణ' అనేది ఏక వ్యక్తిగా చెప్పలేదు. అట్లే విశ్రాంత సంస్కృతాంధ్ర పండితులు శ్రీనారుమంచి లక్ష్మీ నరసింహ మూర్తిగారు ఆదిశంకర భగవత్పాద స్తోత్రములు అనే గ్రంథంలో రామ శబ్దానికి యోగుల హృదయములకు విశ్రాంతి స్థానమైనవాడు అని, నారాయణ శబ్దానికి నరులకు గమ్యస్థానమయినవాడు అని విడిగానే అర్థాలు చెప్పారు. తదుపరి మరల 4వ శ్లోకంలో ఉన్నదానిని హేరామ ! నారాయణ ! అని ప్రత్యేక సంబోధన చిహ్నాలు పెట్టి విడిగానే చెప్పారు. అసలిక్కడ చెప్పిన రామ, నారాయణ అని చెప్పిన దానిలోని రాముడు దశరథ రాముడు కాదు, బలరాముడు అలా బలరామకృష్ణులను

చెప్పారు. కృష్ణదామోదరంలో కృష్ణ, దామోదరులు ఎలా వేరో ఇక్కడ బలరామ, కృష్ణులు వేరుగా గ్రహింపదగ్గవారు. 4వ పంక్తిలో 'జానకీ నాయకం రామ చంద్రం భజే' అన్న దానిలోది మాత్రం దశరథ రాముడే. కాబట్టి రామ నారాయణ అనేది వీరు కల్పించినదే తప్ప ఎక్కడా దానికి ప్రమాణం లేదని స్పష్టం. కంచర్ల పాండురంగశర్మగారు రామదాసు ఏనాడూ రామనారాయణ అనే మాటని వాడలేదంటూ దర్శనం పత్రిక ఆగష్టు 17 సంచికకు ఇంటర్వ్యూ కూడా ఇచ్చారు.

తమ కల్పనచే సీతారాములను, లక్ష్మణాది భక్తులను వంచన చేసేవారి గూర్చి పరిశీలన జరిపించి, సంబంధిత అధికారులు వారిపై తగు చర్యలు తీసుకోవలసినదిగా భద్రాద్రి రామ భక్తులు కోరుతున్నారు. అసలీ 'రామనారాయణ' వాదానికి ప్రధానాధారంగా వారు చూపుకొనేది శ్రీ కొండపల్లి రామచంద్రదరావుగారి 'భద్రాచల క్షేత్ర చరిత్రము. అందు మూడవదయిన భద్రుడు అను శీర్షికలో వైకుంఠ రాముడని, రామనారాయణుడని, ఓంకార రాముడని ఈ శ్రీరామచంద్రమూర్తిని అంటారని చెప్పారు. కవి భావనతో చెప్పిన దానిని పరమ ప్రమాణంగా తీసుకొని వ్యాసభగవానుని పురాణము, రామదాసు శతక, కీర్తనలు కూడ చెప్పని పదాన్ని తమ దుర్వ్యూహమునకు వినియోగించకొనటం ఎంత ఘోరం ! రామచంద్రరావుగారు చెప్పిన మిగిలిన పదాలు వాడుకొని ఓంకార రామస్వామినేవరాయ, వైకుంఠ రామస్వామినే వరాయ అని మాత్రం అనరు. ఎందుకంటే రామలో మకారం, శివమంత్రంలోది కాన దాని ప్రక్కన నారాయణ పదం కలదాన్నే తీసికొని 'మ' కార తత్త్వాన్ని బలహీనపరచటం, లక్ష్మీ నారాయణుల గోత్ర ప్రవరలు చెప్పటం లక్ష్యం. కాబట్టి రామనారాయణ మాత్రమే తమ వ్యూహానికి ఉపయోగపడుతుంది. కాబట్టి, దానినే తీసుకుంటారు. ఇక్కడ కొన్ని ముఖ్యాంశాలు గుర్తించాలి. రామచంద్రరావుగారికి ఆ పదాల విషయంలో ప్రత్యేక ప్రమాణ బుద్ధి ఏమీ లేదు. అందువలననే మరెక్కడా ఆ మూడు పదాలనూ ప్రయోగించ లేదు. రామచంద్రునిగానే పేర్కొంటూ వచ్చారు. అంతేకాదు. తరువాతి కాలంలో వారి కళ్ళుపోయాక సమక్షరాఘవము అని భద్రాద్రి రామునితో ఫలితవాదంగా 110 పద్యాలు 'రాఘవా!' మకుటంతో చెప్పారు. అందెక్కడా ఈ రామనారాయణ, ఓంకార రామ, వైకుంఠ రామ శబ్దాల ఊసే లేదు.

తప్పును సమర్థించుకొనటం కోసం అనేకమయిన తప్పులు, సాకులు భక్తులకు చెప్తున్నారు. శ్రీకొండపల్లి రామచంద్రరావుగారేదో ఒక్కచోట అన్నారని దానికోసం వ్యవస్థనంతా మారుస్తారు. వీరు చెప్పుకొనే, చూపుకొనే ప్రమాణాలన్నీ ఆ రామచంద్రరావుగారి 1950–56 నాటి పత్రికలు చూచి కాపీ కొట్టినవే. ఉదాహరణకి 1959లోని భద్రాచల క్షేత్రం పరిచయంలో 1987లో శ్రీ కొండవీటి వెంకట కవి గారి సంపాదకత్వంలో శ్రీ ఎన్.టి. రామారావుగారు వెలువరింపజేసిన ప్రత్యేక సంచిక. శ్రీ వెంకట కవిగారికి నేను ప్రత్యక్ష శిష్యుణ్ణి. వారు నాస్తికులు. ఈ భద్రాద్రి రామునిపై విశ్వాసం కాని, అవగాహన కాని లేనివారు. వారు శ్రీ కొండపల్లి రామ చంద్రరావుగారి రచననే స్వీకరించారు కాబట్టే ఆయన వ్రాసిన ఓంకారరామ, వైకుంఠరామ, రామనారాయణ శబ్దత్రయం అలాగే వ్రాశారు. దీనినొక ప్రత్యేక సాక్ష్యంగా తీసుకునేదేముంది ? మరో సాకు చెప్పుకుంటున్నారని విన్నాను. అదే మంటే విశ్వనాథ వారి కల్పవృక్షమట. రామ పరశురాముల ఘట్టంలో మానవరూపాన ఉన్న నారాయణుడే రాముడని గ్రహించిన పరశురాముని మాటను బట్టి వీరు కళ్యాణంలో రామనారాయణ చెప్పుకొంటారుట. అంత కంటే రాజోలులో <u>రా</u> ఉంది కాబట్టి మద్రాసులో <u>మ</u>, నారాయణ పేటలో <u>నారాయణ</u> ఉంది కాబట్టి రామనారాయణ అనేది భద్రాద్రి కళ్యాణంలో చెప్తున్నామంటే సరిపోతుంది. అలాగే ఉన్నాయి. వీరి సాకులు, సాక్ష్యాలు. గురుశిశు బిరుదాంకితులు శ్రీ సుబ్రహ్మణ్యదీక్షితుల వారు భద్రాద్రిరామ శతకంలోఎక్కడా రామనారాయణ ప్రయోగం చేయలేదు. దాని ముందుమాటలో కొండపల్లి వారి 6,7,8 పుటల సంగ్రహ రూపం వ్రాయించారు. తాము తుమ్ముకొని తామే శ్రీరామ రక్ష అనుకొన్నట్లు అవకాశమున్న చోటల్లా కొండపల్లి వారి పదాలు వ్రాయించి అవన్నీ వారి సాక్ష్యాల సరుకుగా చెప్పుకొన్నారు. ఇటువంటి పనులు చేయటానికి వారికి అభిమానం అడ్డురావటంలా. డా॥ దివాకర్ల వేంకటావధాని గారిని ఒకరు రామనారాయణ శబ్దాన్ని ప్రయోగించిన వారుగా చెప్పారు. ఆయన ఆసలు రామనారాయణ అనలేదు. అది భూటకపు మాటే. ఈ పాపాలకు పరిష్కారం ఆ రామాంజనేయులు చేయవలసిందే. ఫాల్గుణమాసంలో శ్రీరామచంద్రునిగా పెండ్లికొడుకును చేస్తారు. మరి ఆయనకు రామనారాయణుడిగా పెండ్లిచేయడమేమిటి? పెండ్లికొడుకు ఒకరు, పెండ్లి వేరొకరికి – అంటే ఎంత తలతక్కిలగా ఉంది?




## 13) ఇదో పెద్ద చీటింగు కేసు

**ఇది పత్రికలో వచ్చిన ఒక భక్తుని లేఖ**

సనాతన ధర్మజ్యోతి సంపాదక మహాశయులకు నమస్కృతులు. మీ పత్రికలో భద్రాద్రి గూర్చి వచ్చిన విషయాన్ని చూడటం తటస్థించింది. నా అనుభవాన్ని కూడా మీ ముందు ఉంచుతున్నాను. పాఠకులకు అందచేయవలసిందిగా ప్రార్థన.

భద్రాద్రి రాముడు మాకు ఇష్టదైవము. సీతారామ కళ్యాణం చేయిద్దామని మొక్కుకున్నాను. దాని ప్రకారం భద్రాచలం వెళ్ళి సీతారామ కళ్యాణానికి డబ్బు కట్టాను. కళ్యాణం చేశారు. చేశారంటే చేశారని అందరిలా తృప్తి పడ్డాను. కాని మీ పత్రిక చూశాక నాకు యథార్థం తెలిసింది. నిజంగానే అక్కడ రామనారాయణ అనే మటే వినపడింది. గోత్రము, ప్రవరలు కూడా సీతారాములవి చెప్పలేదు. ఎవ్వరూ మాట్లాడక పోవటంతో నేనూ మాట్లాడలేదు. మరి వాళ్ళు చేసింది సీతారామ కళ్యాణం కాదు. లక్ష్మీ నారాయణుల కళ్యాణం. ఇలా నన్ను ఛీట్ చేశారు. నన్ను కాదు. వందలు, వేలు, లక్షల మందిని ఛీట్ చేస్తున్నారు. ఇంత మందీ తమ మొక్కు కోసం డబ్బు కట్టికూడా మొక్కు తీరిందని భ్రాంతి పడుతున్నారు.కాని నిజానికి తీరనట్లే కదా! భక్తుల మాట అటుంచి సాక్షాత్తు సీతారాములనే ఛీట్ చేసినట్లు. ఎందుకంటే వాళ్ళని కూర్చోపెట్టి మరొకళ్ళకి పెళ్ళి చేశారు. నామం, గోత్రం, ప్రవరలే కదా ముఖ్యం. సుబ్బారావనే పేరు చాలా మందికి ఉంటుంది. గోత్రం చెప్పటం వల్ల సరిగా ఆ వ్యక్తికి సంబంధించిన పూజ అవుతుంది. ఇక్కడ

కూడా అంతే. సీతారాములనే కాదు. అసలు ధశరథుడు, జనకుడు వాళ్ళనే ఛీట్ చేసినట్లు. కని పెంచి వాళ్ళకు పెళ్ళి చేసేది దశపూర్వేషాం దశాపరేషాం అని పది ముందు తరాలు, పది తరువాత తరాలు ఉద్ధరింపబడాలని, దశరథ, జనకుల గోత్రప్రవరలే చెప్పకపోతే ఇంక వాళ్ళ వంశాల ఉద్ధరణేముంది? ఇది సెంటిమెంట్‌కు సంబంధించిన విషయమే కాదు. శాస్త్ర విషయం. ఆ శాస్త్రాన్ని కూడా ఇలా మోసం చేయటం జరుగుతోంది.

మంగళసూత్రాలలో ఒకటి దశరధునిది, మరొకటి జనకునిది అన్న రామదాసు మాట కూడా వీళ్ళు పేర్లు మార్చటం వల్ల అసత్యమవుతోంది. అలా రామదాసును కూడా ఛీట్ చేస్తున్నారు. శక్తియుక్తులు లేకపోవటం వల్లనాకు సాధ్యం కాదు కాని ఏ పుణ్యాత్ములయినా పూనుకొని ఇలా మోసం చేస్తున్న వారిపై ఛీటింగ్ కేసు పెట్టి లక్షలాది మందికి జరిగే అన్యాయాన్ని తప్పించ వలసిందిగా తమ ద్వారా విన్నవించుకొంటున్నాను అని వాపోయాడు.

## 14) విలువలు మార్చేస్తున్నారు.

రామదాసు తర్వాత భద్రాద్రి రామసేవ అంతగా చేసిన వారు, రామదాసుగారి కైంకర్యాలు నెరవేర్చడం కోసం తను ఉన్నతోద్యోగాన్ని వదలి 18వ శతాబ్దిలో భద్రాద్రి రాములకు నిత్య నైమిత్తికోత్సవ వ్యవస్థ చేసిన వారు శ్రీ తూము నరసింహదాసు గారు. వారు ఎక్కడా రామనారాయణ శబ్దము తమ కీర్తనలలో వాడలేదు. కల్యాణం అలా చేయించలేదు. అంటే రామదాసును కూడా తమ వ్యూహానికి వాడుకొనటం కాక ఏమౌతుంది? రామదాసు తర్వాత నరసింహదాసు గారికే ఇక్కడ గౌరవములు లభింపవలసి ఉండగా ఆహ్వాన పత్రికలపై రామదాసుతో పాటు ఆలయానికి అటువంటి ముఖ్య సంబంధమేమి లేని వారి చిత్రాలు ముద్రిస్తున్నారని, క్షేత్రానికి అది అన్యాయమని తూము నరసింహదాసుగారి 8వ తరం వారు శ్రీ తూము వేంకట లక్ష్మీ శ్యామసుందర రావు, శ్రీ తూము వేంకటరామకృష్ణ గార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా ఒకటేమిటి? తమకెదరు లేదు కదా అని ఇష్టం వచ్చినట్లు చేసుకుపోతున్నారు. అదేమని అడిగే నాథుడు లేదు. అధికారులకు ఇవేమి పట్టడం లేదు. ఈ పాపాల కర్తృత్వం తమకే చెందుతుందనేది ఊహించడం లేదు.

## 15) కుడ్య చిత్రాలు మార్చేశారు

రామదాసు రామచంద్రస్వామి దేవస్థానాన్ని నిర్మించాడు కానీ రామనారాయణ దేవస్థానాన్ని కాదుకదా ! అలా అంటే ఎప్పుడో దేవస్థానం బోర్డు కూడా మార్చేస్తారేమో ! అలా పేరు మార్చబోవటం లేదని కరపత్రము ముద్రించారు. కాదంటే అవునని లేనేమో! చిత్రకూట మండపంలో సీతారాముల గాథ ఎంత గొప్పగా చిత్రించబడి ఉందో శ్రీ సాదినేని రంగారావుగారి 'భద్రాద్రి సీతారాములు కల్యాణము పుస్తకం 31 వ పేజీలో స్పష్టంగా చెప్పబడింది. అది 1973లో వెలువడింది. చిత్రకూట మండపంలోని కుడ్య చిత్రాలన్నీ అప్పటి చిత్రాలలో రామనారాయణ శబ్దం లేదు. ఇటీవల రామనారాయణపరంగా వ్రాయించేశారు. ప్రస్తుతం వాటి చోటు మారింది. తెగించిన వారికి అడ్డు ఆపు, అబద్ధం సుబద్ధం ఏమున్నాయి?

## 16) సేవా కైంకర్యాలు మార్చేశారు

సీతాజయంతి వైశాఖశుద్ధ నవమి నాడు జరుగుచున్నట్లు శ్రీ కొండపల్లి రామచంద్రరావు గారి 1971వ సంవత్సరం ముద్రణ పుస్తకంలో ఉంది. అప్పటికి ఆమె సీతయే. తదుపరి గోత్రప్రవరలు మార్చే వ్యూహంలో ఈమెను సీతామహాలక్ష్మిగా సముద్రుని కూతురుగా మార్చారు. కాబట్టి సీతకు పుట్టినరోజు చేయకూడదని దానిని ఎత్తేశారు. ఇంకా విచిత్రమేమంటే 1960నాటి క్షేత్రపరిచయంలో లేదు. ఇప్పుడ లేదు. మధ్యలో ఎలా వచ్చిందో అర్థం కాని విషయం. రాముని పుట్టినరోజు తమకు ఇబ్బంది అవుతోంది. కాబట్టి "యస్యావతారదివసే" అనేది ఎత్తేశారు. ఈ సీతారాములకు చేసే ద్రోహాన్ని ఎలా భరించాలి? ఒకే ప్రాంగణంలో అన్య దేవతా పూజ చేయటం ఉండదంటారు. వైదిక స్మార్త సంప్రదాయానికి సంబంధించిన సత్యనారాయణ స్వామి వ్రతాలు, కల్యాణం జరుగుచున్నాయంటే ఆరంభంలో స్మార్త ప్రమేయం అర్థమవుతోంది. నిత్యనివేదనలలో దోసెల నివేదన జరగాలని శాసనం ఉంది. అది ఇప్పుడు పాటింపబడటం లేదు. శాసనాల్లో లేని కదంబాన్ని ప్రవేశపెట్టటమే కాక అనంతరం తిథుల మార్పు కూడా చేశారు. ఇలా ఎన్ని అసంగతాలో

విశ్వరూపసేవ వైకుంఠ ఏకాదశి పిదప వచ్చే బహుళ ఏకాదశి నాడు జరిగేది దానిని బహుళ ద్వాదశికి మార్చారు. ఎందుకంటే వాళ్ళకు (పులుసు అన్నం) కదంబ ప్రసాదం తినే అవకాశం ఉపవాసదినం ఏకాదశి నాడు కుదరదు కాబట్టి ద్వాదశికి

మార్చారు. నిజానికి ఏకాదశి వ్రతంలో దశమి, ద్వాదశుల ఏకభుక్తం కూడా నియమమే. అలా ద్వాదశిరాత్రి అది తినటం ఎలా సముచితమో తెలియదు. ఇవన్నీ రామదాసు కాలం నుండే వచ్చాయని చెప్పేస్తారు. జనాలు నమ్మేస్తారని. ఆలయం పూజాదికములలో ఒక భాగం దమ్మక్కసేవకు నిదర్శనంగా 'పోకలవారివంతు' అని ఉన్నదట. కాని దానిని అర్చకులే అనుభవిస్తున్నారని కొండపల్లివారు తమ గ్రంథం పదవపుటలో వ్రాశారు.

అలాగే అభిషేకం అయ్యాక చివర క్షమాప్రార్థనలో 'తత్సర్వం క్షమ్యతాం దేవ – నారాయణ నమోస్తుతే అనాలి. దానిని మార్చి 'తత్సర్వం క్షమ్యతాం రామ నారాయణ నమోస్తుతే' అని ఇటీవల మార్చారు. వాళ్ళ ఇష్టంవచ్చినట్లు రామనారాయణ వాదాని కనుకూలంగా మార్చేసుకుపోతూ పాపం రామదాసుకి అంటకట్టేయటం ఎంత బాధాకరం!

## 17) సీతారాములను బ్రాహ్మణులుగా మార్చేశారు

రామునకు వసిష్ఠ గోత్రం, నాభాగ, అజ, దశరథ ప్రవర చెప్పవలసింది. కానీ అచ్యుత గోత్రం, పరబ్రహ్మ శర్మ, వ్యూహనారాయణ శర్మ, విభవవాసుదేవ శర్మ చెబుతున్నారు. సీతాదేవికి గౌతమ గోత్రం, స్వర్ణరోమ, హ్రస్వరోమ, జనకుల ప్రవర చెప్పవలసింది. కానీ సౌభాగ్య గోత్రం, విశ్వంభర శర్మ, రత్నాకర శర్మ, క్షీరార్ణవ శర్మ చెబుతున్నారు. వీరి తండ్రులు శర్మలట. అంటే బ్రాహ్మణులన్నమాట. పెళ్ళి బ్రాహ్మణులకట. పట్టాభిషేకం మాత్రం రాజుకిట. ఎలా సమర్థనీయం ? పరబ్రహ్మకు శర్మత్వమేమిటి ? చాలా తెలివిగా అసలు రామునకు వసిష్ఠ గోత్రం చెప్పాలని ఎక్కడుంది? అని ప్రశ్నిస్తారు. ఆపస్తంబ ప్రవరఖండంలో కపర్దిస్వామి భాష్యయుతంలో 'క్షత్రియాణాం విశేషః పురోహిత ప్రవరా ఏవ తే భవితు మర్హన్తి' అని స్పష్టంగా చెప్పబడినందున క్షత్రియుడయిన రామునకు పురోహితుడైన వసిష్ఠుడు, జనకునకు పురోహితుడయిన గౌతముడు గోత్రప్రవరలందు వస్తారు. అలాకాక రాముని విషయంలో మంత్రద్రష్ట ఉన్నందున

**"స్వస్య మంత్రదృశస్తేషాం – వివాహ ప్రవరా స్మృతాః**
**న చేన్మంత్ర దృశస్తస్య – ప్రవరా స్స్వపురోధసః"**

అని మంత్రద్రష్ట గోత్ర ఋషి అవుతాడు. రామమంత్రానికి ఋషి వసిష్ఠుడే కదా. అలా కాక పురోహితుడూ వసిష్ఠుడే కదా! ఏ రీతిగానయినా వసిష్ఠ గోత్రమే చెప్పాలి.

వీరి ఆగమమే సింహాచలంలో ఉంది. అక్కడ పరబ్రహ్మకు కాశ్యప గోత్రమట. ఇక్కడ అచ్యుత గోత్రమట. అక్కడ క్షీరార్ణవ శర్మకు భార్గవ గోత్రమట. ఇక్కడ సౌభాగ్య గోత్రమట. మరి 'లక్ష్మీం క్షీరసముద్ర రాజ తనయాం'ని ఏమి చేయాలి ? సముద్ర రాజు క్షత్రియుడు కదా ! వర్ణాంతర లేదా కులాంతర వివాహమా ? ఇలాంటి వ్యవహారాన్ని మధ్యలో తెచ్చిపెట్టిన వారు భద్రాద్రిలోని వారే కాబట్టి, వారే ఈ సంగతులు కూడా వివరించాలి.

## 18) వ్యాఖ్యానాలు మార్చేశారు

గతంలో జమ్ములమడక మాధవరామ శర్మగారు, ఏలూరిపాటి, ఉషఃశ్రీ, రామాయణం శర్మగారు వంటి పండితులతో వ్యాఖ్యానాలు జరిగేవి. లోకమంతా వినేది. అట్టి పండితుల వద్ద తమ మార్పులు నడవని వ్యూహకర్తలకు అర్థమైపోయింది. అందువల్ల ఆ పండితుల వ్యాఖ్యలను వినిపిస్తే లాభం లేదని, రామనారాయణగా పేరు మార్చిన వారే దానిని వివరించడం పనిగా పెట్టుకున్నారు.

శ్రీరామనవమి సమయంలో భద్రాద్రి శ్రీసీతారామ కళ్యాణానికి ఆకాశవాణి వారి ప్రత్యక్ష వ్యాఖ్యాతగా నాన్న జమ్ములమడక మాధవరామశర్మగారు చాలా ప్రసిద్ధులయినారు. ప్రథమ సంవత్సరం నుండి వరుసగా అనేక సంవత్సరాలు ఆయనే వ్యాఖ్యాత. అది వ్యాఖ్యానంగా కాదు. దగ్గర కూర్చొని పెళ్ళి చేయించినట్లే ఉండేది. దశరథ జనకుల గోత్రప్రవరలు ఆనాడు తమ తండ్రిగారు చెప్పిన రీతిని 'మాధవ స్మృతి' ప్రత్యేక సంచికలో వారి కుమారుడు మక్కిమక్కిగా వివరించారు. ఈ విషయంలో శ్రీ టి.వి.బి.ఆర్. కృష్ణమూర్తి గారు ఇలా అన్నారు.

అసలిపుడు పండితులని వ్యాఖ్యానానికి పిలవటం మానేశారు. నామం, గోత్రం, ప్రవరలు మార్చిన తప్పును సమర్థించుకోవటం కోసమే ఇప్పుడు వ్యాఖ్యానం సరిపోతోంది. మరో పండితుణ్ణి కూర్చోబెడితే వీళ్ళు చేసే తప్పుని వాళ్ళు ఖండిస్తారేమో అని భయం. వాళ్ళే వైదిక కమీటీ అని ఒకటి వేశారు. వాళ్ళే చెప్పుకుంటున్నారు. అపుడు ఆకాశవాణికి నేను రిప్రెజెంటేటివ్‌ని రిపోర్టరుని. అప్పుడు ఈ తప్పు విధానం లేదు. ఈ పది పన్నెండేళ్ళ బట్టే జరుగుతోంది. ఏదయినా ప్రాశస్త్యం పోయింది. చాలా తప్పులు జరుగుతున్నాయి. పేర్లు, గోత్ర ప్రవరలు మార్చారు. ఏం చేయాలో? రాముడే మరల పూర్వస్థితి తెచ్చుకోవాలి. మంచి వాళ్ళెవరో పూనుకోవాలి. అపుడు పునర్జన్మ వస్తుంది అన్నారు.

భద్రాద్రికి ప్రమాణం భద్ర మహర్షి, రామదాసు, తూము నరసింహదాసుగార్లు. వారు ముగ్గురూ అనని 'రామనారాయణ' శబ్దం కల్యాణంలో చేర్చి సీతారాములకు, వారి కళ్యాణం చేస్తామని మొక్కుకొనే లక్షలాది భక్తులకు అన్యాయం చేయటం పెద్ద నేరం. కళ్యాణ సమయంలో సీతారాములను వర్ణించటానికి కాక తాము చేసే తప్పుని సమర్థించుకోవటానికే అర్చకులకు సరిపోతోంది. ఒప్పు చేయటాన్ని సమర్థించు కోనక్కర్లా. గతంలో సీత, రామచంద్రులుగా చెప్పినంత కాలం హాయిగా ఆ సీతారాములను వర్ణించుకుంటూ వేదిక మీదివారు, క్రిందివారు కూడా పరమానంద భరితులయ్యేవారు. ఇప్పుడు పాపం వాళ్ళ పని నిరంతరం 'రామనారాయణ'ను సమర్థించటం, దాన్ని కాదన్నవారిని నిందించటమే అయిపోయింది. ఇంక సీతారాముల స్తుతి లేదు. భక్తులకు శ్రవణానందమూ లేదు.

ఒక తప్పును సమర్థించుకొనటం కోసం మరిన్ని తప్పులు చేస్తున్నారు. వారి వివరణ వినండి. భద్రాద్రిలోని రాముణ్ణి ఓంకారరాముడని, వైకుంఠరాముడని, రామనారాయణుడని అంటారట. ఎవరంటారు? ఎక్కడుంది అలా ? రామాయ, రామభద్రాయ, రామచంద్రాయ అని రామ, రామభద్ర, రామచంద్ర అంటారంటే అర్థముంది. వారు చెప్పే పేర్లు ఎక్కడున్నాయో చూపమనండి. రామదాసన్నాడా ? లేదే. తామే తుమ్ముకొని, చిరంజీవ అనుకొన్నట్లు వారే చెప్పుకొని వారే వివరణ ఇచ్చుకొంటున్నారు. ఆ మూడూ ఉన్నాయట, కాని రామనారాయణ స్వామినే వరాయ అనే అంటారట. మరి మూడు ఉన్నప్పుడు మార్చి మార్చి ఓంకార రామ స్వామినే వరాయ, వైకుంఠ రామస్వామినే వరాయ అని కూడా అనాలిగా ! అవి మాత్రం అనరు. ఎందుకని ? అవి రామనారాయణుని పెళ్ళికొడుకుని చేయటం కోసం తెచ్చుకొన్న తోడి పెళ్ళికొడుకులు.

నామగోత్ర ప్రవరల మార్పును సమర్థించుకొంటూ వీరు చూపే మరో తెలివైన సాకు వేంకటేశ్వరుని మలయప్ప అని, మంగళగిరి నరసింహస్వామిని పానకాల రాయుడు, సింహాచల లక్ష్మీనరసింహస్వామిని అప్పన్న అన్నట్లే భద్రాద్రి రాముని రామనారాయణ అంటారని. అయితే వారి వారి కళ్యాణాలలో మలయప్ప స్వామినే వరాయ, పానకాల స్వామినే వరాయ అని, అప్పన్న స్వామినే వరాయ అని అంటున్నారా? మరి వీరెందుకలా అంటున్నట్లు? పై వారి వలె వీరూ కళ్యాణంలో నామగోత్ర ప్రవరలలో చెప్పరాదు. అలా కళ్యాణంలో మార్పు చేయకపోతే సహస్ర

నామాలు లాగే ఇలాంటి  పేర్లెన్నయినా పెట్టుకోవచ్చు. కాని ఈ విధమైన తప్పు చేయడమెందుకు? ఒంక లేనమ్మ డొంకపుచ్చుకుపోయిందని ఇన్ని సాకులు చెప్పుకొనటమెందుకు ? అలాగే భద్రాద్రి పరిసరాల రామునకు చాలా పేర్లున్నాయని, శోక రాముడు, యోగరాముడు, భోగ రాముడు, ఇలాగే రామనారాయణుడు కూడ ఉందంటారు. నిజమే శోకరామ స్వామినే వరాయ, యోగ రామస్వామినే వరాయ, భోగరామస్వామినే వరాయ అంటున్నారా? లేదే. అలాగే రామనారాయణ స్వామినే వరాయ అనకూడదు. ప్రజలు ఇలా ఎదురు ప్రశ్నించలేరు కదా అని, ఆలయం మన చేతుల్లోనే ఉందని, మైకు మన చేతుల్లోనే ఉందని ఇష్టం వచ్చినట్లు చేసుకొంటూ వాటిని సమర్థించుకొంటూ పోతే ఆ ప్రజలలోని ఆత్మారాముడు వీళ్ళ పాపానికి తగ్గ ప్రతిఫలం ఇచ్చి తీరుతాడని గ్రహించాలి.

పొడిచేటి రంగాచార్యులుగారు పండిత ప్రముఖులుగా గుర్తింపబడి శ్రీ భద్రాచల క్షేత్రమాహాత్మ్యం వ్రాయుటకు ధర్మకర్తల మండలిచే గౌరవంగా ఆహ్వానింప బడినవారు. వారు బ్రహ్మ పురాణాంతర్గత క్షేత్ర మహాత్మ్యాన్ని అనువదిస్తూ

**"యస్తు తత్ర త్యజేత్ ప్రాణాన్ - భద్రాచల సమీపతః**
**తస్య రామస్స్వయం సాక్షాత్తత్స్వరూపందిశత్యాజః.**

అనే దానికి 'ఎవడు భద్రాద్రి ప్రాంతమున గత ప్రాణుడగునో వానికి శ్రీరామ చంద్రుడు తన రూపము వంటి స్వరూపము నొసంగి' అని అనువదిస్తే శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులగారు రూపకల్పన చేసిన గ్రంథంలో శ్రీపొడిచేటి రంగా చార్యుల వారిని తాత్పర్య కర్తగా ప్రచురించియే వారి భావాన్ని "శ్రీ భద్రాచల క్షేత్ర సమీప మందు ఎవ్వరు మృత్యువువాతబడుదురో వారికి శ్రీరామనారాయణ ప్రభువు పరమ పదమున తనవలెనే అని మార్చేశారు. ఇటువంటి పనిని పండితు డయిన వాడు చేయవచ్చా ? పండితులు మెచ్చుతారా ? కంచర్ల గోపన్నగారి 9వ తరం వారు, గొప్ప కవిపండితులు శ్రీ కంచర్ల పాండురంగ శర్మగారు వారు 'రామదాసు' చరిత్ర వ్రాసి 1996లో ముద్రించారు. అప్పుడది 76 పుటల గ్రంథం. పునర్ముద్రణలు పొందింది. 2007లో చివరిసారిగా ముద్రితమవటం, భద్రాద్రిలో సన్మానితులవటం జరిగింది. ఈ ముద్రణ నాటికది 150 పేజీలు దాటింది. విశేషమేమంటే 1996లో రెండు సార్లు మాత్రమే భట్టరుగారి పేరును వ్రాయగా 2007 ముద్రణలో భట్టరుగారి పేరు 39సార్లు ప్రయోగింపబడింది. ఇంకా విశేషం 1996 ముద్రణలో అసలు రామనారాయణ శబ్దమే లేదు కాని 2007 ముద్రణలో రామనారాయణ పదం 11

సార్లు ప్రయోగింపబడింది. ఎవరి హస్తలాఘవంతో అలా జరగిందో లోగుట్టు పెరుమాళ్ళకే ఎరుక. చివరకు సీతారాములకు తల్లిదండ్రులు లేరనే స్థాయికి వచ్చారు. 2019 శ్రీరామనవమి కల్యాణం వ్యాఖ్యానంలో స్థానాచార్యులు వారన్నది యూట్యూబ్‌లో చూడవచ్చు. భక్తులీ వ్యాఖ్యానాలంగీకరిస్తారా?

వీరి తెలివి తక్కువ వివరణో, అతి తెలివి వివరణో అర్థంకాదు. శ్రీరాముడు సరయు నదిలో కలిసిపోయాడు కాబట్టి ఆయన ఇక రాడని, వైకుంఠంనుండి వచ్చేవాడే ఇక ఉంటాడు కాబట్టి రామనారాయణుడే తప్ప ఇక దశరథరాముడుండడని అంటున్నారు. మరి లక్ష్మణుడూ సరయూ నదిలో కలిసిపోయాడుగా. ఆయనను లక్ష్మణ శేషుడనాలిగాని అలా అనరేం? అలాగే కృష్ణుడు కూడా తనువు చాలించాడు. ఇక వచ్చే కృష్ణుడు వైకుంఠవాసుడే కాబట్టి కృష్ణ నారాయణుడనరేం? చేసిన తప్పుని సమర్థించుకొనటం కోసం మరిన్ని తప్పులు చేస్తున్న వీరి నేమనాలి?

## 19) శుభలేఖల తీరు మార్చేస్తున్నారు

శ్రీరాముని కళ్యాణం అసలు ఫాల్గుణ పౌర్ణమి నాడు జరిగింది. (బాలకాండ 71/24 లో జనకుడు దశరథునితో మఘాహ్యద్య మహాబాహో – తృతీయ దివసే ప్రభో ! ఫల్గుణ్యా ముత్తరే రాజన్ ! తస్మిన్ వైవాహికం కురు అంటాడు.) రామదాసు ఆలయం నిర్మించిన నాటి పరిస్థితిలో నవమిఉత్సవం ఒక మాటు, కళ్యాణం ఒక మాటు జరపటం, ఆనాటి కొండ ప్రాంత ప్రయాణాలు కష్టమని దృష్టిలో పెట్టుకొనో, ముందు ఫాల్గుణంలో కళ్యాణం, పిదప చైత్రంలో పుట్టినరోజు చేయటం ఎందుకనో శ్రీరామనవమి శ్రీరాముని జననం రోజున సీతారామ కళ్యాణం చేసే వ్యవస్థ చేశారు. అదే తెనుగునాట స్థిరమయింది. అది శాస్త్ర సమ్మతమే. శాస్త్రం 'యస్యావతార దివసే తస్య కల్యాణమాచరేత్' అని ఏరోజు ఎవరు అవతరించారో ఆరోజు వారి కళ్యాణం చేయవచ్చు అని చెప్పింది. ఆ ప్రమాణంతో శ్రీరామనవమినాడు కళ్యాణం జరుగుచున్నదని సమాజానికి చెప్పటం కోసం ఆ వాక్యం గతంలో శుభలేఖలలో వ్రాసేవారు. యస్యావతార దివసే అనేది చైత్ర శుద్ధ నవమి దశరథరామునిదవుతుంది కాబట్టి ఆ సీతారాముల నామ గోత్ర ప్రవరలతోనే కళ్యాణం చేయాలి కాబట్టి, రామనారాయణుడు పుట్టినరోజసలు లేదు. కాబట్టి రామనారాయణ చెప్పి గోత్రప్రవరలు

మార్చటం కోసం అనూచానంగా వచ్చే ఆ శాస్త్ర వాక్యం యస్యావతార దివసే అనేది శుభలేఖలలో ఎత్తేశారంటే ఎంత దుర్మార్గమో ఆలోచించాలి. ఇది ఎవరి పనియో తెలియదు. అందే

**"అవతారేషుచ సర్వేషు - అనుక్తే జన్మతారకే ।**

**చైకాదశ్యాం ప్రకుర్వీత - కల్యాణం భక్తి భావతః ॥"**అని పురుషోత్తమ సంహిత 24/86లో చెప్పినందున రామనారాయణుడైతే ఏకాదశి నాడు కల్యాణం చెయ్యాలి. అలా చెయ్యటం లేదు కాబట్టి అతడు రామనారాయణుడు కాదు. శ్రీరామచంద్రుడే అని స్పష్టం.

'ప్రమాదో ధీమతా మపి' అని పండితులు కూడ ఒక్కొకప్పుడు పొరపాటు పడవచ్చు. అలా జరిగి ఉంటే దానిని సవరించుకొనవచ్చు. కాని చిరకాలంగా జరుగుచున్న ఒక వ్యూహంలో భాగంగా ఇది జరుగుచుండటం వలన దానిని స్థిరం చేయడం కోసం అనేక విధాల దోషాలు చేస్తున్నారు. భద్రాద్రికి కళ్యాణం ప్రధానమే కాబట్టి దానిని మార్చేయటానికి పూనుకొని నామ గోత్రప్రవరలన్నీ మార్చేస్తున్నారు. రాముడయితే జనకదశరథుల గోత్రనామాలు చెప్పవలసి ఉంటుంది. కాని ఆయనని రామనారాయణుణ్ణి, జానకిని సీతామహాలక్ష్మిని చేసి లక్ష్మీనారాయణ గోత్ర ప్రవరలు చెప్పి రామశబ్దంలోని 'మ' కారాంతర్గతమయిన శివత్వాన్ని తుడిచేసేయాలనే దురాలోచన చేశారు. వారి మార్పుకు అనాదిగా వస్తున్న శుభలేఖలు కూడా ప్రతిబంధకంగా ఉన్నాయి. కాబట్టి క్రమంగా వానిని ఎలా మార్చారో చూడండి. భగవద్విషయంలో ఇట్టి దుర్మార్గము అవలంబించడమంటే ఆ స్వామిని ఏమీ చేయలేనివానినిగా జమకట్టడమేగా ! చేయగలడు. చేస్తాడు. చేస్తున్నాడు కూడా. కాని వీరు గ్రహించలేకున్నారు.

27-3-1969 కళ్యాణం శ్రీ భద్రాచలమందు వేంచేసియున్న శ్రీసీతారామ చంద్రస్వామివారలకు తిరు కళ్యాణ మహోత్సవంగానే వ్రాయబడి అంతా సీతారామ శబ్దాలతోనే తెలుపబడింది. 19 మార్చి నుండి ఏప్రిల్ 2 వరకు అనేక కార్యక్రమాలు తెలియజేయబడినాయి. క్షేత్ర పరిచయం, దమ్మక్క, గోపన్న, తూము నరసింహదాసులు ధర్మకర్తల పేర్లు ఉదహరింపబడినాయి. తప్ప రామనారాయణ శబ్దం లేదు. క్రమంగా మార్పులు చేసుకుంటూ వచ్చారు.

2001 సంవత్సరం నుండి ఆహ్వాన పత్రికలలో ఈ మార్పు తీసుకురాబడింది. భద్రాచల క్షేత్ర సంక్షిప్త చరిత్ర అంటూ తారక మంత్రం చేస్తే శ్రీమన్నారాయణుడు మరల రామరూపం దాల్చి వెలిశాట్ట. స్వామికి భద్రాద్రి రాముడని, వైకుంఠ రాముడని, ఓంకారరాముడని, రామనారాయణుడని పేర్లు అని వీరిపైత్యం ఆరంభించారు. దీనికి బ్రహ్మపురాణాంతర్గతమని



పైన వ్రాయటం వారి వంచనే. ఆ పురాణంలో ఈ నామాలున్నాయా? లేవు. భక్తులకది తెలియదు కాబట్టి నమ్ముతారని వీరి కుటిల యత్నం. అలా నెమ్మదిగా వీరి వ్యూహం ఆరంభించారు. అధ్వర్యులంటూ తమ పేర్లు వ్రాసికొనసాగారు. కళ్యాణమండపం చిత్రం వేశారు. అందలి దశరథ జనకుల నామ గోత్ర ప్రవరలెత్తేశారు. మంగళసూత్రాలు దశరథ జనకులవిగా రామదాసు చేయించినట్లు వ్రాశారు కానీ దశరథ జనకుల ఊసు లేదు. ఈ అన్యాయం కళ్ళకు కన్పడుతోంది. కాబట్టి దీనిని మార్చాలని ఆలోచించారు.



మరో విషయం. శ్రీసీతారామ కళ్యాణ శుభలేఖలపై కళ్యాణ మండపం చిత్రం వేస్తున్నారు. ఆ చిత్రంలో చతుర్భుజుడు దశరుధుడు, కౌసల్య, సుమిత్ర, కైకేయిలతో, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులతో, సీతమ్మ, జనకుడు, భార్య, విశ్వామిత్రులవి చెక్కబడి ఉంటుంది. దీనిని బట్టి చతుర్భుజ రాముడు దశరథ సుతునిగానే వివాహం పొందాడనేది స్పష్టం. చతుర్భుజాలున్న మాత్రంతో శుభలేఖలో ఉన్నట్లు దశరథ, జనక పరివార గోత్ర, నామాలు చెప్పాలి కదా ! అలా చెప్పటం లేదు. ఆ మాట

అంటే మున్ముందు ఆ కళ్యాణం మండపం చిత్రం వేయటం కూడా మానేస్తారేమో. ఇలా విచక్షణారహితంగా జరుగుచున్న మార్పులను అధికారులు, విజ్ఞులు గుర్తించి పరిష్కరింపకపోవటం విచారకరం.

శుభలేఖలందు రామోజీ, లక్ష్మోజీలుగా చెప్పుకొన్న రామలక్ష్మణులు తానీషాకు ఇచ్చిన మాడలు చిత్రం కూడా ఇస్తున్నారు. అందు రామపట్టాభిషేకం ఉన్నది తప్ప చతుర్భుజుడూ లేడు, రామనారాయణుడు లేడు. ఆ రాముడు భద్రాద్రి రాముడనియే కదా గ్రహింపవలసినది. 16-1-18న మహాన్యూస్‌లోను, ది. 12-3-18న భక్తి టి.వి.లోనూ ఈ విషయంలో సుదీర్ఘమైన చర్చ జరిగింది. భద్రాచలం, అర్చకులు, కొందరు పండితులు పాల్గొన్నారు. యు ట్యూబ్‌లో రామనారాయణ అని టైపు చేయగానే అన్ని ఛానళ్ళలో ఈ చర్చకు సంబంధించిన వీడియోలు లభ్యమవుతాయి.

## 20) అన్నదాత కష్టనష్టాలకు కారణం భద్రాద్రి రామ అపచారమే

మనకు అసలు అన్నదాత శ్రీరామచంద్రుడు. "అన్నమో రామచంద్రా"! అంటాము. అంతేకాని మరో దేవత పేరు పలుకము. ఎందుకంటే మనకు అన్నం పెట్టింది ఆయనే. రాముడు మన ప్రాంతానికి రాకముందు ఈ ప్రదేశమంతా రాక్షస మయంగా ఉండేది. కాబట్టి ప్రజలు ఇక్కడ నివసించి, భూమిని దున్ని, పంటలు పండించుకునే స్థితి లేదు. రాముడు వచ్చి రాక్షసంహారం చేయడంతో ఈ భూమి పంట పండించుకుని తిని, ప్రజలు నివసించే పరిస్థితి ఏర్పడింది. అందుకే పద్మ పురాణం " ఏ రామం న భజిష్యంతి తే నరా జఠరం స్వకమ్' అని రాముని తలచని వారికి అన్నం తినే అర్హత లేదని చెప్పింది. రాముడే... భద్రాద్రి రాముడే మన అన్నప్రదాత. ఆయనకు అన్యాయం జరుగుతున్నప్పటి నుండి రైతు ఆత్మహత్యలు, కష్టనష్టాలు పెరిగిపోయాయి. ఎవరికో ఒక దురాలోచన వచ్చింది. అదేమంటే రాముడి పేరు మార్చేద్దామని, 'రామ నారాయణ' అందామని. ఆ పేరునే కళ్యాణం సంకల్పంలో చెప్పడం మొదలుపెట్టారు. గోత్రప్రవరలు కూడా నారాయణునివే చెప్పటం సాగించారు. అంటే అసలక్కడ 'సీతారామకళ్యాణం జరటం లేదు. లక్ష్మీనారాయణ కళ్యాణం చేస్తున్నారు. అది పెద్ద వంచనగా జరుగుతోంది కాబట్టే భక్తులందా గ్రహించలేకపోతున్నారు.

శ్రీరామునకు నిత్యకళ్యాణం, నవమికళ్యాణం – ఇవన్నీ చేయటం ఎందుకు? లోకకళ్యాణం కోసం. ఆ కళ్యాణంలో అపచారం జరిగితే లోకకళ్యాణానికీ అపకారం జరుగుతుంది. మన ముఖ్యమంత్రి శ్రీ కె.సి.ఆర్.గారు లోకకళ్యాణం కోసం రుద్రయాగాలు, చండీయాగాలు – ఇలా ఎన్నో చేస్తున్నారు. అయినా అన్నదాత కష్టాలు పూర్తిగా తీరటం లేదు. ఆత్మహత్యలు ఆగటం లేదు. దానికి కారణం 'అసలు అన్నదాత' అయిన భద్రాద్రి రామునకు అపచారం జరుగుతూండటమే. దానిని సరిచేస్తే రాష్ట్రం సుభిక్షమై తీరుతుంది. పాపం ! సీతారాములను కూర్చోబెట్టి వేరు నామాలు, గోత్రప్రవరలు చెప్పటం ఎంత అన్యాయమండీ ! కళ్యాణమండపంలో కళ్ళ ముందు జనకుడు సీతను రామునకు అప్పగించే విగ్రహం ఉంటుంది. ఆ జనకుడు కన్యాదాత. ఆయన గోత్రప్రవరలు ఎత్తేశారు. అక్కడ ఇంకా చాలా అపచారాలు జరిగాయి, జరుగుతున్నాయి. కాబట్టి వెంటనే అధికారులు దీనిపై కూలంకషంగా పరిశీలన జరిపించి, సీతారాముల కళ్యాణం పూర్వపు శాస్త్రీయ పద్ధతిగా జరిగేటట్లు చూసి మన అన్నదాతలకు, ప్రజలకు మేలు కలుగజేయమని, వ్యవస్థను సరిచేసి, భద్రాద్రి రాముని అనుగ్రహానికి రాష్ట్ర ప్రజలందరం పాత్రుల మయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని భద్రాద్రి రామభక్తుల కోరిక.

## 21) ఉత్సవమూర్తిని మార్చారు

ఇప్పుడు కల్యాణం చేస్తున్న విగ్రహం సీతయే తప్ప అర్చకులు వివరణ లిచ్చుకొనే సీతామహాలక్ష్మి కాదు, లక్ష్మి కాదు. అసలిది భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయపు విగ్రహం కాదు. వీళ్ళు తనను నారాయణునకు అంటకట్టే స్థితి యెరిగి దానిని భరింపలేక ఆ పతివ్రతా రత్నం ముందే తల్లి ఒడిని చేరుకొంది. ఇది ఫణిగిరిలోని కేవలం సీతా విగ్రహం. ఈ విషయం కొండపల్లి రామచంద్రరావు గారి శ్రీ భద్రాద్రి క్షేత్రచరిత్రము 48వ పేజీలో స్పష్టంగా చెప్పబడింది. ఒక అరాచక పరిస్థితిలో ఉత్సవ మూర్తులు మూడింటిని గోదావరీ గర్భంలో దాచగా అనంతరం వెదకినప్పుడు రామలక్ష్మణులు మాత్రం దొరికి సీతాదేవి లభింపకున్న ఒకరి స్వప్నము ననుసరించి నల్గొండజిల్లా ఫణిగిరి రామాలయమునకు యాత్రికులవలె వెళ్ళి ఒకనాటి రాత్రి అచట సీతాదేవి విగ్రహము దొంగిలించి

తెచ్చారట. ఈ విషయం శ్రీ పొడిచేటి రంగాచార్యులుగారు శ్రీ భద్రాచలక్షేత్ర మాహాత్మ్యంలోని 142వ పేజీలో చెప్పారు. వీరు చెప్పినట్లే ఈ విషయం ఇటీవలి భద్రాద్రి రామదర్శినిలో కూడా 19వ పేజీలో వ్రాయబడింది. ఆ దొంగతనంలో పొరపాటున చీకటిలో లక్ష్మణస్వామిని దొంగిలించి తీరా తెలిశాక మరల గర్భాలయంలో ప్రవేశించి సీతావిగ్రహాన్ని తస్కరించి తెచ్చినట్లు అందున్నది. కాబట్టి ఇది కచ్చితమైన సీతావిగ్రహం.

## 22) కీర్తన మార్చారు

కీర్తన విషయంలో కూడా వీరి ప్రయత్నం ఎలా జరిగిందో చూడండి. రామదాసు "హరిహరరామ! నన్నరమర చూడకు" అని కీర్తన రచించాడు. అందులో హర అని శివత్వం ప్రకటమౌతుందని అది తీసేసి 'హరిహరిరామ' అని మార్చారు. నిజానికది హరిహరయే. యూట్యూబ్‌లో మంగళంపల్లి బాలమురళీకృష్ణ గారు సూరావఝల సిస్టర్స్ స్నేహ-స్వప్న పాడినది, మరియొకరు పాడినది, మంగళంపల్లి వారే మరోచోట పాడినది ఇలా ఎన్నో కనిపిస్తాయి. ఆ పదాన్ని ఎలా ఎప్పుడు మార్చారో గాని హరి హరి అని మార్చేసారు. దైవ విషయంలో చేసే అపచారాన్ని భగవంతుడే ఎక్కడో పట్టుబడ చేస్తాడు. వీరు తాళం వేసారు గాని, గొల్లెం మరిచారు. ఆ కీర్తనలోనే మొదటి చరణంలో పశుపతి రంజన పాపవిమోచన అని ఉంది. అది మార్చటం మర్చిపోయారు. పశుపతి అంటే శివుడే కదా! కాబట్టి ఆ కీర్తనలో శివత్వం కాదనలేము. హరిహరరామ అనేదే మూలమనటం స్పష్టం.

## 23) రామనారాయణ వాదానికి కీలకం

ఇంతకు ముందు రామనారాయణ వాదానికి హేతుభూతులయిన అని సూచించిన వ్యక్తి శ్రీమాన్ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులుగారే. అలా అనటానికి కారణం వివరించటం కర్తవ్యం. వారు ఆలయంలో అథర్వణ వేదపండితులయినా రామనారాయణ వాదానికి ముఖ్య వ్యక్తిగా కన్పడతారు. అకారణంగా ఒక వ్యక్తిని గూర్చి అందునా వేదపండితుల గూర్చి విమర్శ చేయటం చాలా తప్పు. కాబట్టే నా వాక్యాన్ని సోదాహరణంగా వివరిస్తాను. శ్రీమాన్ ఎస్.టి.జి. వరదాచార్యులు గారు దాశరథీ శతకాన్ని సంస్కృతంలో వ్రాయగా దానిని ఆలయ శిలాఫలకాన చెక్కించారు.

అందలి 96వ శ్లోకంలో తొలిపాదం "సీతారామ ! రమేశ ! రామ ! మహిత జ్ఞాన స్వరూప ప్రభో ! అని ఉంటే దానిని "సీతారామ ! రమేశ ! రామ ! చిన్మయహరే శ్రీరామ నారాయణ' అని మార్చి శ్రీ భద్రాద్రి రామ స్తోత్ర మంజరిలో ఇచ్చారు. ఈ పుస్తకానికి రూపకల్పన చేసి, ప్రూపులను దిద్దినవారుగా శ్రీమాన్ స్థలశాయి గారు, శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులగారు తెలియజేయబడినారు.

కాని స్థలశాయిగారు వ్రాసిన శ్రీరామ భద్ర స్తుతి కాని, మరెక్కడ కాని అందు 'రామనారాయణ' ప్రయోగం చేయలా – కాని దాని భద్రపీఠిక, శ్రీ చక్రపీఠిక రెండును వ్రాసిన ప్రధాన వ్యక్తిగా శ్రీ మురళీ కృష్ణమాచార్యులు గారే కనపడుతారు. వారే తమ భద్రపీఠికలో శ్రీరామ నారాయణునిగా ఇక్కడ వేంచేసి యున్నాడని వ్రాశారు. ముఖ్యంగా భద్రాద్రి 'శ్రీరామ నారాయణ స్తవమని రచించి అందు ప్రచురించారు. మళ్ళీ ఇటీవల భద్రాద్రి రామస్తోత్ర నిధి అని సంకలనం చేస్తూ దానిలోను దీనినందించారు. వారు రచించిన "జాయే భద్రాద్రి ...." శ్లోకం, రామనారాయణ స్తవము, అభిషేకాలలో తప్పనిసరిగా పఠింపచేయడం కూడా గమనార్హం. అంతేకాక స్తోత్రమంజరి యందలి క్షేత్ర మాహాత్మ్యంలో 'తస్య రామః స్వయం సాక్షాత్ తత్స్వరూపం దిశత్యజః' అన్నదాని తాత్పర్యంగా భద్రాచల క్షేత్ర సమీపంలో మృత్యువాత బడిన వారికి శ్రీరామనారాయణ ప్రభువు తన వలె దివ్యస్వరూపం ప్రసాదిస్తాడని అనువాదం జరిగింది. మూలంలో లేని రామనారాయణను కల్పించిన విధాన మెవరిదో. అనువాదకర్త అయిన పొడిచేటి రంగాచార్యులు గారిచ్చిన భావాన్ని మార్చి రామనారాయణ పదం ఇరికించడం సాహితీ ద్రోహం కాదా?

'భద్రాద్రి భక్తి సుధ' అని శ్రీ తూము వెంకట రామకృష్ణ గారు శ్రీ తూము నరసింహదాసుగారి వంశజులు సంకలనం చేశారు. అందు బ్రహ్మాది దేవతలు ఆ రాముని శ్రీరామ నారాయణునిగా ఉపాసించారని వ్రాశారు. అలాగే 103వ పుటలో ఆ మూర్తిని రామనారాయణ స్వరూపంగా బృహద్ బ్రహ్మ సంహిత వంటి ఆగమ గ్రంథాలు స్తుతించాయని వ్రాశారు. వారిని కలిసి అయ్యా ! మీరు బృహద్బ్రహ్మ సంహిత చూచారా ? అందు ఇలా లేదే అని అంటే ధర్మస్వరూపుడు రాముని విషయంలో అబద్ధమాడలేక నిజం చెప్పారు. శ్రీమురళీకృష్ణమాచార్యుల వారి ప్రేరణతో, ప్రియ మిత్రులు, వేదపండితులు అన్న విశ్వాసంతోవారి మాటపై వ్రాశానని చెప్పారు. అందుకు నా వద్ద ప్రమాణం కూడా ఉంచుకొన్నాను. ఎందుకంటే నాది అబద్ధమనవచ్చు కదా.

ఈ రామనారాయణ అనేది రామదాసు కాలం నుండీ వచ్చినదని, శ్రీరఘు నాథ భట్టరు వారి ఆదేశంలో నామ గోత్ర ప్రవరలు మార్చటం రామదాసు చేశాడని చెప్పిన సందర్భాలున్నాయి. అసలు రఘునాథ భట్టరు వారే కల్పిత వ్యక్తి అని గతంలో నిరూపించాము. ఆకాశపుష్ప మాలతో అలంకరించినట్లు ఇదంతా కల్పనే అనటం స్పష్టం. రామనారాయణ భావమే ఆయనకు ఉంటే దేవస్థానం పేరు రామచంద్ర స్వామి దేవస్థానమని ఎందుకుంటుంది? తూము నరసింహదాసుగారు ఎందుకు చెప్పరు? భద్రాద్రి అభివృద్ధి విషయంలో వారు మరో రామదాసు. ఆలయంలో దశవిధ ఉత్సవాలు ఏర్పాటు చేసినది వారే. ఆ ఉత్సవాలకు సంబంధించిన కీర్తనలు, చూర్ణికలు రచించారు. ఆ పది ఉత్సవముల లోనిదే కల్యాణోత్సవం. రామదాసు గారే రామనారాయణ అని ఉంటే తూము నరసింహదాసు గారు దశవిధ ఉత్సవాలలో గాని, కల్యాణోత్సవ కీర్తన, చూర్ణికలలోగాని, రామనారాయణ పదం ప్రయోగించే వారు కదా! ఆ పదం ఎక్కడా వాడలేదు. అంటే వీరు చెప్పేది పచ్చి అబద్ధమన్నమాట. ఇటీవలి కళ్యాణాలలో కూడా 'రామచంద్ర స్వామినే వరాయ' అనటం వీడియోలలో స్పష్టంగా రికార్డయి ఉంటే రామదాసు నాటి నుండీ అదే చెప్తున్నారనటం ఎంతటి అబద్ధం ! శ్రీ మురళీకృష్ణమాచార్యులుగారు వ్యాఖ్య చేస్తూ అచ్యుతాష్టక ! దాశరథీ శతక పద్యాలను అనుచిత విభాగం చేసి చెప్పటం పండితులుగా వారికి తగునా ? పొడిచేటి వారి భావాన్ని మార్చి వ్రాయటం తగునా ? వీరు వచ్చాక రామనారాయణ అన్న ప్రతిదాని వెనుకా వీరి పాత్ర స్పష్టం. శ్రీ తూము  రామకృష్ణగారికయితే 'రామనారాయణ' విషయం స్వదస్తూరితో వ్రాసి యిచ్చారు.

కంచర్ల పాండురంగ శర్మగారు ఒక పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో కూడా రామదాసు ఏనాడూ రామనారాయణ అనలేదని రామనారాయణ, అని అనటం, రాముని గోత్ర ప్రవరలు మార్చడం తప్పు అని గతంలో తన గ్రంథంలోనూ ఆ పదం వాడబడిందని, తరువాత స్వదస్తూరితో దానికి ఖండనను వ్రాసి యిచ్చానని చెప్పారు. ఆ ఇంటర్వ్యూలో అర్చకులే ఆళ్వారులను ప్రతిష్ఠించారని కూడా చెప్పారు. ఇలా రామనారాయణ వాదాన్ని నిలబెట్టుకోవడం కోసం చేసిన పనులు చాలా ఘోరంగా ఉన్నాయి. శ్రీమురళీ కృష్ణమాచార్యులు గారు రూపకల్పన చేసిన గ్రంథంలోనే దాశరథీ శతక పద్య సంఖ్య మార్చి రఘునాథ భట్టరుగారిని స్థిరం చేయటం కోసం తంటాలుపడటం చెప్పుకొని ఉన్నాము. ఇటీవల కళ్యాణపు వ్యాఖ్యానం వీడియోలు చూస్తే ఈ కువ్యాఖ్యానాలు చేస్తూ వీరు దర్శనమిస్తారు. భక్తి టి.వి. వారి చర్చా

కార్యక్రమంలో నేను మాట్లాడుతూ సంకల్పంలో రామనారాయణ అంటారు. మళ్ళీ కన్యాదానంలో రామచంద్రస్వామి అంటారు అన్నా. అంతే వెంటనే కన్యాదానంలో కూడా రామనారాయణ చెప్పేశారు. పంతానికి ఎంతకయినా దిగజారతారన్నమాట. గతరెండు సంవత్సరాల వీడియోలు చూస్తే ఈ రెండు విధానాలూ చెప్పటం కనపడుతుంది.

గతంలో చిత్ర కూటంలో కుడ్య చిత్రాలు భద్రాద్రి చరిత్రతో బహువర్ణ చిత్రాలలో ఉండేవి. ప్రస్తుతం చోటు మార్చారు. అందులో బొమ్మ క్రింద చరిత్రంగా రామనారాయణ పరంగా వ్రాయించారు. ఇది ఎవ్వరి చేష్టో ? ప్రభుత్వం అనుమతి లేకుండా తమ యిచ్ఛ వచ్చినట్లు నామ గోత్రప్రవరలు మార్చే అధికారం అర్చకులకుందా ? లేదు. అయినా లెక్క లేకుండా నామ గోత్రాలు మార్చి చెప్పుకు పోతున్నారు. దేవస్థాన ఉద్యోగుల సంక్షేమ సంఘం పేర ఒక కరపత్రం వేస్తూ 'శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానాన్ని మేము 'రామనారాయణ' దేవస్థానంగా మార్చాలనేది కాదు' అని వ్రాసుకున్నారు. అలా కుడ్య చిత్రాలు, శిలాస్తంభాక్షరాలు మార్చిన వారికి ఏ మార్పు మాత్రం ఒక లెక్కా ? దేవస్థానం పేరు మార్చటమనే విషయం వ్రాయటమే అనుమాన భయాలను కల్గిస్తోంది.

నిస్సందేహంగా శ్రీ మురళీకృష్ణమాచార్యులుగారు సామర్థ్యం కలవారు. ఆ సామర్థ్యం మంచికి వినియోగపడితే భద్రాద్రి వైభవం ఇనుమడించేది. కాని శివ ద్వేషాన్ని పూని రామ శబ్దంలోని మకారం శివపరమయినది కాబట్టి దానిని బలహీన పరచడం కోసం నారాయణ తగిలించి దానికి సంబంధించిన గోత్రప్రవరలను చెప్పటం సమర్థిస్తూ అందుకోసం చాలా తప్పులు చేస్తున్నారు. వారి సామర్థ్యంతో అర్చకులు, ప్రభుత్వాధికారులను కూడా అలాగే నడుపుతున్నారు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే

**"మద్భక్తో శంకరద్వేషీ – మద్వేషీ శంకర ప్రియః**
**తావుభౌ నరకం యాతః – యావచ్చంద్ర దివాకరౌ ॥**

అన్నాడు. నా భక్తుడై శివుని ద్వేషించేవాడు, శంకరుని భక్తుడై నన్ను ద్వేషించేవాడు ఇద్దరూ సూర్యచంద్రులున్నంతవరకూ నరకంలో ఉండేవారే అని దాని అర్థం. నిజానికి

ఆలయపు అర్చకులు, సిబ్బందిలో చాలామందికి అక్కడ జరుగుచున్న ద్రోహం రామద్రోహం తెలుసు. అందుకే 'రామచంద్రస్వామినే వరాయ' అని ఇటీవల కూడా చెప్పినవారున్నారు. ఒక ముఖ్య అర్చకుడు బయట వారితో 'రామ చంద్రస్వామినే వరాయ' అనటం తగినదిగా చెప్పి ఇక్కడ మాత్రం రామనారాయణ చెప్పటం జరిగింది. నా వద్ద ప్రమాణాలుండే వ్రాస్తున్నాను. తమ ఉద్యోగం తీయిస్తారనే భయంతో మిన్నకుంటున్న వారున్నారు. రహస్యంగా అలా అన్నవారు కూడా ఉన్నారు.

ఆధ్యాత్మిక పత్రిక ఎడిటోరియల్‌లో ఇక్కడ పులి తోకను ఆడించడం కాదు. తోక పులిని ఆడిస్తోంది అని వ్రాసినట్లు అధికారులతో సహా మురళీకృష్ణమాచార్యులు గారి మాటకు తల ఒగ్గవలసిందే. లేకుంటే వారు అవస్థలు పడవలసిందే. అధికారులేమిటి ? ఆరాధ్యులు సీతారాములే మిన్నకున్నారు. పాపం, వారిని కూర్చోబెట్టి మేము మీకు పెళ్ళిచేయము, వేరే వారికి చేస్తాము అని అలా చేసుకుపోతూంటే సీతారాములే ఏమీ చేయలేక ఉన్నారు. అదీ వారి సామర్థ్యం.

అందరిలా కాక ఒక్క ఇ.ఓ. మాత్రం శ్రీ ఎం. రఘునాథ్ అనే వారు సీతారాములకు జరిగే ఈ అన్యాయం చూడలేక ప్రతిఘటించారు. పూర్వ పద్ధతి ప్రకారమే సీతారామ కళ్యాణం వారి పేర్లు గోత్ర ప్రవరలు మార్చకుండా జరగాలన్నారు. దానినంగీకరించకపోవటంతో ఆ విషయంలో కీలకపాత్ర ఎవరిదో తెలుసు కాబట్టి శ్రీ మురళీకృష్ణమాచార్యులు గారికి మెమో ఇచ్చారు. ఆనాటి పత్రికలలో 'వేద పండితుడికి చార్జి మెమో' అని పడింది. దాని మీద చాలా రగడ జరిగింది. ధర్నా జరిగింది. ఈ.ఓ. గారు మురళీకృష్ణమాచార్యులు గారిని బదలీ చేయుటకు ప్రతిపాదిస్తూ కమీషనరు ఆఫీసుకు వ్రాశారు. అది జరిగితే ఆలయ సమస్యలన్నీ పరిష్కరింపబడి ఆలయం పునర్వైభవ స్థితికి చేరుకుంటుందని ఆశించారు. కాని వారికి మురళీకృష్ణమాచార్యులుగారి సామర్థ్యం తెలియదు. స్థానాచార్యులవారక్కడ ఉండటానికే కారణం వీరు. వైదిక కమిటీ, ఉద్యోగుల సంక్షేమ సంఘం కూడా వీరి కనుసన్నలలోనే నడుస్తాయి. నిజానికి కళ్యాణంలోని నామ గోత్రప్రవరలతో ఉద్యోగ సంఘానికి సంబంధం లేదు. అయినా ఆ సంఘం డిమాండ్స్‌లో మొదటిది 'రామనారాయణ' అనే పేరుపైన వివాదం చేసిన ఈ.ఓ. బహిరంగ క్షమాపణ చెప్పాలని. పిదప ఉద్యోగులకు ఇచ్చిన అక్రమ మెమోలను రద్దు చేయాలని, వైదిక కమిటీని

పునరుద్ధరించాలని, శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులు అధర్వణ వేద పండితులపైన కమీషనర్ ఆఫీసుకు పంపిన బదిలీ ప్రతిపాదనలు రద్దుపరచాలనీ, మతపరమైన విషయాలపైన అధిక జోక్యం తగ్గించుకోవాలని. ఇవన్నీ ఎవరిని కేంద్ర బిందువునుచేస్తున్నాయో అర్థమయి పోతుంది. మొత్తానికి ఫలితాంశమేమంటే మురళీకృష్ణమాచార్యులు గారు బదిలీ కావటం కాదు. ఈ.ఓ. రఘునాథ్‌గారే బదిలీ అయ్యారు.

అంతటితో ఈ.ఓ.ను వదల లేదు. నరసాపురంలోని తమ వారిచే 'రామనారాయణ' అనే విషయంలోనే కోర్టులో వేయించి ఆ ఈ.ఓ. గారికి, రామనారాయణ అనటం తప్పు అన్న విశాఖపట్నం చిన ముషిడివాడ పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ స్వామి వారికి కూడా నోటీసులు ఇప్పించారు. వారు కూడా మురళీకృష్ణమాచార్యులుగారి రామాపచారాన్ని అడ్డుకోలేక పోయారు. ఆ సమయంలోనే తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ అడిషనల్ కమీషన్ (ఇన్‌చార్జి) శ్రీమతి జ్యోతిగారొక ప్రకటన చేస్తూ స్వామి పేరు పై తలెత్తిన వివాదాన్ని నిగ్గు తేల్చేందుకు ఉన్నతస్థాయి కమిటీని వివిధాగమ పండితులు, వివిధ సంప్రదాయ మిత్రులతో నియమిస్తున్నామని, వారు అన్ని కోణాలలో అధ్యయనం చేస్తారని, సరిదిద్దటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా అన్ని వర్గాలతో చర్చించి పరిష్కరిస్తారని ఇలా ఎంతగానో చెప్పారు. అనంతరం ఆమెనే ఈ దేవాలయానికి ఈ.ఓ.గా నియమించారు. అంతే ఇక్కడకు రాగానే ఆమెకు శ్రీరామనారాయణ సీతామహా లక్ష్మీకటాక్షం జరిగినట్లుంది. ఇంక ఆ ఊసెత్తకుండా ఇక్కడి అర్చకాది బృందంతో అవగాహనతో ఉండిపోయారు. (విషయమంతా 71వ పేజీలో వారి ద్వారానే గ్రహించవచ్చు.)

అలాగే భద్రాద్రి క్షేత్ర మహాత్మ్య గ్రంథకర్త శ్రీమాన్ పొడిచేటి రంగాచార్యులు గారిని శ్రీమాన్ మురళీకృష్ణమాచార్యులు గారు మెంటల్ వారని, అవమానించిన దానిని గూర్చి వారిని వివరణ కోరగా ఇలాగే అర్చకేతర బృందం అందరి సంతకాలతో సమాధానం పంపారు. రంగాచార్యులు గారంటే ఎవరో తెలియని వారు కూడా సంతకం చేసేశారంటే అలా ఆలయంలో మురళీకృష్ణమాచార్యులు గారు చక్రం తిప్పుతున్నారన్నమాట. అదీ మురళీకృష్ణమాచార్యులుగారి సామర్థ్యం. ఇలా వచ్చిన

ఈ.ఓ.లు అంతా పై పండితులు చెప్పినదే వేదంగా ఉండిపోయారు. వారికి అర్థమయిపోయింది. ఇక్కడ న్యాయం, ధర్మం, రామం అంటే నెగ్గలేమని దక్షత చూపో, దాక్షిణ్యం చూపో అందరినీ తలొగ్గచేసుకొనే పండితులు వారు. ఈ విషయాలు చర్చిస్తూ మా స్నేహితునితో అన్నా. 'వేదపండితులు ఇంత రామ ద్రోహం చేస్తారా?' అని. ఎందుకంటే నాకు వేదపండితులన్న అపారమయిన భక్తి. ప్రతి యేడూ మా అన్నదానం వారి వేదసభ నిర్వహిస్తాను. అందువల్ల వేద పండితులు వేదవేద్యుడయిన రామునకు ద్రోహం చేయరని అభిప్రాయపడితే మా స్నేహితులు వెంటనే "అయ్యా ! రావణుని కన్న గొప్ప వేదపండితుడెవడున్నాడు ? జట, ఘనలనే కనిపెట్టి వేదాన్ని నిల్పిన ఘనుడు. ఆతడు రామద్రోహం చేయలేదా ? ఫలితం అనుభవింపలేదా ? ఎవడి కర్మ కాలితే వాడికి పెడ బుద్ధి పుడుతుంది. ఫలితమను భవిస్తాడు. చదువుకి తగ్గ సంస్కారం అందరియందూ చూడలేము" అన్నాడు. ఏమైనా చిరంజీవి అయిన హనుమంతుడు రామకార్య ధురంధరుడు సీతారామ కళ్యాణాన్ని సక్రమంగా జరిగేటట్లు చూడగలడనే నా విశ్వాసం, అందుకు ఆ స్వామికి విన్నపం.

పూర్వము ఆదిశంకరాచార్యుల వారి శ్రీరామ కర్ణామృతంలోని "వామాంకస్థిత జానకీ పరిలసత్' అనే శ్లోకం తొలుత ప్రాధాన్యత పొందే ఉండేది. కొందరు శంకరాచార్యుల వారు రామదాసు తరువాత వాడా ? అని ప్రశ్నిస్తున్నారు. భద్రుని కోరిక మేరకు స్వయంభూ మూర్తులుగా వెలిసిన ఈ విగ్రహాలు ద్వాపరయుగం నుండి ఉన్నాయి. ఆలయాలు నిర్మింపబడుతూ పూజింపబడుతూ కాలగర్భంలో భూగర్భంలో కలుస్తూ ఉన్నాయి. ఆదిశంకరులు వారి కాలంలో దర్శించారు. మరల భూగతమయి దమ్మక్క రామదాసుల ద్వారా వెలుగు చూడగా ఈనాడు మనమూ చూస్తున్నాము. భద్రుని కాలానా, ఆదిశంకరుల కాలానా, మన కాలాన కూడా ఉన్న మూర్తులవియే. అంత ప్రసిద్ధ శ్లోకాన్ని ఒక అద్వైతి శ్లోకం ముందు పెట్టడమేమిటని దురాలోచన వచ్చి ఆదిశంకరాచార్యుల వారి శ్లోక స్థానంలో మురళీకృష్ణమాచార్యులు గారు వ్రాసిన శ్రావ్యే భద్రాద్రివాసం అనే శ్లోకానికి ప్రాధాన్యత పెంచబడుతోంది. ఆనాదిగా ఆ శ్లోకానికున్న ప్రాధాన్యం 1956లో శ్రీభద్రాచల క్షేత్ర చరిత్ర 8వ పేజీలో చెప్పబడినది. "ఈ శ్లోకమే నిత్యమిచ్చట ననుసంధింపబడుచున్నది. అని కొండపల్లి రామచంద్రరావు గారు స్పష్టంగా వ్రాశారు.

ఆదిశంకరాచార్యుల వారి శ్లోకం స్థానంలో మురళీకృష్ణమాచార్యులు గారి ధ్యాయే భద్రాద్రివాసం శ్లోకం చదివించటం అభిషేక సమయంలో అనాదిగా చదివే రామోపనిషత్తు, ద్వయోపనిషత్తు తీసివేసి మురళీకృష్ణమాచార్యులు గారు వ్రాసిన రామనారాయణ స్తవం చదివించటం జరుగుతోంది.

ఆదిశంకరుల శ్లోకం స్థానంలో తన శ్లోకం, ఉపనిషత్తులు ప్రక్కన పెట్టి తన రచనలు ఆలయంలో చదివిస్తున్నారు అంటే ఈ ఆలయాన్ని మురళీ కృష్ణమాచార్యులు గారు ఏ స్థాయికి దిగజారుస్తున్నారో అర్థమవుతుంది. వారి తండ్రిగారు స్వయంగా స్థానాచార్యులయి వ్యవస్థ మారిస్తే శ్రీ మురళి కృష్ణమాచార్యులు గారు స్థానాచార్యులుగా తన జేబులో మనిషిని పెట్టి ఆట ఆడిస్తున్నారు. పూర్తి అర్హత లేని దశలో తిమ్మిని బమ్మిని చేసి స్థానాచార్యుల వారిని నియమింప జేసింది వీరే. ఆ అపాయింట్మెంటు ఫైలు బయటకు తీస్తే వీరి బండారం బయట పడుతుంది.

మొత్తం వినాశానికి హేతువు మురళీకృష్ణమాచార్యులు గారు వారి తండ్రిగారు అని అర్థమౌతుంది. వారిపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకొనాలి. లేకున్న ఇటువంటి అనర్థాలు పెరిగిపోతాయి.

# సాధు సంతుల అభిప్రాయాలు

## పూజ్యశ్రీ కమలానందభారతీస్వామివారు
## ఉత్తరపీఠాధిపతి, భువనేశ్వరీపీఠ, గన్నవరం

జై శ్రీరామ్ ! కంచర్ల గోపన్నగారు భద్రాచలంలో భద్రాద్రిపై భద్రగిరి శ్రీ సీతారామచంద్రుని మందిరాన్ని నిర్మాణచేశారు. మన దేశంలో భక్తి కలిగి ఉండడం, భగవంతుడు భక్తులకు కటాక్షమివ్వడం, భక్తులకే భగవంతుడు దాసుడవడం మన పురాణాల్లో, అన్ని యుగాల్లో చూస్తున్నాం. భక్తితో భగవంతుడిని కొలవడంతోపాటు, ఆర్తితో భగవంతుడిని వేడుకున్నప్పుడు, ధర్మానికి గ్లాని కలిగినప్పుడు ఏదో ఒక అవతార రూపంలో వచ్చి భగవంతుడు ధర్మాన్ని కాపాడడాన్ని కూడా చూస్తున్నాం.

మన భద్రాచలంలో ఉన్న సీతారామచంద్రస్వామి వారి దేవాలయం చారిత్రాత్మకమైనది, భక్తితో కూడుకున్నది. అంతేకాక, ఒక భక్తి, మతం, సంస్కృతి, భగవంతుడి యొక్క ఉనికిని ప్రకటించే సన్నివేశం. వీటికి ఉదాహరణగా నిలుస్తుంది ఈ దేవాలయం.

ఈ దేశంలో హిందూజాతిని నాశనం చేయాలని, హిందూ మతాన్ని కూకటివేళ్లతో పెకలించాలని, ముస్లిం పాలకులు తాము పరిపాలన చేస్తున్న కాలంలో ప్రయత్నించారు. ఆ సమయంలో ఈ మతాన్ని, ఈ ధర్మాన్ని, ఈ సంస్కృతిని ఇక్కడ భక్తిని, భగవత్ తత్త్వాన్ని కాపాడడానికి సాక్షాత్తూ భగవంతుడు శ్రీరామచంద్రుడు కంచర్ల గోపన్నను ఒక ఉపకరణంగా ఉపయోగించాడు. ఆయనను ఎంచుకుని, ఆయన ద్వారా ఉనికిని చాటుకున్న ఒక అవతార విశేషం భద్రాద్రి దేవాలయం.

శ్రీరాముడు త్రేతాయుగంలో ఒక అవతారం. కానీ, భగవానుడు అయోధ్యలో త్రేతాయుగంలో అవతరించినది ఎంత సత్యమో, అలాగే అప్పుడప్పుడు ఎక్కడెక్కడ ఆయన అవసరమవుతుంటాడో అక్కడక్కడ శ్రీకృష్ణుడుగా, శ్రీరాముడుగా, ఇంకొక రూపంలో, కూడా మరల మరల ప్రకటితమవుతూ ఉంటాడన్నది కూడా సత్యం. ఇప్పుడు మనకు కలియుగంలో తన ఉనికిని ప్రకటింప జేసుకోవడం కోసం, ఇక్కడ ధర్మాన్ని నిలబెట్టుకోవడం కోసం కంచర్ల గోపన్నను భక్తరామదాసుగా చేసుకుని, ఆయనతో దేవాలయం కట్టించుకుని, ఆయనతో కీర్తనలు పాడించుకున్నాడు. రామదాసు విధర్మీయుల చేత బంధింపబడగా, ఆ బంధించడమనేదాన్ని కారణంగా, నెపంగా పెట్టుకుని, ఇక్కడి మతాన్ని కూకటివేళ్లతో

పెకలించాలని ఎవరు ప్రయత్నిస్తున్నారో, సాక్షాతూ ఆ ముస్లిం మత పాలకుడైనటువంటి తానీషాకు కూడా తన అవతార విశేషాన్ని ప్రకటించిన వాడు రామచంద్రుడు. తానీషాకు కనువిప్పు కలిగించి, శ్రీరాముడు సత్యము, రాముడి లీల సత్యము, రాముడి ఉనికి సత్యము అని ప్రపంచానికి చాటగా, ఈ చరిత్రకు తార్కాణంగా, రుజువుగా ఉన్నది భద్రాద్రిలోని శ్రీ సీతారామస్వామి దేవాలయం. అటువంటి సీతారామచంద్రస్వామి ఆలయలో ఆ రాముడి పేరుని చెప్పవలసింది పోయి, పూజలలో, పునస్కారాలలో భగవంతుడి పేరుని చెప్పాల్సి వచ్చినప్పుడు శ్రీ సీతారామచంద్రస్వామి అని చెప్పవలసింది పోయి, రామనారాయణ స్వామి అని చెప్పడం అవసరమా?

దేవాలయం ఎవరో కట్టిస్తారు. దేవుడు ఎందుకో అవతరిస్తాడు. ఎవరెవరినో ఆయన ప్రభావితం చేస్తాడు.ఎవరెవరికో కనువిప్పు కలగజేస్తాడు. ఎవరెవరికో ముక్తినిస్తాడు.

అటువంటి భక్తితత్త్వాన్ని, ఆధ్యాత్మిక తత్త్వాన్ని అర్థం చేసుకోకుండా ఈ విధంగా పేర్లు మార్చుకోవడం, నామాలు మార్చుకోవడం, సొంత పాండిత్యాన్ని ప్రర్శించుకోవడము కోసమో లేదా మేము ఇక్కడ ఏదో చేశామని చెప్పుకోవడం కోసమో అవుతుంది. అనాదిగా అక్కడ వస్తున్న సాంప్రదాయాన్ని కాలదన్ని, నేలరాసి, కొత్త సాంప్రదాయాన్ని మొదలు పెట్టడం తగదు.

ఆ ప్రాంతమంతా గిరిజనులు ఉండే ప్రాంతం దండకారణ్యం. తన అవతారంలో దండకారణ్యంతోటి, సీతమ్మ వారితోటి ఎంతో అనుబంధం ఉన్న ప్రాంతం. అందుకనే అక్కడ కొలువై ఉండాలని తనకొక దేవాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాడు శ్రీరామచంద్రుడు.

నేరుగా అవతార విశేషం తోటి సంబంధం ఉన్నటువంటి ఒక క్షేత్రంలో కేవలం మానవామాత్రులైనవారు అక్కడ ఉన్నప్రాచీన సంప్రదాయాలను కాలరాచి, కొత్త కొత్త విషయాలు ప్రవేశపెట్టడం తగదు. మొదటి నుంచి ఏ సంప్రదాయం అక్కడ పాటించబడుతున్నదో ఏ పేరునైతే చెబుతూ ఉన్నారో, అలా శ్రీ సీతారామచంద్రస్వామి అనే పేరుతోనే అక్కడ కార్యక్రమాలన్నీ నిర్వర్తించబడాలని మేం అభిప్రాయపడుతున్నాం. ఏ దేవాలయంలో కూడా అలాగే ఉండాలి. ఈ రోజు, రేపు ఆగమశాస్త్రం పట్ల గానీ, ఆచార సంప్రదాయాల పట్ల గానీ, నిష్ఠ, శ్రద్ధ తగ్గుతున్నాయి. వ్యక్తిగతమైన ఆకాంక్షలు పెరుగుతున్నాయి. వ్యక్తిగతమైన పేరు ప్రతిష్ఠల కోసం వెంపర్లాట, కీర్తికాంక్ష పెరుగుతున్నాయ్. ఈ ఒరవడిలో, ప్రవాహంలో కొట్టుకుపోతూ అయినవీ, కానివీ మార్పులూ చేర్పులూ చేసుకుంటూ ఇదంతా కూడా తమ ఘనకార్యం అనో, లేకపోతే ఇదే శాస్త్రం అనో చెప్పే ప్రయత్నం జరుగుతోంది. అలా ఏం చేయాల్సిన అవసరం

లేదు. అదే విధంగా పట్టుదలకు పోవలసిన అవసరం కూడా లేదు. అందువల్ల భద్రాచలంలో భద్రాద్రీశుడు, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పేరును అలాగే పేర్కొంటూ, అలాగే వారిని పిలుచుకుంటూ, కొలుచుకుంటూ, తలచుకుంటూ ఈ హైందవజాతి పునీతం కావాలని పిలుపునిస్తున్నాం.

ఆ శ్రీరామచంద్రుడు అందరి మనసులలో, హృదయాలలో ప్రవేశించి, అందరి మనసులనూ చక్కదిద్ది, తను స్థిరమై ఆ విధంగా అందరినీ ముందుకు నడిపిస్తాడని విశ్వాసాన్ని ప్రకటిస్తున్నాం.

**శ్రీ కమలానందభారతి**

## **స్వామి పరిపూర్ణానానంద**, శ్రీపీఠం

శ్రీ సీతారామచంద్రస్వామికి నిలయమైన భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా అందరం భావిస్తాము. భద్రాద్రి – శ్రీ సీతారాముల కళ్యాణానికి చాలా ప్రసిద్ధి. కళ్యాణాన్ని ఒకప్పుడు రేడియో ద్వారా ఎంతో ఆసక్తిగా వినేవారు. ఇప్పుడు టి.వి. ద్వారా చూసే అవకాశం లభించడంతో ఎంతో భక్తితో, తృప్తితో కళ్యాణాన్ని చూస్తున్నారు. అయితే... ఈ మధ్య సీతారామకళ్యాణం బదులుగా, నామాంతరం చేసి, రామనారాయణ పేరుతో నిర్వహించటం నన్ను ఆశ్చర్యపరచింది. ధర్మక్షేత్రంగా భావించే భద్రాద్రిలో ఈ విధానం ఎందుకు జరిగిందో, ఎవరి ప్రోద్భలంతో జరిగిందో ఇప్పటికీ అంతుచిక్కని అంశం. ఏమయినా ఈ విషయాన్ని ఎవ్వరూ ఉపేక్షించకూడదు. ప్రత్యేకించి అధికారులు కాలయాపన చేయవద్దు. వెంటనే ఉభయపక్షాలవారిని కూర్చుండబెట్టి, యథార్థాన్ని నిగ్గుతేల్చి పరిస్థితులను చక్కదిద్దడం అవసరం. లేకుంటే ఈ విషయాలు వివాదాలయి, రోడ్డుకెక్కి ఇతర మతాలవారు మన ధర్మంపై విమర్శ చేయడానికి అవకాశమిస్తాయి. ధర్మస్వరూపుడైన రామునికి అపకారం జరగడమంటే ధర్మానికి అపకారం జరిగినట్లే. అలా జరగకుండా ఉండాలంటే ధర్మాచార్యులు, శాస్త్ర పండితులు న్యాయనిపుణులతో అతి త్వరలో సమావేశం ఏర్పాటు చేసి, రాగద్వేషాలకు అతీతంగా ఈ వివాదానికి ముగింపు పలకాలని ధర్మమూర్తి అయిన శ్రీరామచంద్రుడిని వేడుతున్నాను.

## శ్రీ నిర్వికల్పానందాగిరిస్వామి

శేషాచల ఆశ్రమం, గుంటూరు -1, సెల్ : 8500462013

కల్యాణం అనగానే ప్రవర ఉండాలి. ప్రవరలు తాతముత్తాతలు తండ్రుల పేర్లతో గోత్రనామాలు చదవాలి. శాస్త్రయుక్తంగా జరగవలసిన సీతారామ కళ్యాణాన్ని వారి ప్రవరలు చెప్పకుండగా మారుపేర్లతో రామనారాయణ కళ్యాణం చేయటం ప్రవరలు లక్ష్మీనారాయణులవి చెప్పటం జరుగుతోంది. ప్రజలను మభ్యపెట్టి వైదిక ప్రమాణమయినటువంటి శాస్త్రాన్ని, సనాతన ధర్మాన్ని అపవిత్రం చేస్తూ మిడి మిడి జ్ఞానంతో విషయ అవగాహన లేని వారి నుండి సీతారామ కల్యాణం పేరుతోటి డబ్బు కట్టించుకొంటూ రసీదు లిస్తూ ప్రభుత్వాన్ని, ప్రజలను కూడా మోసంచేస్తూ దేవాలయ ప్రతిష్ఠను రామదాసుగారు ప్రత్యక్షంగా చేసినటువంటి అతిపురాతన మయినటువంటి దానిని వసిష్ఠ, గౌతమ అనే సీతారాముల గోత్రాలతో చేయవలసిన దానిని ఏ స్వలాభంతో అర్చకస్వాములు ఇలా చేస్తున్నారు? ఈ పై విషయాలను తెలంగాణా ముఖ్యమంత్రి గారయిన శ్రీ చంద్రశేఖరరావుగారు, ప్రధాన సలహాదారయిన శ్రీ రమణాచార్యులు గారు దేవాదాయ ధర్మాదాయశాఖ కమీషనరుగా ఉన్నవారు ఇలా జరుగుతుంటే ఎందుకు ఊరుకున్నారో అర్థం కాదు. వెంటనే ప్రత్యేక అధికారి ద్వారా పై విషయములన్నింటిపై విచారణ చేయించి తగు చర్యలు తీసుకోవలసినదిగా కోరుతున్నాము. లేకున్న పబ్లిక్ గ్రీవెన్స్ క్రింద కోర్టులో దావా వేయటం జరుగుతుంది. హిందూ ధర్మానికి ఇటువంటి అర్చకుల ద్వారా ఆర్థిక స్వలాభం చూసుకొంటూ అపకారం చేస్తున్నట్లు అర్థమవుతోంది. ఎవరి యిష్టం వచ్చినట్లు వారు చేస్తూ ఉండటం వల్లే హిందూ ధర్మం సంక్షోభంలో పడుతున్నది. వేదమే ధర్మం, ధర్మమే వేదం. ప్రపంచం మొత్తానికీ వేదము నుండి వచ్చిన ఉపనిషత్తులు, 18 పురాణములు, 18 ఉపపురాణములు, రామాయణము, భారతము, భాగవతము, శాస్త్ర సమ్మతమయిన సనాతన ధర్మాన్ని ప్రామాణికముగా తీసుకొని చేయవలసినదిగా కోరుచున్నాము. కలియుగ వైకుంఠ దైవమయిన ఏడుకొండలవాని అనుగ్రహంతో దీని పరిశీలన జరగవలెనని కోరుతున్నాము.

## పరమహంస పరివ్రాజక విజ్ఞానానందభారతి

కొండాపూరు, హైదరాబాదు – 500084 సెల్ : 94412 85727

భద్రాచలంలో జరుగుతున్న విషయములలో ఒక సన్యాసిగా, ఒక పరం పరాగత భక్తునిగా ఒక పామరునిగా నా –ఆలోచన. మా పూర్వాశ్రమ కుటుంబం వారు రాముని ఛత్రచ్ఛాయలలో నూట యాభై (150) సంవత్సరాలుగా జీవించినవారు. మా ముత్తాత శ్రీ అనంతరామయ్యగారు ఒక ప్రభవకు, దాని తదుపరి ప్రభవకు (షుమారు తొంభయి (90) సంవత్సరాల క్రితం, మా తాత గారు పర్చా రామనాథంగారు మహా సామ్రాజ్య పట్టాభిషేకం చేసి రాముని కృపకు పాత్రులైరి. పర్చా రామనాథంగారు పట్టాభిషేకము లగాయతు నూట ఎనిమిది (108) రోజులు దోసకాయ యజ్ఞము చేసిరి. పర్చా రామనాథంగారు ఆజీవన పర్యంతం శ్రీ రామనవమికి అటు మూడు రోజులు, ఇటు మూడు రోజులు రైలు ఆపి గేటు కారేపల్లిలో అందరికి భోజనాలు పెట్టేవారు. శ్రీ రామనవమికి నదిలో నీరు కావిళ్ళతో మోసి భోజనాలు పెట్టేవారు. ఆయన నిరతాన్న దాత. బ్రతికినన్ని రోజులు వారి ఇంటిలో గాడిపొయ్యి ఆరలేదు. వందల మంది శిష్యులకు తారక మంత్రము ఉపదేశము చేసిన గురువు గారు వారు. మా తండ్రిగారు మైథిలి అనే పేరుతో రామాయణం వ్రాశారు. దశాబ్దాలుగా రాముని సేవ చేసిన బ్రహ్మశ్రీ కొండపల్లి రామచంద్ర రావు గారు మాతల్లికి వరుసకు పినతండ్రి. 150 ఏళ్ళు రాముని సేవ చేసి తరించిన కుటుంబం మాది. బహుశా వారు చేసిన రామ సేవకు సంతసించి ఈ ఉపాధికి తురీయమైన సన్యాసాశ్రమం భద్రాద్రి రాముడు అనుగ్రహించెను. తద్వారా ఈ ఉపాధి తనవైపు పెద్దలు తరించుటకు ఒక సాధన మాయెను. నేను మాకుటుంబ సభ్యులు శ్రీ రామనవమిని ఎన్నో సార్లు కన్నులారా చూచితిమి. బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి గారు, బ్రహ్మశ్రీ మల్లాప్రగడ శ్రీ రంగారావు గారి వంటి ఎందరో మహనీయుల కంఠముల నుండి జాలువారు మంజుల గోదావరి సమానమైన ప్రవచనములను ఎన్నో సార్లు చెవులార వింటిమి. “శ్రీ రామ చంద్ర వరాయ” అని రాముని గోత్రనామాలు, దశరధ సహిత రాముని తాత తండ్రుల నామధేయాలు, సీతమ్మ తల్లి తండ్రి గోత్ర నామాలు, వారి తాత ముత్తాతల నామాలు విని ముచ్చట పడి తరించితిమి. మా రాముడు నాడు అనాథ కాదు, నేడు అనాధ కాడు, ఎవరివో అరువు తెచ్చిన గొత్రనామాలు శ్రీ రామచంద్ర చక్రవర్తికి చెప్పుటకు. మా భద్రాద్రి రాముడు భద్రుని రాముడు, పోకల దమ్మక్క రాముడు, కంచర్ల గోపన్న రాముడు, వందల

సంవత్సరాలుగా కోట్ల కొద్ది భక్తుల మనస్సామ్రాజ్యాలు ఏలిన జగదభి రాముడు. దయచేసి మారాముడిని అనాథను చేయకండి. రామావతార వైశిష్ట్యము దానికి కలదు. దిక్కులేని వానికి చెప్పినటులు లక్ష్మీ నారాయణుల గోత్రనామాలు పెట్టవద్దు. నారాయణుడు కానిది ఈ జగత్తులో ఏది లేదు, అయినను ప్రతి పురాణ పాత్రకు దాని ప్రాధాన్యము దాని కలదు. రాముడు లేనిచో రామాయణము లేదు, భారత దేశములేదు, మన సంస్కృతిలేదు, మన మనుగడకు అర్థములేదు.

**శ్రీ సచ్చిదానందసరస్వతీ,** తుని, తపోవనం

భద్రాచల క్షేత్రమున వెలసి ఉన్న శ్రీ సీతారామచంద్రమూర్తి దేవస్థానము నందు అనూచానముగా ఆచరింపబడుచున్న సంప్రదాయమును దృష్టిలో పెట్టుకుని నిత్యారాధన మొదలు విశేష కళ్యాణోత్సవం వరకూ ప్రతీ అంశమున పారంపర్యంగా నడుచుచున్న రీతిలోనే అనగా కళ్యాణోత్సవం నందు శ్రీరామచంద్రస్వామినే వరాయ అనే పదమునే ప్రయోగించవలె తప్ప మరో ఏ విధమున సంబోధించరాదని సీతారామచంద్రస్వామి బదులుగా మరే విధముగా సంబంధించిననూ అనూచానముగా పాటిస్తున్న సంప్రదాయము, ఆస్తికుల భక్తి విశ్వాసం భంగపరచడమైనట్లుగా మా అభిప్రాయమును తెలియపరుస్తున్నాము.

**శ్రీ స్వామి సూర్యానంద,**

శ్రీ సత్యసాయిసేవాసమతి, పిఠాపురం, ఆంధ్రప్రదేశ్

ప్రపంచంలోనే భారతీయ సంస్కృతి చాలా గొప్పది. ఇతరదేశ పండితుడైన శ్రీ మాక్సుముల్లర్ మహాశయుడు కూడా భారతీయ సంస్కృతిని విశేషంగా కొనియాడిన సంగతి అందరికీ విదితమే. ప్రపంచ విఖ్యాత ఖ్యాతి గడించిన శ్రీ స్వామి వివేకానందజీ వారు కూడా హిందువునని చెప్పుకొనుటకు గర్వించమని, హిందువుగా జన్మించినందుకు గర్వించమని చెప్పారు. సనాతన ధర్మంగా భద్రాచలంలో కొలువైయున్న శ్రీ సీతారామచంద్రస్వామివారిని దర్శించుకొన్న అనుభూతి పొందిన మహాత్ములందరూ కళ్యాణ సందర్భంలో 'శ్రీరామచంద్రస్వామినే వరాయ' అని పిలుస్తున్నట్లు వినికిడి. వేరే విధంగా పిలుచుట దైవాపరాధంగా వస్తుందని తెలుపుచుంటిమి. దీని నిమిత్తమై ఆధ్యాత్మిక, దైవనిష్ఠులైన గౌరవనీయులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు (తెలంగాణ సి.యమ్) తగిన చర్య తీసుకోవాలని కోరుచుంటిమి.

## హరిహరాశ్రమము

రామదాసు, కొలంక, పిఠాపురం, తూర్పుగోదావరి జిల్లా

**తస్మాత్ శాస్త్రం ప్రమాణంతే కార్యాకార్య వ్యవస్థితౌ**

**జ్ఞాత్వా శాస్త్ర విధానోక్తం కర్మ కర్తుమిహార్హసి.**

**యః శాస్త్ర విధి ముత్సృజ్య వర్తతే కామకారతః**

**న స సిద్ధి మవాప్నోతి న సుఖం న పరాంగతిం ॥గీత॥**

శాస్త్రవిధిని వదిలి ప్రవర్తించువారికి ఇక్కడ సుఖం కాని పరమున ముక్తి కాని వేరు. అని గీతాకారుడు హెచ్చరించుచున్నాడు. ఆశ్వాసనావయోః ప్రీతిః శాస్త్ర విశ్వాసిని త్వయి శాస్త్రమునందు విశ్వాసమున్న నీయందు మాకు ప్రీతి కలదు అని పరాంబిక హయగ్రీవునితో సెలవిచ్చి యున్నది. అన్నదానం చిదంబర శాస్త్రిగారి అభిప్రాయము శాస్త్ర సమ్మతముగా ఉన్నది. అందుచేత వారు చెప్పినట్లు భద్రాచలంలో కల్యాణం నిర్వర్తించటం సమంజసము.

**మాతా అనంతానందగిరి,** సెల్ : 8247474255

భద్రాద్రి శ్రీ సీతారామకళ్యాణం సమయాన శ్రీరామచంద్రమూర్తి అనే వరునికి అని బదులుగా శ్రీరామనారాయణునికి అని ఉచ్చరించటం ఖచ్చితంగా హిందువుల మనోభావాలను చిన్న బుచ్చుటమే! పోనీ అలాంటప్పుడు శ్రీ సీతాదేవి అనే వధువుని బదులుగా శ్రీ సీతామహాలక్ష్మి అని చెబుతున్నారు. శ్రీరాముడు ఏకపత్నీవ్రతుడు. మరి నారాయణ శబ్దమెందుకు? (కంచెర్ల గోపన్న) శ్రీరామదాసుల కాలం నాడు ఇలా పలుకబడిందా? మరి ఇప్పుడెందుకు అలా ? హెచ్చరించినా, ఉద్యమించినా పలుకు మార్చడం లేదంటే కావాలనే దైవద్రోహానికీ, ధర్మద్రోహానికీ పాల్పడుకున్నారన్నమాట! అందుకా ప్రభుత్వ లాంఛనాలతో తానీషా కాలం నాటి తలంబ్రాలు సమర్పించడమనే సాంప్రదాయ సాక్షిగానీ అంటే ప్రభుత్వ మద్దతుగానే ఇది నడుస్తుందన్నమాట! ఎందుకంటే ఇది హిందూ ద్వేషుల పన్నుగడ! ఒకటి ఎదుర్కొని సవరించినా మరొకటి వరుసలో ఉంటుంది. ఈ కాపీపేస్టుల విదేశీ రాజ్యాంగాన్ని ఎత్తి చెత్తకుప్పలో వేసి స్వదేశీ హిందూ సనాతన ధర్మయుక్తతలో కూడిన రాజ్యాంగంలో సహా అఖండ హిందూ సామ్రాజ్య స్థాపనే దీనికి ఏకైక పరిష్కారం.

**స్వామి విరజానంద, శ్రీ అచలానంద ఆశ్రమము ఛారిటబుల్ ట్రస్ట్,**

శివాజినగర్, 2వ లైను, మంగమూర్ రోడ్డు,ఒంగోలు-523 002

అడవి అంతరించిపోవడానికి గొడ్డలిలో వున్న పదునైన ఇనుపముక్క కారణం అని అనుకుంటాంగాని, ఆ ఇనుపముక్కకు ఆధారమైన కట్టెది ప్రధాన భూమిక అని అంత త్వరగా గుర్తించలేము. ఈరోజు ఈ సనాతన ధర్మానికి గ్లాని ఏర్పడడానికి ఆ కట్టెముక్కలాంటి వ్యక్తులు, వ్యవస్థలు కారణమని అంగీకరించక తప్పదు. వారంతా మనవారేననే సత్యం బాధింపక మానదు. వ్యక్తిగత ప్రాపకంకోసం, శాఖాపరమైన ఆధిపత్యం కోసం భద్రగిరి శ్రీ సీతారామచంద్రులను బలిచేయటం భక్తులందరికీ బాధాకరమైన విషయం. పాలకుల ప్రాపు, అధికారుల అండ చూసుకొని, తాము వున్న ఉన్నత స్థానానికి మచ్చతెచ్చే విధంగా మూలాలను మార్చి, సదాచారానికి తూట్లు పొడవటం సమర్థనీయమైన విషయం కాదు.

ధర్మస్వరూపునిగా రాక్షసుల చేతనే కీర్తించబడిన రాముని విషయంలో రామభక్తులమని చెప్పుకుంటూ ఆ రామచంద్రస్వామికే అన్యాయం చేయడం. స్వామిద్రోహమే కాదు, ధర్మద్రోహం కూడా. భద్రాచలంలో శ్రీ సీతారామకల్యాణంలో ప్రవర మార్చి, అనూచానంగా వస్తున్న ఆచారాన్ని ఏమార్చటం హైందవ ధర్మానికి మంచిది కాదు. సమాజానికి క్షేమదాయకం కాదు.

ధర్మము పాపముచేత, సత్యము బొంకుచేత గట్టెక్కలేని స్థితిలో సమర్థులైనవారు ఉపేక్షచేస్తే అది వారికి చేటవుతుంది....... అన్న జగద్గురుని మాటను మదిలో పెట్టుకొని భద్రాద్రి శ్రీ సీతారామచంద్రుల కల్యాణంలో జరుగుతున్న పాపాన్ని నివారించడానికి, ఆ పాపానికి అడ్డుగా పెట్టుకొన్న బొంకును ఎండగట్టటానికి నడుం బిగించిన హనుమదుపాసకులు, నిష్కలంక రామభక్తులు అయిన బ్ర.శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రిగారు దాశరథి, కరుణాపయోనిధి అయిన భద్రగిరి శ్రీరామచంద్రుని కృపాకటాక్షవీక్షణాలతో విజయం సాధిస్తారని, అది కొంతమందికి కనువిప్పు, ధర్మానుయాయులకు మేలుకొలుపు అవుతుందని, ఈ ధర్మరక్షాయజ్ఞంలో అందరూ అండగా వుండాలని, వుంటారని ఆశిస్తూ....

## శ్రీ నారాయణానంద భారతీ స్వామి

శ్రీ రామతారకాంధ్రాశ్రమం, వారణాసి

వేదములు ఎంత సనాతనమో మన ధర్మం అంత సనాతనమైనది. వేదము యొక్క తాత్పర్యం 'ఏకమేవా అద్వితీయం బ్రహ్మ' అనగా బ్రహ్మ అద్వితీయమని భావము. అయినప్పటికీ మానవులం ద్వైతభావం లో జీవిస్తున్నాం. ఏ విధముగా ఏకం (మహత్తత్వం) నుండి ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీటి నుండి భూమి, ఉద్భవించి వాటి వాటి ఉనికిని చాటుకుంటున్నాయో అదేవిధంగా అంతయు బ్రహ్మ (నారాయణుడు) అయినప్పటికీ సందర్భానుసారంగా ప్రయోజనాలకు అనుకూలంగా నారాయణుడు, తన పేరు మార్చుకున్నాడు.

రాముని తత్వం రామునిది నారాయణుని తత్వం నారాయణునిది. ఏ సమయంలో ఎవరిని ఆరాధించాలో వారిని ఆ సమయం లో ఆరాధించాలి. ఇది శాస్త్రసమ్మతం. వాల్మీకి రామాయణం వ్రాయుటకు ఉపక్రమించినప్పుడు సృష్టి కర్త బ్రహ్మ 'సూర్యచంద్రులున్నంత వరకు రామాయణం ఉంటుంది' అని వచించినాడు. వాల్మీకి చేత వ్రాయబడిన రామాయణంలోని సీతారామ కళ్యాణం ప్రవర మార్పు హక్కు ఎవరికీ లేదు. ఉండకూడదు. కొన్ని దుష్టశక్తులు భారత దేశ స్వాతంత్ర్యమును కబళించుటకు అనాదిగా భారతీయల ఆయువుపట్టైన గోవులు, దేవాలయాలు, వేదముల పై దాడి ప్రారంభించారు నేటి సమాజంలో లౌకిక ప్రయోజనాల కొరకు కొందరు పీఠాధిపతులు, పండితులు, ఆచార్యులు కూడా తారతమ్యం లేకుండా వ్యక్తులను ప్రాణంగా ఆరాధించడం, శాస్త్రాలను వక్రీకరించడం జరుగుతున్న దని అందరికీ తెలిసిన విషయమే. భద్రాచలం రామ మందిరం ఏ విధంగా ఏర్పడింది, ఆంధ్రులకు సీతారామకళ్యాణం విశిష్టత, తెలియని వారుండరు. ఇటువంటి ప్రాచీనమైన దేవాలయంలో కల్యాణంలో సీతారాముల గురించి మార్పు చేయగల సామర్థ్యం అన్యమతస్థుల ప్రాపకం కొరకు ప్రాకులడువారికి తప్ప మరెవరికి ఉంటుంది. ఆంధ్రులందరు సమైక్యమై తెలుగు భక్తుల మనోభావములు కాపాడుటకై డా. అన్నదానం చిదంబరం శాస్త్రి గారి ఆవేదనను గ్రహించి ఆంధ్రుల కొంగు బంగారమైన 'సీతారాములను' లక్ష్మీనారాయణులకు బదులుగా ప్రతిష్ఠించు కుందాం. సనాతన ధర్మం సుప్రతిష్ఠతమగును గాక!

## భద్రాచలంలో సంప్రదాయాలను రక్షించాలి

### స్వామి సర్వవిదానంద

దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో కొలువై వేల, లక్షలాదిగా భక్తుల సేవలందుకుంటూ అనుగ్రహిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వాముల పూజ, కళ్యాణ కార్యక్రమములలో దశాబ్దాల, శతాబ్దాలనుండి పాటిస్తున్న సంప్రదాయాలలో అవాంఛనీయమైన, అప్రామాణికమైన మార్పులు చేయటం ఆమోదనీయం కాదు. ఈ కాలంలో సంప్రదాయ అనుయాయులే కాని, సంప్రదాయ ప్రవర్తకులు కాగలిగిన వారెవరూ లేరు. సంప్రదాయాల ప్రకారం విధివిధానంగా నిర్వహించిపుడు మాత్రమే తత్ తత్ దేవతానుగ్రహములు భక్తులకు, సమాజమునకు లభిస్తుంటాయి. క్షేత్ర పవిత్రత మహిమలు కాపాడబడతాయి. ఆ విధంగా పరిరక్షించటం పరిపాలకుల బాధ్యత. కొన్ని స్వార్థప్రయోజనముల కోసం, స్వ సంప్రదాయ, ఆధిపత్యముల విస్తరణకోసం కొంతమంది పెద్దలు పాలకుల, ప్రభుత్వ అండదండలతో ఈ మార్పులకు కారణమని, తరతరాలుగా భద్రాచల సీతారాములను నియమనిష్ఠలతో సేవిస్తున్న అనేకమంది భక్తులు పరితప్తహృదయములతో చెప్తున్నారు. పూజ్యులకది తగదు.

### శ్రీ బాలబ్రహ్మనంద స్వామీజీ

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి గారి దేవస్థానంలో శ్రీరామనవమికి మరియు నిత్యకల్యాణాలలో సీతారాములకు కళ్యాణం మరియు వివిధ రకాల పూజలలో సీతారాముల నిజమైన గోత్ర ప్రవరలు చెప్పేవారు.

గతంలో మా గురువుగారైన కీర్తి శేషులు కోవూరు విశ్వనాథం గారు ప్రముఖ పురోహితులుగా ఉండేవారు. మరియు దేవాలయంలో ప్రతి నిత్యం దాశరధి శతకము పారాయణం చేసేవారు. వారి పాండిత్యానికి మెచ్చి దేవస్థానం తరపున వారికి గజారోహణ సత్కారం కూడా చేసారు మరియు దేవస్థానంలో జరిగే వివిధ పూజా కార్యక్రమాలలో కూడా పాల్గొనేవారు. వారు మాకు చెప్పిన విధంగా సీతారాములకు కల్యాణంలో నిజమైన గోత్ర ప్రవరలు చెప్పేవారు. శ్రీరాముడి గోత్రం వశిష్ఠ గోత్రం. సీతమ్మవారి గోత్రం గౌతమస గోత్రం. అని మరియు వారి తండ్రులుగా దశరథ మహారాజు జనక మహారాజు

వంశం వారి పేర్లు చెప్పేవారు. కనుక శ్రీ సీతారాముల కల్యాణంలో నిజమైన గోత్ర ప్రవరలు చెప్పవలసిందిగా కోరుతున్నాను.

ఈ విషయంగా పట్టువదలని విక్రమార్కుడిగా కంచర్ల వంశీయుడు, నిత్య కృషివలుడుగా పనిచేయుచున్న శ్రీ కంచర్ల వెంకట రమణ గారు సేవలందిస్తున్నందుకు అభినందిస్తున్నాం.

**శ్రీ విద్యాగణేశానందభారతీ**

**శ్రీరఘురామ చారుతులసీదళధామ శమక్షమాది**
**శృంగార గుణాభిరామ త్రిజగన్నుత శౌర్యరమాలలామ**
**దుర్వార కబంధరాక్షస విరామ జగజ్జన కల్మషార్ణ వో**
**త్తారక రామభద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!**

17 వ శతాబ్దంలో కంచర్ల గోపన్న వ్రాసిన దాశరథీ శతకం మకుటమీ పద్యం. ఇక్కడ రామదాసు సుస్పష్టంగా విశ్వష్టంగా ఖండితంగా ఆర్తిగా రఘురామ అనే సంబోధించినట్లు తెలియవస్తున్నదే కాని "రామ నారాయణ" అని ప్రస్తుతించిన దాఖలాలు లేవు.

గత 400 సం॥ బధ్రాద్రిలో జరిగే పూజలు కళ్యాణాది విశేషాలలో శ్రీరామచంద్ర ప్రభువు యొక్క వ్రతం మాత్రమే ఉట్టంకించ బడినదే కాని రామ నారాయణ అనే అపవాక్యం వాడబడలేదు.

కేవలం వ్యక్తిగతమై భావజాలంలో కొందరు మూర్ఖమతోన్మాదులు ప్రేరణవల్ల నేడు ఈ క్షేత్ర పురోహితులు వక్రీకరించి ప్రవర చదవడం హేయమైన చర్యే! ఇది నూరుశాతం రామభద్రుడికి జరుగుతున్న అపచారమే తప్ప అన్యతమం కాదు. కావున దేవాదాయ శాఖాధిపతులు, మంత్రివర్యులు ఈ విషయంలో శీఘ్రంగా స్పందించి త్వరితగతిన దీనిని పరిష్కరించవలసిన అవసరం ఎంతైన ఉంది.

ఈ విషయం కంచర్ల గోపన్న వంశస్థుడైన శ్రీ కంచర్ల వేంకటరమణ 11 వ తరపు వారసులు తమ పూర్వీకులకు ఆత్మక్షోభ గలిగేలా జరుగుతున్న ఈ దుశ్చర్యను రూపుమాపడానికై చేస్తున్న ప్రయత్నం శ్లాఘనీయం. కేవలం ఒక వ్యక్తికి కలిగిన ఊహను భక్తజనులందరి మనోభావాలను గాయం కలిగేలా మసలుతున్న అర్చక పూజారులు ఇకనైన కళ్ళు తెరచి తప్పుతెలుసుకొని దిద్దుకొందురుగాక!

శ్రీ వ్యాసాశ్రమం – ఏర్పేడు స్వాములు

**శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానందగిరిస్వామి పీఠాధిపతులు**

**శ్రీ విశ్వంభరానందగిరి స్వామి,** ఇంటర్నేషనల్, శారదాపీఠం, చీరాల

**శ్రీ పరమాత్మానందగిరి స్వామి,** వారణాశి.

**శ్రీ రామకృష్ణానందగిరి స్వామి,** తిమ్మాపురం

శ్రీ ఆచార్య అన్నదానం చిదంబర శాస్త్రి మహోదయులకు నమస్సుమాంజలి. శ్రీరామ భక్తులు శ్రీ వీరాంజనేయ స్వామివారు ఆ దారి తప్పిన ఆచార్యులను తప్పక శిక్షిస్తారు. మీరు చెప్పిందే అసలయిన సత్యము.

కవిభాషనర్లనే బదిలీ చేయించే శక్తిగల ఆ ''కుంతీ పుత్రో వినాయకః'' అని ప్రచారంచేసే ధర్మ ద్రోహులు శ్రీ ఆంజనేయస్వామి తోకతో తప్పక శిక్షిస్తాడు.

ఈ సమస్య లోపాయిగారిగా ఇప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు – సహృదయ పండితులు శ్రీ కె.సి.ఆర్ గారి దృష్టికి, మన భారత ప్రధానమంత్రిగారి దృష్టికి తీసుకొనిపోయే ఏర్పాటు తప్పక చేయాలి.

ధూర్జటి మహాకవి వ్రాసిన శ్రీకాళహస్తీశ్వర శతకం లోని ఒక పద్యాన్ని ఆ బలమయిన ఆచార్యువారికి వినిపిస్తున్నాను. ఇటువంటి వారికి ధూర్జటి మహాకవి తిట్టిన తిట్లు ఎలావుంటాయో చూపించే ప్రయత్నం చేస్తున్నాను.

"నీచులయినవారు భవిష్యత్తును గూర్చి ఆలోచించరు"

**99 వ పద్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం.**

**మొదలన్ చేసినవారి ధర్మములు నిర్మూలంబుగా చేసి, దు**
**ర్మదులై యిప్పటి వారె ధర్మములొనర్పం దమ్ము దైవంబు న**
**వ్వదె రానున్న దురాత్ములెల్ల తమ త్రోవం బోవరే ఏల చే**
**సెదరో మీదదలంచి చూడరధముల్ శ్రీకాళహస్తీశ్వరా ॥ 57**

తా॥ ఓ శ్రీకాళహస్తీశ్వరా – నీచులైనవారు భవిష్యత్తుని గురించి ఆలోచించి చూడనివారై, పూర్వము ధర్మశాస్త్రవేత్తలు చేసిన ధర్మములను నశింపచేసి వారు క్రొత్త ధర్మములను నిర్మించి ప్రచారము చేయుచుందురు. ఇట్టివారిని చూసి భగవంతుడు నవ్వడా. తమ తరువాత తరములవారగు దుర్మార్గులు తమను అనుసరించి ధర్మేతర

మార్గమును నడువరా, నడచుదురు, మరి యిట్లు వారెందలకు చేయుచున్నారో కదా (తాత్పర్యము వ్రాసినవారు కూడా పరిష్కర్తల్) నేను గాదు.

ఒక ప్రక్క అందరూ సమానమే అని చెపుతూ క్షత్రియుడయిన శ్రీరామ భద్రుడిని తమకులంవాడని అర్థమొచ్చే రీతిగా అర్చకులు మార్చడం హిందూ ధర్మానికి ద్రోహం. ఇక ముఖ్యమంత్రి గారు, ప్రధానమంత్రి గారు కల్పించుకుంటే గాని వారు మారరేమో?

## స్వామి భక్తిచైతన్యానంద

భద్రాచల క్షేత్రచరిత్ర, రామభద్రుని అవతరణ, పూర్వాపరాలు తెలిసిన వ్యక్తిగా కొద్దికాలంగా రామచంద్రుని రామనారాయణునిగా వక్రీకరించి జరుగుతున్న పరిణామాలు చాలా వ్యాకులం కలిగిస్తున్నాయి. ఈ ధోరణి తక్కువ సంపర్కం వున్న హైందవులకు అనుమానాలకు తావివ్వడమే కాక అవకాశం కోసం ఎదురు చూస్తున్న అన్యమతస్తులకు అవకాశం కాగలదనే సంశయం కలుగుతున్నది.

రామచంద్రుడు ఈ జ్ఞానాన్ని అందరికి కలుగజేయగలడని ప్రార్థిద్దాము. శ్రీమాన్ చిదంబరశాస్త్రిగారితో మేము ఏకీభవిస్తున్నాము.

## విజయభూమ్యానందగిరిస్వామి, శ్రీవారిపాదపీఠం, తాదేపల్లి

శ్రీ భద్రాచలములో శ్రీరామ ప్రతిష్ఠ చేస్తూ ఏ నామాన్ని విడినారో ఎప్పటికీ ఆ నామమే వుండవలె. మధ్యలో ఎవరో వచ్చి నామాన్ని మార్చడం సరి పద్ధతి కాదు. భద్రాచల రాముడిని శ్రీరామచంద్రుడిగానే పేర్కొనడం ఉత్తమము.

**ఓం శ్రీరామ - జయహనుమన్**

## భద్రాది సీతారామ కల్యాణంలో జరిగే అపచారం గూర్చి

# పండిత ప్రకాండుల అభిప్రాయాలు

శ్రీరామద్రోహి అయిన రావణుని మన బ్రాహ్మణుడు కదాయని ఏ బ్రాహ్మణుడూ సమర్థించడు. అలాగే భద్రాద్రిలోని సీతారామ కల్యాణం ద్రోహులను మనవారు కదాయని ఏ విజ్ఞుడు సమర్థించడు.

**బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ గారు,**

సంపాదకులు, ఋషిపీఠం

పెద్దలు, పూజ్యులు బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబరశాస్త్రిగారు సుప్రసిద్ధ హనుమదుపాసకులు, శ్రీరామచంద్ర భక్తులు, మహాపండితులు. భిన్న భిన్న సంప్రదాయ శాఖలతో ఉన్న సనాతన ధర్మవృక్షాన్ని పరిరక్షించాలనే తపన కలవారు.

వారి ఆవేదన, తపన అర్థవంతమైనవి. పురాణోక్తమైన భద్రగిరిలో పరంపరగా జరుగుతున్న జగత్ప్రసిద్ధ సీతారామ కల్యాణోత్సవంలో, అనూచానంగా చెప్పుకువస్తున్న శ్రీరాముని దశరథారంభ ప్రవరను, సీతమ్మ ప్రవరను మార్చి వేయడం ఆశ్చర్యకరం. పవిత్ర పాంచరాత్రాగమానుసారిగా ఇన్నేళ్ళుగా సాగుతున్న ప్రవరోక్తిని, స్వబుద్ధితో మార్చడంలో ఉద్దేశమేమిటో విజ్ఞులకు అర్థం కావడం లేదు. నారాయణమూర్తియే శ్రీరాముడు. అందులో సందేహం లేదు. కానీ రామచంద్రుని పేరుని కొత్తగా 'రామనారాయణ' అని, ప్రవరను గూడా మార్చి, సీతారాములను లక్ష్మీనారాయణులుగా కల్యాణవిధిని కల్పించడం ఉచితం కాదని, సంప్రదాయచ్ఛేదం కూడదని వైష్ణవ పండితులు కూడా వేదనవ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మశ్రీ అన్నదానం వారు స్మార్తులు. అన్ని ఆగమాలను గౌరవించడం, శైవ వైష్ణవాది సర్వ హిందూశాఖల సమన్వయం వారి సంప్రదాయం. వారి వాదన వేదన మాత్రమే. అందులో శైవవైష్ణవాది భేదాలు వారు ప్రదర్శించలేదు. వారు పరమరామభక్తులని మరువరాదు.

బహుకాలం నుండి ఆలయవిధులు పాంచరాత్రాగమానుసారం నడుస్తున్నాయి. అవి అలాగే నడవాలి కూడా. విష్ణుదత్తమై, ఆర్షధర్మమైన పాంచరాత్ర విధి శిరోధార్యం.

ఆ ఆగమాదులను ఎక్కడా వీరు కాదనలేదు. కానీ అన్య సంప్రదాయాలపై ద్వేషం కూడదనీ, ఉన్న పరంపరను నిష్కారణంగా మార్చవద్దనీ అత్యంత వినయంగా తమ రచన ద్వారా శాస్త్రిగారు తెలియజేశారు. తగిన శాస్త్ర ప్రమాణాలు, విద్వాంసుల అభిప్రాయాలు సమకూర్చి ఉద్యమిస్తున్నారు.

నిర్మల హృదయంతో ద్వేషావేశాలు లేని బుద్ధితో వారి గ్రంథాన్ని పరిశీలిస్తే ఔచిత్యం అర్థమవుతుంది. 'దాశరథి' అయిన శ్రీరాముడు దశరథారంభ ప్రవరతో, 'జనకాత్మజ' అయిన సీతను జనక పరంపరతో కూడిన ప్రవర ద్వారా కల్యాణం చేసుకొని జగత్కల్యాణం కలిగించాలని ప్రార్థిస్తూ.. నారాయణ స్వరూపుడైన శ్రీరామచంద్రుడు సీతా సమేతంగా సంప్రదాయాన్ని పరిరక్షించి -గోదావరీ తీర భద్రగిరిని అయోధ్యగా సాక్షాత్కరింప జేయాలని విన్నవించుకుందాము.

***

## బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారి

ఓరుగల్లు ప్రసంగాంశం 28-06-2013

గోపరాజు గారు దాశరథీ శతకం వ్రాస్తూ నూరుమార్లు కరుణాపయోనిధీ! అంటూ కడుపారా పిలుచుకొన్నాడు. పయోనిధి అంటే సముద్రం. 'సముద్రం లోతు ఎలా తెలియదో 'రామా ! నీ కరుణ లోతు కూడా అలాగే తెలియదు' అని దాని అర్థం. మనుష్యులం ఇక్కడ బాధపడుతుంటే వచ్చి రావణ సంహారం చేశాడు. అంతేకాదు గర్భస్థ నరకం అనుభవించాల్సిన అవసరం లేని వాడు అయినప్పటికీ మనుష్యుడుగా పుట్టటానికి, అమ్మకడుపులో కటిక చీకటిలో 12 నెలల పాటు పడుకొని మన కోసం గర్భస్థ నరకాన్ని అభుభవించి ప్రాకృతశిశువుగా వచ్చినవాడు దాశరథి. దశరథరాజు కుమారుడుగా పుట్టి దశరథుని కొడుకా! అని పిలిస్తే మురిసిపోయే లక్షణం కలవాడా ! అని ఒకటికి వందసార్లు దాశరథీ! అని భద్రాద్రి రామచంద్రుని నిర్ధారణ చేశారు గోపరాజువారు. ఆయన దశరథ రాముడే. అంతే తప్ప నాల్గు చేతులున్నాయి కదా అని ఆయనను రామనారాయణుడు అని గోపరాజువారూ అనలేదు, శంకరభగవత్పాదుల వారు కూడా ఎక్కడా అనలేదు. ''వామాంకస్థిత జానకీ పరిలసత్' అంటూ రఘుపతిగానే అన్నారు శంకరాచార్యులవారు. భద్రుడు చేసిన తపస్సులోని శక్తికి ఆయుధాలను అపసవ్యంగా ధరించి రావటం భగవానుని కారుణ్యానికి పరాకాష్ఠ. అంతే తప్ప భద్రాద్రి మీద

ఉన్నది రామనారాయణుడు కాదు. భద్రాచలంలో దర్శనమిస్తున్నది హద్దులేని కారుణ్యం కల్గిన మహాదయాశాలి, మహానుభావుడు, దశరథ కుమారుడు అయిన శ్రీరామచంద్రమూర్తే. ఆయనను రామనారాయణుడని గోపరాజు చెప్పలేదు, శంకరాచార్యుల వారూ చెప్పలేదు అన్నారు శ్రీ చాగంటివారు తమ ప్రసంగంలో...

***

**డాక్టర్ గరికపాటి నరసింహారావు గారు,** మహాసహస్రావధాని

## మన రాముడు - మన రక్షణ

తెలుగువారి ఆరాధ్యదైవం, సీతారామచంద్రస్వామి. భద్రాచలంలో దేవుడి పేరు అనాదిగా అదే. కానీ, ఇటీవల అక్కడ వైదికేతర వర్గాల ప్రాబల్యం పెరిగి, స్మార్త సంప్రదాయాల స్థానంలో కొత్త కొత్త ఆచారాలు ప్రవేశపెట్టబడ్డాయి. ఈ వర్గాలు తమ మొండి పట్టు ఉపయోగించి, దేవుడి పేరు కూడా మార్చేశాయి. మనమంతా నోరారా పిలుచుకునే సీతారామచంద్రస్వామి, ఇవాళ దశరథుడు పెట్టిన పేరు మారిపోయి రామనారాయణస్వామిగా కొందరు పూజారులు పెట్టిన పేరుతో బతుకు వెళ్లదీసుకుంటున్నాడు. పేరేదైతే నేమి అనే నిర్లిప్తతత పనికిరాదు. ఏ క్షేత్రమహిమ అయినా, ఆ దేవుడి పేరు మీద, ఆ విగ్రహ రూపం మీద, అక్కడ జరిగిన ప్రతిష్ఠమీద, వేల ఏళ్లుగా కొనసాగుతున్న ఆచార సంప్రదాయాల మీద ఆధారపడి ఉంటుంది. మన జీవితాలు సీతారాముల కరుణకు పాత్రం కావాలంటే, భద్రాచలంలో ప్రాతసంప్రదాయాలే కొనసాగవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఆ సంప్రదాయం తెలియాలంటే, తెలుగువారందరూ ఈ పుస్తకం చదవాల్సిందే.

***

## శ్రీ మల్లాది చన్ద్రశేఖర శాస్త్రిగారు

భద్రాచల క్షేత్రము శ్రీ సీతారామచంద్రస్వామి నిలయము. అనాదిగా కళ్యాణ క్రతువులు జరిగినా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి గోత్ర నామములతో కల్యాణ ప్రవరలతో జరుగుతూ ఉంది. ప్రస్తుతం కొద్దికాలంగా శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి బదులుగా శ్రీ రామనారాయణ స్వామి వారి పేరు చెప్పటం, గోత్ర నామములుగాని, కల్యాణ ప్రవరలుగా వేరుగా చెప్పుచున్నట్లుగా తెలుస్తుంది. ఇది చాలా అధర్మం, అన్యాయం. అనాదిగా జరుగుతున్న ఆచార వ్యవహారములను ఎవరి ఇష్టమొచ్చినట్లుగా వారు మార్చుడం

పద్ధతిగాదు. ఆలయ అధికారులు ఆలయ అర్చక స్వాములు ఈ విషయాన్ని గమనించగలరని విన్నవించుకొనడమైనది.

ఈ విషయం కంచర్ల గోపన్న వంశస్థుడైన శ్రీ కంచర్ల వేంకటరమణ 11 వ తరం వారసులు తమ పూర్వీకులకు ఆత్మక్షోభ కలిగేలా జరుగుతున్న ఈ దుశ్చర్యను రూపుమాపడానికై చేస్తున్న ప్రయత్నం శ్లాఘనీయం.

## డా॥ రేజేటి వేంకట వేణుగోపాల చార్యులు గారు

ఆంధ్రపాంచరాత్రాగమపీఠ స్థాపకులు

శ్రీ సీతారామస్వామివారి ప్రముఖ దేవాలయానికి నెలవై, 1931 నాటికే అక్కడ అర్చకస్వాములు శ్రీమాన్ పొడిచేటి వారి సారధ్యంలో అముద్రిత పాంచరాత్రాగమ గ్రంథ సంరక్షణ ముద్రణలు ప్రారంభించిన తొలి తెలుగు కేంద్రంగా పేరొందిన భద్రాచలంలో – ఇటీవల ది.14.4.2019న, శ్రీరామనవమి నాడు జరిగిన శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవమును నేను గమనించిన అంశములను ఇలా వ్రాయవలసి వచ్చినందుకు చింతిస్తున్నాను.

శ్రీ సీతారామ కల్యాణం మొదట నిర్విఘ్న పరిసమాప్త్యర్థం "విఘ్నేశ్వర" కాదు కాదు "విష్వక్సేన" పూజ – ఇది "శుక్లాంబరధరం విష్ణుం..." అను శ్లోకంతో ప్రారంభించబడినా వెంటనే "అగజానన..." అను శ్లోకం కాకుండా "యస్య ద్విరదవక్త్రాద్యాః పారిషద్యాః పరశ్శతం విఘ్నాన్ నిఘ్నంతి సతతం విష్వక్సేనం..." అంటూ విష్వక్సేనుని పారిషదులైన గజాననాదులు విఘ్నములను అణచివైతురని చెప్పే ఈ శ్లోకం– వైష్ణవ విఘ్నేశ్వర పూజా విశేషమును తెలియచేసింది.

2) పుణ్యాహవాచనం – కల్యాణోత్సవ వ్యాఖ్యాత శ్రీ ఆకెళ్ళ విభీషణ శర్మగారు, బహుశా ఆంధ్ర పాంచరాత్ర కల్యాణ గ్రంథ పరిచయంతో అనుకొంటాను "ఇప్పుడు భగవత్పుణ్యాహవాచనం జరుగుతుంది" అని ప్రకటించగా –

అర్చకాదులు ఒక బిందె వంటి కలశము నుంచి, కాదు "కలశస్థాపన' ' చేసి వాసుదేవ పుణ్యాహాన్ని చేశారు. (సత్యనారాయణ వ్రతాదులయందు చేసే కలశస్థాపనకు తప్ప పుణ్యాహకలశంపైన కొబ్బరికాయ, రవికెల గుడ్డ ఉంచడం ఉండదు – ఇది అక్కడ ఉన్న కొందరు మహాపండితుల సృజనాత్మకత).

3) వధూవరుల ప్రవర విషయం – దేశం అంతా శ్రీ సీతారామ కల్యాణంలో వరుడు శ్రీరాముని ప్రవర యందు వసిష్ఠ సగ్రోతులైన అజ, రఘు, దశరథులను,

వధువు సీతాదేవి ప్రవర యందు గౌతమ సగోత్రులైన నిమి, విదేహ, జనకరాజులను చెప్పి కన్యాదానం జరిపిస్తూ ఉండగా–

నేడు ఇక్కడ భద్రాచలంలో, గతంలో ఎవ్వరూ వినని "రామనారాయణ" నామధేయాన్ని శ్రీరామునకు ఆపాదించి, ఆయన గోత్రం అచ్యుత గోత్రం అని పర బ్రహ్మాదులు పితరులని–

సీతాదేవికి బదులుగా సీతామహాలక్ష్మి అని చెప్పి, లక్ష్మీదేవి ప్రవరలో చెప్పే సౌభాగ్య సగోత్రమునూ, విశ్వంభర, రత్నాకర, క్షీరార్ణవులు పితరులనీ చెప్పడం జరిగింది.

ఈనాడు జరుగుతున్న ఈ కల్యాణంలోనే, ఈ ఒక్కచోట తప్ప ఇంతకు ముందు కాని ఈ పైన కాని "శ్రీ సీతారాముల కల్యాణం అని, వరుడు శ్రీరాముడని, వధువు సీతాదేవి యని" కల్యాణం జరిపించే అర్చకులతో సహా అందరూ ఘోషిస్తూ ఉన్నా – ఈ ప్రవర చెప్పే సందర్భంలో మాత్రం "రామనారాయణ, సీతామహాలక్ష్మీ" అని చెప్పడం, దీనికి కారకులైన కొందరు వ్యక్తుల అసంబద్ధ నిరంకుశ ప్రక్రియా నిర్వహణకు తార్కాణముగా కన్పిస్తున్నది.

చివరగా, తలంబ్రాలు విషయం – ఇందులో స్వామివారు తూర్పు ముఖంగా ఉండగా అమ్మవారిని ఆయన కెదురుగా పశ్చిమముఖంగా ఉంచి అక్షతా రోపణం చేయించారు. ఇద్దరినీ తూర్పుముఖంగా ఉంచి అక్షతారోపణం చేయించే ఆచారం ఉన్నది, కాని ఇలా ప్రాంగ్ముఖంగా ఉండవలసిన అమ్మవారిని పశ్చిమముఖంగా ఉంచడం ప్రక్రియావిరుద్ధం కాదా!

భద్రాద్రి సీతారముల పెళ్ళిని అనుసరిస్తూ నేటికీ మానుషంలో అనుసరిస్తున్న పసుపు కలపని "ఆర్ద్రాక్షతారోపణం' జరుగుతూ ఉండగా, మాది ప్రత్యేకం అంటూ పసుపు కలిపిన అక్షతలే అక్షతారోపణకు తగిన వను భావనతో, అక్షత శబ్దానికున్న అర్థం ఆలోచించని వారి ఆధ్వర్యంలో, సీతారాముల శిరస్సున పోయడం ఎంతవరకూ సమంజసమో విజ్ఞులు ఆలోచింతురు గాక!

ఈ విధంగా వైష్ణవం అంటే కట్టూ బొట్టూ తమిళ పాశురాలు అని భావిస్తూ, పాంచరాత్ర ఆగమం అంటే తెలియనివాళ్ళు దేవాలయాలలో చేరి, వారికి రాని సలక్షణ ఆగమాన్ని వెనుకకు నెట్టి, పై విధంగా ముందుకు వస్తున్న కాలం ఇది. అక్కడ ఉన్న అర్చకస్వాములు కూడా, తెలిసీ తెలియకా విధి లేక వారి ధోరణినే అనుసరిస్తున్నారు.

***

30 ఏడ్లనాటి అర్చకులు, భద్రాచలక్షేత్రమహాత్మ్యకర్త **శ్రీమాన్ పొడిచేటి రంగాచార్యులు గారి కుమార్తె శ్రీమతి అమరవాది వైజయంతి మాల గారు**

నేను పొడిచేటి (అమరవాది) వైజయంతిమాల D/o. పొడిచేటి శ్రీ రంగాచార్యులు గారి కుమార్తెను. తేది 12-3-2018 భక్తి ఛానల్‌లో భద్రాచలం గురించిన చర్చాకార్యక్రమాన్ని చూడటం జరిగింది.

ఆ చర్చలో మా నాన్నగారికి (పొడిచేటి రంగాచార్యులుగారికి) మతి భ్రమణం అని భద్రాచలం అర్చకుల పేరుతో చర్చకు వచ్చిన శ్రీ మురళీకృష్ణమాచార్యులుగారు ప్రస్తావించారు. ఆయనకు మతిభ్రమణం ఉందని అందువల్ల ఆయన రచించిన శ్రీ భద్రాచల క్షేత్రమహాత్మ్యం గ్రంథాలను గోదావరిలో పారవేశామని తెల్పారు.

ఈ సందర్భంలో నేను తెలియజేసేదేమనగా పొడిచేటి శ్రీ రంగాచార్యులు గార్కి గ్రంథం వ్రాయకముందుగాని, గ్రంథ సమాప్తి అయ్యాక గాని ఆయన జీవితంలో ఎన్నడూ మతిభ్రమణం లేదు. (ఆ గ్రంథ రచనా సమయానికి సదరు పండితుల వారు (మురళీకృష్ణమాచార్యులు గారు) జన్మించియే ఉండి ఉండరు.

అలాగే ఇక్కడ ఉత్సవమూర్తులకు రామనారాయణ అనే పేరు ఉన్నది అని చెప్పారు కాని, ఈ ఇంటి ఆడపడుచుగా రామదాసుగారి చేత తేబడిన ఐదుకుటుంబాల వారిలో ఒకరైన పొడిచేటివారిగా మా తల్లిదండ్రుల నుండి గాని, ఇతరుల నుండి, పెద్దల నుండి గాని ఇక్కడ ధృవమూర్తులు లేక ఉత్సవ మూర్తులకు అలాగే అసలు ఏ మూర్తికి 'రామనారాయణుడు' అనే పేరు వినలేదు. ముమ్మూర్తుల ఇక్కడి అన్ని రూపాలలో ఉన్నది సీతారామచంద్ర స్వామివారే.

***

భద్రాద్రిలో గతంలో మూడు పర్యాయాలు ఈ.ఒ.గా., ఐదు సార్లు నవమి కల్యాణ నిర్వాహకులుగా పనిచేసిన **శ్రీ మంచనపల్లి రఘునాథ్ గారు** రిటైర్డ్ జాయింట్ కమీషనర్, ఎండోమెంట్స్ వారు.

భద్రాచలం నందు కొలువై యున్న స్వామివార్ని శ్రీరామునిగా కొలువవలెనా లేక రామనారాయణుగా కొలువవలెనా అన్న అంశముపై అనేక వాదప్రతిపాదనలు, చర్చలు ఇటీవల కాలంలో తరచు జరుగుచున్నవి. ఈ అంశముపై గతములో భద్రాచల దేవస్థానమునకు 3 పర్యాయములు కార్యనిర్వహాణాధికారిగా పనిచేసి 5 పర్యాయములు శ్రీరామనవమి కళ్యాణము నిర్వహించిన నా యొక్క అభిప్రాయము ఈ క్రింది విధముగా తెలియచేసుకొను చున్నాను.

ప్రపంచ దేశాలన్నింటిలో Indian God ఎవరు అని అంటే శ్రీరాముడు అని చెపుతారు. శ్రీరాముడు అయోధ్యలో జన్మించి వనవాస కాలమునందు దక్షిణ అయోధ్యగా పిలువబడే భద్రాచలములో అరణ్యవాసము గడిపినాడని భక్తుల నమ్మకము విశ్వాసము. భద్రాచలాధీశుడు శ్రీరాముడు అని భక్తుల ప్రగాఢ విశ్వాసము. రామకోటి వ్రాసి సమర్పించినా పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంలోని భక్తులు ప్రతి సంవత్సరము వడ్ల గింజలను శ్రీరామ స్మరణ చేస్తూ వలిచి శ్రీరామనవమి కళ్యాణమునకు అంక్షితలుగా సమర్పించినా అట్టి భక్తులందరికీ భద్రాచలము నందు వేంచేసిన శ్రీరామునిపై గల అచంచల భక్తి విశ్వాసములే ప్రధానము. భక్తుల యొక్క భక్తి విశ్వాసములే కదా ఆలయ వ్యవస్థకు అత్యంత ప్రధానమైన అంశము. EO కార్యాలయ పరముగా చూచినట్లయిన భద్రాచల దేవస్థానము శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానముగా ప్రచురించబడి దేవాలయ స్థిరచరాస్తులు సీతారామచంద్ర స్వామి పేరునే నమోదుకాబడి ఎకౌంట్సు అన్నియు అదే పేరున నిర్వహించ బడుచున్నవి. భక్తులు కిచ్చు ఆర్జితసేవా టికెట్లు కూడా అదే పేరున ముద్రించ బడుచున్నవి. బ్యాంకులయందు ఖాతాలు కూడా శ్రీ సీతారామచంద్రస్వామి పేరునే ఉండును.

శ్రీరాముడు లేని రామాయణం ఎలా ఊహించలేమో అదే విధముగా శ్రీరాముడు లేని భద్రాచల క్షేత్రాన్ని ఊహించలేము.

భగవంతుడే మానవరూపములో శ్రీరామునిగా జన్మించి మానవ సంబంధములు (Human Relations) ఏ విధముగా ఉండాలి అని విషయము (పితృభక్తి, సోదరుల ఎడల ప్రేమాభిమానములు, స్నేహబంధము, పెద్దల ఎడల ఉండవల్సిన గౌరవ మర్యాదలు) మనకు తెలియజేస్తూ మన మధ్య జీవించి శిష్టరక్షణ దుష్టశిక్షణ గావించి మనందరి హృదయములలో నిలిచినారు. అందుకే మన జీవన విధానమునకు రామాయణమే ప్రమాణము. మన కుటుంబవ్యవస్థ అందరి సభ్యుల సంస్కారమునకు కూడా రామాయణమే ప్రమాణము. అందుకే మనదేశ సంస్కృతి అనేక ప్రాశ్చాత్య దేశ సంస్కృతుల వలన ప్రభావితము కాక తనయొక్క ఉనికి నిలబెట్టుకున్నది.

భద్రాచల క్షేత్రము శ్రీరామక్షేత్రమే. శ్రీరామనవమి రోజున శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవమును తిలకించడానికి సీతారాముల ఆశీస్సులు పొందటానికి అనేకమంది భక్తులు భద్రాచలక్షేత్రాన్ని చేరుకొని సీతారాములను సేవించి

తరించుచున్నారు. అట్టిభక్తుల మనోఫలకాలపై ప్రతిష్ఠించుకొన్నది భద్రాచలములోని సీతారాములనే. మానవ మాత్రులమైన మన యొక్క ఆయుర్ధాయం, తెలివితేటలు, మేధో సంపత్తి అన్నియు భగవంతుడు మనకు ప్రసాదించినవే అని మరువకూడదు. అట్లయిన మనకు అహంకార పోకడలు అలవడవు.

శ్రీరాముని దర్శన భాగ్యము పొందిన శ్రీరామదాసుగారు తన్మయత్వంలో కీర్తించినది శ్రీరామునే. భక్తులందరి మనస్సులలో నిలుపు కున్నది శ్రీరాముడునే. అనాదిగా భద్రాచల అధిష్ఠాన దేవతలు సీతారాములే,రామదాసుగారి భావన, నాటి నుండి భక్తుల విశ్వాసము భద్రాచల అధిష్ఠాన దేవతలు సీతారాములనే.

ఇటీవల కాలంలో భద్రాచలములో వున్నది శ్రీరాముడు కాదని శ్రీరామనారాయణుడు అని పేర్కొంటూ కళ్యాణ ప్రక్రియలో వధూవరుల ప్రవరలు సీతారాములది కాక లక్ష్మీనారాయణలవి చెప్పుట జరుగుచున్నది. భక్తుల మనోభావాలను గాయపర్చే అట్టి పండితుల అభిప్రాయము అన్యమత ప్రచారము కంటే ప్రమాదకరమైనది. మన మతములోనే భక్తుల మనోభావముల మధ్య కార్చిచ్చు రగిల్చి భక్తుల మధ్య విద్వేషాలకు కారకులగుచున్నారు. ఇది ఖండించవల్సిన విషయము. కొందరు అర్చక స్వాములకు ఇష్టత లేకపోయినప్పటికీ అధర్వణ వేదపండితులైన గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు వారు, స్థానాచార్యులైన స్థలశాయి అనేవారలు వారి యొక్క influence తో ఇతర అర్చక స్వాములను dominate చేస్తూ లక్ష్మీనారాయణుల ప్రవరలు చదువుతున్నారు. శ్రీ సీతారామచంద్ర దేవస్థానము, భద్రాచలక్షేత్రము యొక్క ప్రతినిధులుగా వారివురు అట్లు వ్యవహించుట చాలా బాధాకారము. దేవస్థాన ప్రతినిధులు కానిచో వారియొక్క వ్యాఖ్యానము అంత ప్రాధాన్యత ఉండదు. భక్తులు అంత పట్టించుకొనరు.

గతములో శ్రీరామనవమి కళ్యాణమునకు మంగళంపల్లి బాలసుబ్రహ్మణ్యం వంటి ప్రముఖ సంగీత విద్వాంసులు, మరెందరో ప్రముఖ పండితులు వాఖ్యతలుగా వచ్చెడివారు. బయటనుండి వచ్చి వ్యాఖ్యతలుగా వ్యవహరించిన పండితులు కళ్యాణము నందు సీతారాముల ప్రవరలే చెప్పెడివారు.

ఒక భక్తుడు పూజాద్రవ్యము సమకూర్చుకొని అర్చక ముఖేన కళ్యాణము (సీతారాముల కళ్యాణము) జరిపించుకొను ఉద్దేశ్యముతో “వరుణ” ఇచ్చిన యెడల అట్టి అర్చకులు భక్తుల అభీష్టము మేరకు పూజాది కార్యక్రమము నిర్వహించవలెను. అట్టి పూర్తి బాధ్యత అర్చకులదే. అందు జరిగిన తప్పిదములకు కూడా అర్చకులదే బాధ్యత.

ఇటీవల కాలములో ప్రవరలు చెప్పుటలో మార్పు తీసుకొని రావడం శాస్త్ర సమ్మతము కాదని, హైందసంస్కృతికి ప్రమాదకరమని దేవాలయ సాంప్రదాయము (భద్రాచలక్షేత్రము) పరిరక్షణకై శ్రీ అన్నదానం చిదంబర శాస్త్రిగారు చేయు ప్రయత్నం ఎంతో హర్షదాయకము మరియు అభినంద నీయము. శ్రీరామభక్తులందరికి వారిని అన్ని విధముల సహకరించవలసినదిగా కోరుచున్నాను.

పైన తెలిపిన విధముగా ప్రవరలను సరిచేసుకొనవలసినదిగా అనేక పర్యాయములు కోరినప్పటికీ సహకరించక పోగా కార్య నిర్వాహణాధికారిగా పనిచేయుచున్న నన్ను బదిలీ చేయించి 7 మాసములు పోస్టింగు రాకుండా అడ్డుకొనిన వారి చర్యలను వారియొక్క విజ్ఞతకే వదిలివేస్తున్నాను. నా యొక్క తాత్కాలిక ఇబ్బందులను శ్రీరామకార్యనిర్వహణలో నా బాధ్యతగా స్వీకరించియున్నాను.

భద్రాచలక్షేత్రములోని శ్రీరాముని పేరును మార్పుచేయడం, కళ్యాణ ప్రక్రియలో ప్రవరలు మార్చి చదవడం అనాదిగా వచ్చుచున్న సాంప్రదాయాన్ని విస్మరించడం సరికాదు.

భద్రాచల క్షేత్రములో జరిగే సీతారాముల కళ్యాణములో సీతారాముల ప్రవరలే చదువవలెనని అనాదిగా వచ్చుచున్న సాంప్రదాయమునే కొనసాగించవలెనని ప్రయత్నించుచున్న శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి గార్కి అన్ని విధములుగా సహకరించగలరని మనవి చేయుచున్నాను.

***

గౌ॥ ముఖ్యమంత్రి **శ్రీ కె.సి.ఆర్ గారికి** ధార్మిక విషయాల గురుతుల్యులు, శ్రీ శృంగేరిశారదాపీఠ ఆస్థానపండితులు,

**బ్రహ్మశ్రీ పురాణం మహేశ్వర శర్మ గారి** అంతరంగం.

"ఏతద్దేశ ప్రసూతస్య సకాశాదగ్రజన్మనః స్వంస్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః" ఈ దేశాన జన్మించిన ప్రతీ మానవుడూ వారి వారి చరిత్రలను అగ్రజన్మల ద్వారా తెలిసికొనాలి" ఇది మానవ ధర్మశాస్త్రము. మనుస్మృతి కారుడివే కాక ఇంకా ఇతర ఎన్నో ధర్మవచనాలు ఇలాంటివి కానవస్తాయి. చరిత్రను ఉన్నది ఉన్నట్టుగా గ్రహించాలి కాని ఉన్నదానిని లేనట్టుగా స్వార్థప్రయోజనాల కొరకై చరిత్రను మార్చడం చాలా శోచనీయం. ఈ పాటికే మన భారతీయ చరిత్ర అనేక రకాలుగా మార్పులు చేర్పులతో కూడుకొని ఉన్న తరుణంలో "పురాణ వైర గ్రంథమాల" విశ్వనాథవారు రచించినారు. కానీ ఆ గ్రంథాల నధ్యయనం చేసి

ఇది యథార్థ గాథ అని తెలిసికొనే వాళ్ళు చాలా తక్కువ మందే. ఇట్టి తరుణంలో మన భద్రాద్రిలో ఇట్టి వివాదాలు తలదూరడం శోచనీయమై యున్నది. నిష్పక్షపాలన దృష్టిలో ఆలోచించి యథార్థమైన గంభీర చింతన చేసి అక్కడ జరుగవలసిన మార్పుల గురించి శాస్త్రీయమైన దృక్కోణముతో చాలా చక్కని యుక్తులతో సప్రామాణికమైన రీతిలో భద్రాద్రి గురించి విశదముగ ఈ గ్రంథమున శ్రీ బ్ర.వే.అన్నదానం చిదంబరశాస్త్రిగారు వివరించినారు. విజ్ఞులు వీరి నిష్పక్షపాత ప్రస్తావన నాదరించి రామభద్రక్షేత్రమున (భద్రాద్రిన) ప్రాచీనవైభవాన్ని పునః స్థాపించవలసిన అవసరమున్నది. అందులకై మేము మీ గ్రంథాన్ని అవలోకించి ఎంతగానో సంతసించి అక్కడ జరుగుతున్న విషయాలను తెలిసికొని విచారాంతరంగులమైనాము.

శ్రీ రామపాద సేవాధురంధర హనుమదుపాసకులైన మీ ద్వారా ప్రస్తావింపబడిన ఈ సమస్యలకు తప్పక శ్రీ భద్రాద్రీశుడు పరిష్కారాన్ని చూపుతాడని విశ్వసిస్తూ పునః ప్రాచీన వైభవాన్ని పరంపరాగతమైన సంప్రదాయాన్ని నడిచే రీతిగా రామచంద్రు డనుగ్రహించాలని ప్రార్థిస్తూ....

***

శృంగేరి శ్రీ శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు

## డా॥ బాచంపల్లి సంతోష కుమార శాస్త్రి గారు

హనుమదుపాసకులు, పెద్దలు డాక్టర్ అన్నదానం చిదంబరశాస్త్రి గారికి నమస్కారములతో, మీరు వ్రాసిన పరిశోధన గ్రంథము "భద్రాద్రీశునకు జరుగుచున్న ఘోరాపచారం" పుస్తకం ఆమూలాగ్రం చదివితిని. శ్రీరాముడు హరిహరాద్వైతమూర్తి అనటంలో సందేహం లేదు. సమస్త క్షేత్రములు, క్షేత్ర మాహాత్మ్యములు ఈ విషయమును నిరూపిస్తున్నాయి. తెలుగు రాష్ట్రములలో భద్రాద్రీశునకు చైత్రమాసంలో కల్యాణం జరగకపోతే పెండ్లిల్లు చెయ్యరు. నూతన సంవత్సరంలో శ్రీ సీతారామ కల్యాణం జరిగితేనే ఆ కల్యాణ అనుగ్రహ అక్షతలతోనే తెలుగు రాష్ట్రాలలో పెండ్లిల్లు జరుగుతాయి. మీరన్నట్లు భద్రాద్రిలో శ్రీ సీతారామ కల్యాణం జరగటం లేదు. లక్ష్మీనారాయణ కల్యాణం జరుగుతున్నది. శ్రీ ఏలూరిపాటి అనంతరామయ్యగారు, శ్రీ జమ్ములమడకశర్మగారు, శ్రీ మల్లాదిగార్ల వ్యాఖ్యానంతో భద్రాద్రి కల్యాణవైభవం ప్రతి తెలుగువాడి ఇంట్లో రేడియోల ద్వారా జరిగేది. ఆనాడు లేని విచిత్ర సంప్రదాయములు ఈనాడు కనిపిస్తున్నాయి. కొద్దిమంది వ్యక్తుల వైష్ణవ ధర్మవ్యాప్తి

అనే మతప్రచారం అక్కడ పెరిగింది. శ్రీరాముడు కేవలం వైష్ణవులకు మాత్రమే కాదు, స్మార్తులకు, సర్వసంప్రదాయములు అవలంబించే వ్యక్తులకు ఉపాసనాదైవం. మీరు చేపట్టిన ఉద్యమం స్ఫూర్తిదాయకం. ఈ పుస్తకంలో వాస్తవం ప్రతీ అక్షరంలో కనిపిస్తుంది. మీరు చేపట్టిన ఈ ఆర్షధర్మప్రచారంలో నేను మీ వెంటే ఉంటాను. మీరు నిజాన్ని నిర్భయంగా వ్రాసిన ధీరులు. ఆ హనుమంతుడే మీకు తోడగా ఉన్నాడు.

***

**డాక్టర్ చిల్లావూరి శివరామకృష్ణశర్మ** M.A. (Tel), M.A. (San) Ph.D

రీడర్ (రిటైర్డ్), పాండురంగనగర్, హైదరాబాద్

శ్రీ కంచెర్ల వెంకట రమణగారు మా గృహానికి విచ్చేశారు. కంచెర్ల ఇంటి పేరు వినగానే మనకు భక్తరామదాసు గుర్తుకు వస్తారు. శ్రీ వెంకటరమణ గారు అనేక సామాజిక సేవాకార్యక్రమాలు చేస్తుంటారు. హనుమద్భక్తులు. భద్రాద్రిలో సీతారామచంద్రస్వామివారికి కాకుండా లక్ష్మీనారాయణులకు కల్యాణం చేస్తున్నారనే విషయం వీరు తెల్పారు.

నారాయణునికి హిమాలయాలలోని బదరీ నుండి దక్షిణాన శ్రీరంగం వరకు అనేక ఆలయాలున్నాయి. శ్రీరామునికి అయోధ్యలో రామాయలం, భద్రాద్రిలో సీతారామచంద్రస్వామి ఆలయం ప్రసిద్ధాలు. అయోధ్య రామాలయం బాబరు కూలగొట్టడం వల్ల భద్రాద్రి రామాలయమే ప్రముఖాలయంగా ఉంది.

దేశంలో ఉన్న ప్రముఖ దేవాలయాలన్నింటి పేర్లతో ఆలయాలు కట్టే సంప్రదాయం కల బందరులో కూడా భద్రాద్రి రామాలయం కట్టారు. ఈ స్థితిలో భద్రాద్రి సీతారామచంద్రస్వామివారిని రామనారాయణునిగా మార్చడమేమిటి? శ్రీరాముడు నారాయణుడే. కాని పేరు మారితే గోత్రం మారుతుంది. వంశప్రవర మారుతుంది. మంత్రం మారుతుంది. పరివారం మారుతుంది. మొత్తం విధానమే మారుతుంది.

లక్ష్మణుడు నారాయణుని తమ్ముడు కాడు. సీత నారాయణుని భార్య కాదు. భద్రాద్రిలో రామకథా విశేషాలు కనబడతాయి. కాని వైకుంఠ విశేషాలు కావు కదా! తానీషా నవాబు గారికి కలలో కనబడింది రామోజీ లక్ష్మోజీలు. కాని నారాయణుడు కాదు కదా! సీతమ్మకు చేయిస్తీ బంగారు పతకమని రామదాసు పాడాడు. కాని లక్ష్మికి చేయిస్తీ అని చెప్పలేదు కదా! భక్తరామదాసు దశరథుని కొడుకు పేర దాశరథీశతకం వ్రాశాడు కాని నారాయణశతకం కాదుగదా!

నారాయణుడు అంటే 'నారాయణః పరోవ్యక్తాత్' అని ఎక్కడో మరో లోకంలో ఉన్న స్వామి అనే భావం కలుగుతుంది. శ్రీరాముడు మనదేశంలో నడయాడి మన శబరి ఆతిథ్యం తీసుకున్న, మన గుహుని కౌగిలించుకున్న ఆత్మీయ మూర్తిగా స్ఫురిస్తారు.

ఇప్పటివరకు అయోధ్య రామాలయం కల నెరవేరనే లేదు. తరతరాలుగా ఉన్న భద్రాద్రి రాముని కూడా నారాయణునిగా మార్చి వేయడం ఏం బాగుంది? అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుకుందాం.


**డాక్టర్ తూములూరు శ్రీ దక్షిణామూర్తిశాస్త్రి**

రిటైర్డ్ ప్రిన్సిపాల్, శ్రీ భావనారాయణ సంస్కృత కళాశాల,

పొన్నూరు, గుంటూరుజిల్లా


ప్రజాభిప్రాయానికి విలువనిచ్చే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం, మన భారతదేశం. ఇక్కడ పరంపరగా వచ్చే, సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించి, పాటించటం పౌరులమైన మన కర్తవ్యం.

భద్రాద్రిలో, శ్రీ సీతారామకల్యాణ సమయంలో వారి పేర్లు మార్చి, ప్రవరలు మార్చి వివాహ కార్యక్రమం నిర్వహించటం అక్కడి అర్చకస్వాములు చేస్తున్న పొరపాటు. ఇది శ్రీరామాపరాధంగా పరిగణింపవలసిన విషయం. ఆగమశాస్త్రాన్ని, ప్రజాభిప్రాయాన్ని మన్నించి జరుగుతున్న పొరపాటును సరిచేసుకోవలసిన బాధ్యత అక్కడి అర్చకస్వాములది. ఆలయ అధికారులది. ఈ విషయంలో ప్రభుత్వం కూడా చొరవ చూపించవలసి ఉంది. భక్తులమైన మనం ఆదిశగా కూడా ప్రయత్నాలు సాగిద్దాం.

రామాయణంలో, తెలిసిన మూర్ఖుడు రావణుడు. రామాపరాధం చేసి, తాను సపరివారంగా నశించినట్లు చెప్తోంది శ్రీమద్రామాయణం. సుందరకాండలో హనుమంతుడు, సముద్రం లంఘించి లంకలో ప్రవేశించి సీతామహాదేవిగా సందర్శించి, రావణుని నిండుసభలో, ఆతనితో "రావణా! సీతను నిర్బంధించటం, నీకు తగదని" హితవు చెప్పాడు. "ఇంతవఅకు, నీవు అనుభవించిన వైభవము, (విద్య, విజ్ఞానము విజయములు, సంపద, అధికారము) నీ తపః (ధర్మ) ఫలము. నీవిప్పుడు చేసిన అకృత్యమునకు, త్వరలో అనుభవింపబోయేది, అధర్మఫలం. అది నిన్ను, నీ వారిని నిలువునా దహించి వేస్తుంది" అని హెచ్చరించాడు.

**శ్లో॥ప్రాప్తం ధర్మఫలం తావద్భవతానాత్ర సంశయః।**

**ఫల మస్యాప్యధర్మస్య క్షిప్రమేవ ప్రపత్స్యసే॥సుం.కాం.51స.31శ్లో**

ఇప్పటికైనా, జరిగిన పొరపాటును సరిదిద్దుకొని శ్రీ సీతారాముల దేవాలయంలో, శ్రీ సీతారాముల కల్యాణంలో శ్రీ సీతారాముల పేర్లు, ప్రవరలు చెప్పి, సర్వలోక శరణ్యుడైన శ్రీరామానుగ్రహానికి పాత్రులవుదాం. కర్తవ్యాన్ని విస్మరించటం ధర్మవిరుద్ధం.

"ధర్మస్యజయోఽ స్తు,, అధర్మస్య నాశోఽ స్తు."

పుష్పగిరి పీఠ ఆస్థాన పండితులు, టి.టి.డి పాంచరాత్రాగమ సలహాదారు

**డా॥ వేదాల వేంకట సీతారామా చార్యులు గారు**

శ్రీమాన్ అన్నదానం చిదంబరశాస్త్రి గారికి అభినందన పూర్వక శుభాకాంక్షలు. ఇప్పుడు భద్రాచలంలో జరుగుతున్న కల్యాణాలలో రాముని పేరున ప్రవరలని ఇప్పటి అర్చకులే మార్చినారు. వీరికి వెనుకటి తరంలో అర్చకులు రాముని పేరు రాముడనే చెప్పినారు. రామునికి 'వశిష్ఠ' ప్రవరని, అమ్మవారికి గౌతమ ప్రవరలనే చెప్పారు. నేను స్వయంగా విన్నాను.

1960 వ ప్రాంతంలో భద్రాద్రి రామాయలయ జీర్ణోద్ధరణ జరిగింది. ఆ సంఘానికి అధ్యక్షులు నాకు గురువులైన శ్రీమాన్ యస్.టి.జి. వరదాచార్యులుగారే. ఇప్పటి కల్యాణ మండపం మొదలైన నిర్మాణాలు వారే స్వయంగా జరిపించారు. ఆ కాలానికి నేను వారి కళాశాలలో విద్యాప్రవీణ చదువుతున్నాను. నాకు వారే శాస్త్ర గ్రంథాలని చెప్పుతామని నన్ను తీసికొని వెళ్ళినారు. వారి వెంట ఉండి కళ్యాణోత్సవాలను చూచాను. గోత్ర ప్రవరలని విన్నాను. ఇప్పుడు చెప్పేవి కవిత్వాలే.

మీరుపంపిన పుస్తకం 12వ పేజీలో వసిష్ఠుడు 'నారాయణ' మంత్రంలోని 'రా' అక్షరాన్ని నమశ్శివాయలోని 'మ'తో కలిపి 'రామ' తయారుచేసి దశరథుని జ్యేష్ఠ కుమారునికి పేరును పెట్టినట్లు వ్రాశారు. ఇది సరికాదు. వశిష్ఠునికి ఆ అవసరం లేదు. రామశబ్దం వేదంలోనే ఉంది. అసలు మంత్రం శివాయ. మకారం 'నమః' శబ్దంలోనే ఉంది. ఇది త్యాగభావనని చెపుతుంది. ఈ శబ్దం అన్ని మంత్రాలకి సమానమే. మనకు ప్రామాణికులైన పాణిని వ్యాకరణం ప్రకారం రామ శబ్దం వ్యుత్పత్తిని చూడగలరు. అవాల్మీకాలతో వాల్మీకానికి హాని జరుగరాదు.

★★★

పూర్వామ్నాయ శ్రీ పూరీశంకరాచార్యపీఠ దక్షిణాది ప్రతినిధి, ఆర్ష విద్యాతపస్వి

**బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ గారు**

భద్రాచలంలో సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరామచంద్రమూర్తిని ఒక్కసారైనా చూసి తరించాలని ప్రాణికోటి ఉవ్విళ్ళూరుతూ ఉంటుంది.

భద్రుడు ప్రార్థన చేసినప్పుడు శ్రీమన్నారాయణుడు అతన్ని తరింప చేయటానికి తద్వారా మనందరిని తరింపజేయడానికి రామచంద్రమూర్తిగా దర్శనమిచ్చారు. మనమందరమూ ఆ దిగివచ్చిన పరాత్పరుడిని నారాయణుడిగా కొలుస్తామేమో అన్న శంక కలిగి, అందరూ శ్రీరామచంద్రునిగానే ఆయనని కొలవాలని వామాంకము మీద సీతమ్మను కూర్చుండ బెట్టుకొని, లక్ష్మణ సమేతులై విచ్చేసినారు. కావున ఆ స్వామిని అనూచానంగా ఏ పద్ధతితో కొలుస్తున్నామో, ఏ ధర్మాలను అక్కడ ఆచరిస్తూ వచ్చామో అదే విధానంలో శ్రీ సీతారామ చంద్రులను లక్ష్మణ సమేతుడిగా, దశరథ తనయునిగా భావించి అందరమూ కొలుద్దాము. అందుకే రామదాసులవారు దాశరథి శతకం రచించి, దాశరథీ కరుణాపయోనిధి అని వేడుకున్నారు. ఇది రామ సంకల్పముచే నాకు కలిగిన భావము అని తేటపరుస్తున్నాను.

(నుడివెడిది రామాయణమట, నుడివించెడివాడు రామభద్రుండట)

***

ఆగమశాస్త్రంలో ప్రొఫెసరు మరియు హెచ్.ఒ.డి. **శ్రీమాన్ తట్టా విజయరాఘవాచార్యులు గారు** రాష్ట్రీయ విద్యాపీఠం, తిరుపతి

భగవంతుని ఆగమనమును, ఆరాధనను గూర్చి వివరించునది ఆగమము. పంచరాత్రులలో భగవంతుని చేత నారాయణుని చేత ఉపదేశింపబడినది. కావున పాంచరాత్రము అనబడుచున్నది. పాంచరాత్రాగమానుసారము భద్రాద్రిలో నిత్యోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ సంవత్సరోత్సవాలు జరుగుచున్నవి. శ్రీరామచంద్రుడు చక్రధారిగా, చతుర్భుజునిగా దర్శన మివ్వటం ఎక్కడ లేని ప్రత్యేకత మనం దర్శింపవచ్చు. సీతారాముల కల్యాణం కూడా ప్రత్యేకంగా ప్రచురిత మగుచున్నది. కల్యాణోత్సవంలో వధూవరుల గోత్ర వివరణ పూర్వకంగా స్మరించుకోవటం సంప్రదాయం.

విచిత్రంగా, విలక్షణంగా చెప్పడం మంచిది కాదని ఆచార్య అన్నదానం చిదంబరశాస్త్రిగారు తమ ఆవేదనను నివేదిస్తూ వ్రాసిన పుస్తకం గురించి పాంచరాత్రాగమ పరిశోధకులు శ్రీమాన్ రేజేటి వేణుగోపాలచార్య స్వామివారు స్పష్టంగా చెప్పిన తరువాత సులభంగా అందరికీ అర్థమౌతున్నది. కలౌహరి నామకీర్తన ముఖ్యం. శ్రీరామచంద్రుని గురించి వినవలెను, అనవలెను, కనవలెను, తెలిసికొనవలెను.

నిలుపుకొనవలెను. చక్రధారిగా మనచెంత శ్రీరాముడుండగా తక్కువేమి మనకు. మనసున సీతారాములు నిలిచిన వేళ వాదములికేల?

'శ్రీరామ రామ రామేతి – రమే రామే మనోరమే!
సహస్రనామ తత్తుల్యం – రామచంద్ర వరాననే'

★★★

సంపాదకులు 'గోవింద ప్రియ' **డా॥ శ్రీమత్ తిరుమల వేంకట రాజగోపాలా చార్యులు గారు** భీమవరం.

వేదవేద్యుడైన పరమాత్మ శ్రీమన్నారాయణుడు దశరథాత్మజునిగా అవతరించి వేదరూపమైన శ్రీరామాయణ కథానాయకుడైనాడు. 'తం మన్యే రాఘవం వీరం నారాయణ మనామయమ్' అంటూ దేవతలు, విశ్వామిత్ర వశిష్ఠాది మహర్షులు ఎందరు ఎన్ని విధాల చెప్పినా శ్రీరాముడు మాత్రం తాను దశరథుని కుమారుడినే అంటూ ఏ ఒక్కరినీ తాను సాక్షాత్ పరమాత్మ అనే సందేహం కలగకుండా ప్రవర్తించాడు. 'యదా చైతద్వనం ఘోరం రామో దశరథాత్మజః, ఆగ మిష్యతి దుర్ధర్శః తథా పూతా భవిష్యసి' అని అహల్యకు శాప విమోచనం నుడివిన సందర్భములో రాముని దశరథాత్మజునిగానే ఉటంకించాడు వాల్మీకి. అయోధ్యాధిపతి, ప్రభువు, తన తండ్రియైన దశరథుని అభిప్రాయం తెలిసికోకుండా రాముడు నన్ను ప్రతిగ్రహింపలేదు అని అయోధ్యకాండలో సీతాదేవి స్వయంగా అనసూయతో చెబుతుంది.

'శ్రీరాముడు నారాయణుడే అని రాక్షస సంహారం చేయటానికి ధర్మ సంరక్షణార్థం దశరథునకు కౌసల్యకు పుత్రుడుగా జన్మించాడని 'రామో విగ్రహవాన్ ధర్మః' అనటంలో ఎవరికీ ఎటువంటి అభ్యంతరం ఉన్నట్లు లేదు. ఆదర్శ ధర్మమూర్తి అయిన శ్రీరాముని చరితం ఒక సామాన్య మానవ కుటుంబ ధర్మశాస్త్రం. శ్రీరాముడు భారతీయుల ఆరాధ్యదైవం. శ్రీ రామాయణం భారతీ సంస్కృతికి జీవనాడి. రాముని గుడిలేని వాడలేదు. ప్రతి రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు సీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువుగా జరుగవలసిందే. కళ్యాణాక్షతలు శిరస్సున ధరింపవలసిందే. రూపుదాల్చిన లక్ష్మీదేవి సీత. రాముడు నారాయణుడే. 'అనన్యా రాఘవేనాహం భాస్కరేణ ప్రభాయథా – సూర్యుని నుండి కాంతి వేరు కానట్లు రాముడి నుండి వేరుకానిది సీత. ఆ దాంపత్య మది. కనుకనే సీతారాముల కల్యాణం భారతీయ మానవజాతి హృదయస్పందన. 'జానక్యాః కమలామలాంజలి పుటే

యాః పద్మరాగాయితా' అంటూ నేటికీ వివాహ ఆహ్వాన శుభపత్రికను ఆరంభించడం అనూచానమైన ఆచారం. ఇది దశరథాత్మజుని కల్యాణ ప్రాశస్త్యం.

భద్రాద్రి సీతారామ కల్యాణం : దురదృష్టవశాత్తు ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాద్రిలో శ్రీరామనవమినాడు జరిగే శ్రీ సీతారాముల కళ్యాణ నిర్వహణ ప్రక్రియ వివాదాలకు, విమర్శకులకు ఆలవాలం కావటం రామభక్తుల హృదయాలలో ఆందోళన కలిగించడం వాస్తవం. వివాహంలో సీతారాముల ముఖ్యమైన గోత్ర ప్రవరలు మార్చి లక్ష్మీనారాయణ గోత్ర ప్రవరలు పఠించడం పై మరికొన్ని తదితర లోపాలను అపచారాలను ఎత్తిచూపుతూ శ్రీహనుమదుపాసకులు, ప్రముఖ సంస్కృత పండితులు బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబర శాస్త్రి గారు తమ వాదనకు ప్రమాణాలు శాస్త్ర ప్రవచనాలుచూపుతూ తమ ఆవేదన నివేదనను అక్షర రూపంలో 44 పుటల గ్రంథంగా వెలువరించారు. వారిపై వ్యక్తిగత దూషణలు, దాడులు చేయకుండా సశాస్త్రీయ, సహేతుక, సప్రమాణ సమాధానాలు మరల అక్షర రూపంలోనే చెప్పి ఒప్పించవలసిన బాధ్యత భద్రాద్రి సీతారామ కల్యాణ నిర్వాహకులపై అర్చకస్వాములపై ఉంటుందని అభిప్రాయ పడుతున్నాను.

లక్షలాది భక్తులు తిలకించి పులకించిపోయే భద్రాచల శ్రీసీతారామ కళ్యాణ విధివిధానం వివాదాస్పదమై రామభక్తుల భక్తి పారవశ్యానికి తూట్లు పడటం బాధాకరము. హరిహర భేదభావనా స్థితి గతులు పునారావృతం కాకూడదని పండిత మండలిని ప్రార్థిస్తున్నాను. పిట్ట, పిట్ట తగవు పిల్లి తీర్చిన చందాన, అన్యమత రాబందుల రెక్కల చప్పుడుల మాటున మన హైందవ ధర్మం బీటలు వారకుండ కాపాడమని సవినయనంగా మనవి చేస్తున్నాను. సామరస్య చర్చలతో విభేదాలు సమసింప చేసి హిందూమతాన్ని, వేదధర్మాన్ని పరిరక్షింపుడని విజ్ఞులైన పండితులకు పీఠాధిపతులకు వేడుకోలు సమర్పించుకుంటున్నాను.

**రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే**
**రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః**

***

సంపాదకులు 'శ్వేతదీపం' **శ్రీమాన్ ఎక్కిరాల అనంత కృష్ణ గారు**

## నారాయణుడు - రాముడు

సీతారామచంద్రులు భద్రుని తపస్సుకు మెచ్చి అతని శిరస్సుపై వెలసిన పరమ పవిత్రమైన క్షేత్రము భద్రాచలం. అచట హనుమల్లక్ష్మణ సీతా సమేతుడైన

రామచంద్రమూర్తి సన్నిధిలో అసంగతమైన, అపచార పూర్వకమైన కార్యకలాపాలు జరుగుచున్నట్లు బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబర శాస్త్రిగారి నివేదికలో చదవడం జరిగింది. ఎన్నోవేలమంది వీక్షించి ఆనందాన్ని పొందే సీతారాముల కల్యాణంలో అంతమంది కన్ను గప్పి ఆదిలక్ష్మీనారాయణ కళ్యాణంగా జరిపించడం భగవదపచారము, భాగవతాపచారము కూడ. శ్రీరాముడు శ్రీమన్నారాయణుని యవతారము మరియు సీతమ్మ తల్లి శ్రీ మహాలక్ష్మి అవతారమనుట నిస్సందేహము మరియు నిర్వివాదమైన విషయమే. కాని ఆ నారాయణుడే భద్రగిరిపై సీతా సమేతుడైన శ్రీరామునిగా వెలసి యున్నాడనునది సత్యమైన యంశము. అందువలన అక్కడ కళ్యాణోత్సవాలు, బ్రహ్మోత్సవాలలో చెప్పుకొనవలసినది దశరథ తనయుడైన రామచంద్రుడు మరియు జనక సుతమైన సీతాదేవి యొక్క ప్రవరలే గాని లక్ష్మీనారాయణులవి కావు. దశరథ తనయునికి రాముడని నామకరణము చేసిన వారు వశిష్ఠ మహర్షి. అష్టాక్షరి మంత్రంలోనే "రా" అనే అక్షరాన్ని పంచాక్షరి మంత్రంలోని 'మ' అనే అక్షరాన్ని జోడించి 'రామ' అనే పేరు నిర్ణయింపబడింది అనే విషయం ఇతిహాస ప్రోక్తం కాబట్టి ప్రామాణికం./ అష్టాక్షరి, పంచాక్షరి మంత్రాలు రెండు వేదమంత్రములలో అంతర్గతమైనవే. శ్రుతి, స్మృతులు రెండు కూడ శివకేశవుల అభేదాన్ని ప్రతిపాదించాయి. శివశ్చ నారాయణః' అని నారాయణోపనిషత్తులో చెప్పబడింది. విష్ణు సహస్రనామ స్తోత్రంలో కూడ 'శర్వః ', 'శివః' అనే నామాలు విష్ణుని నామాలు గానే చెప్పబడింది. భగవద్గీతలోని విభూతి యోగంలో 'రుద్రాణాం శంకరశ్చాస్మి' అని భగవానుడే స్వయంగా చెప్పాడు. ఆ విధంగా వేదప్రమాణము, ఋషి ప్రమాణము కనిపిస్తున్నా లెక్క చేయకుండా భద్రాద్రి రాముణ్ణి రామనారాయణునిగా, సీతమ్మను సీతామహాలక్ష్మిగా మార్చి వేయడం అవివేకం. భద్రుడు కోరిన రూపంలో దర్శనమిచ్చి అదే రూపంలో అతనికిపై నిలచి వుండటానికి నారాయణునికి లేని అభ్యంతరం ఈ పండితుల కెందుకు? శివ సంబంధం వుండడం వలన వీరికి రామ నామ మంటే ద్వేషమా? జీవ కోటికి తరుణోపాయమైన రామనామముపైననే ద్వేషం కలిగి వుంటే వీరికి అజ్ఞానానికి జాలిపడాలి. సీతారాముల కళ్యాణం లోక కళ్యాణానికి మూలము. అటువంటి దానిలో సీతారాముల గోత్రాలను మార్చి వేయడం మహాపచారం. ఆలయ నిర్వహణకు సంబంధించిన ఏ ఆగమనంలోను ఇటువంటి పద్ధతి చెప్పబడినట్లు లేదు. ఈ అపచారం వలన కలిగే దుష్ఫలితం మానవ జాతి మొత్తానికి సంక్రమిస్తుంది. కాబట్టి ప్రభుత్వాధికారులు, ఆలయ నిర్వాహకులు వెంటనే ఈ

అసంగతమైన విధానాన్ని మార్చుకొంటారని ఆశిస్తున్నాను. భద్రాది వంటి అతి ముఖ్యమైన దేవాలయంలో జరుగుచున్న అనాచారాన్ని అందరికీ తెలియజేసి యథార్థాన్ని నిరూపించిన చిదంబర శాస్త్రి గారికి కృతజ్ఞతలు.

***

సంపాదకులు 'దర్శనం'

## శ్రీ మరుమాముల వెంకటరమణ శర్మ గారు

తెలుగుప్రజల ఆరాధ్యదైవం శ్రీభద్రాచల సీతారామచంద్రస్వామివారు. భద్రుని కోరికమేరకు ఇలలోవెలసిన స్వామివారిని ఆరాధించి తరించిన వారెందరో. "దాశరథీ కరుణాపయోనిధి" అంటూ ఆనాడు రామదాసుచేత కీర్తించబడిన ఆస్వామి ఈనాడు రామనారాయణుడిగా మారాడు. శ్రీరాముడికి జరిగే కళ్యాణవేడుకలో కూడా సంప్రదాయంగా చెబుతూవస్తున్న గోత్రప్రవరలను పక్కనబెట్టారు.

రాముడైనా, నారాయణుడైనా తేడా ఏమున్నది? రాముడే నారాయణుడైనప్పుడు "రామనారాయణుడు" అనవలసిన అవసరమేమున్నది? అనాదిగా భక్తుల హృదయాలలో భద్రాద్రిరాముడిగా స్థిరమైన నామాన్ని కొత్తగా చెప్పవలసిన అగత్యమేమున్నది? ఇవి సామాన్యప్రజలకు కలుగుతున్న సంశయాలు.

ఇటువంటి సందర్భంలోనే ప్రముఖ పండితులు, ఆధ్యాత్మికవేత్త, ఉపాసకులైన బహ్మశ్రీ అన్నదానం చిదంబరశాస్త్రిగారు అక్కడజరుగుతున్న ఈ అపచారాన్ని వేలెత్తిచూపారు. రాముడ్ని రామనారాయణుడిగా చేసే ప్రయత్నాలను నిరసించారు. ఇది అనాదిగా కొనసాగుతున్న ఆచారాలకు నీళ్ళొదలడమేనని నిరూపిస్తూ ఎన్నో కథనాలు, పుస్తకాలు రాశారు. వాటిని పాఠకులకు చేర్చడంలో దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక తనవంతు బాధ్యత స్వీకరించింది.

శాస్త్రిగారినేకాదు, భక్తులను వేధిస్తున్న ఈ విషయంలో ఆలయ పాలకవర్గం, అర్చకస్వాములు సమాధానం చెప్పవలసిన అవసరమున్నది. దేవాదిదేవుడైన రామచంద్రమూర్తి వారందరికీ సుజ్ఞానజ్యోతులను ప్రసాదించాలని వేడుతున్నాను.

***

పండిత వరేణ్యులు

## శ్రీమాన్ కోగంటి వేంకటాచార్యులు గారు

**రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే ।**
**రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ॥**

అని భద్రాద్రి రాముని నమస్కరిస్తూ పేచీలేని ప్రార్థన చేసుకున్నాను.

ఆనాడు ఆధార్ కార్డులు లేవు. విశ్వాధారం ఆయనే మరి జలదాధారుడికి ఆధార్‌కార్డు ఎందుకండీ ? ఎలాగయినా పిలవవచ్చును. 'రామనారాయణ' అంటే తప్పేమిటి? అన్నదానం వారు నాకు బహుకాల మిత్రులు. కొంచెం హడావుడి చేశారు. ఏమిటబ్బాయిది! వివరంగా తెలుసు కోవాలనుకున్న నాకు ఆయనే వాట్సాప్ పెట్టారు 40 పుటల పుస్తకం. నేనూ ఆలోచించాను.

నిజమే ! భక్తులు ఆయన్ను పిల్చినా తల్చినా "రామయ్య తండ్రీ! రామయ్యా! రామా ! రామచంద్రా!" అంటూ యిలానే పిలుస్తుంటారు. శ్రీ వైష్ణవస్వాములు గారాబంగా "చక్రవర్తి తిరుమగనార్" అంటారు.

లోకానికి రాముడంటే అంత ముద్దుమరి. 'రామనారాయణ' అంటూ యింతింత పేర్లు పిలుస్తారేమో అనేమో "ఆత్మానం మానుషం మన్యే" అంటూ నటించారు. "దశరథాత్మజుణ్ణి" అనే చెప్పుకున్నారు సుమా ! అందుకే చక్రవర్తి తిరుముగనార్.

### పెళ్లిరోజు

ఇటూ అటూ వంశాలు కూడా చెప్పుకొన్నారు. వారిలో నారాయణుడూ లేడు, హరీలేడూ, విష్ణువు లేడూ రాముడి నామ విశేషణాలుగా.

క్షత్రియుడుగా "పేరు చెప్పి … వర్మణే వరాయ" అనడం తప్పవుతుందాండి? 'రామనారాయణ' అన్నా యిక్కడ కుదరదు గదా! నారాయణ పదం జోడిస్తే 'వర్మ' అనాలా, 'శర్మ' అనాలా? తండ్రి, తాత, ముత్తాతలను కనీసం పేర్లైనా అనాలి కదండి! అన్న తరువాత వర్మ అనాలి కదండి ! ఇది తప్పుకాదు కదా? "మేలైయార్ శెయ్ వనగుళ్" అన్నది కదా అమ్మగోద! బహుకాలంగా పెద్దలాచరించినదే మాకు మార్గం అన్నారు కదా ఆళ్వారాదులున్నూ! వెనుకటి లాగే కళ్యాణం నిర్వహించండి' అంటున్నారు చిదంబరశాస్త్రిగారు. యిది చిన్న విషయం. ఇదే చిదంబర రహస్యం నాకు తోచిన మాటలివి. లొసగులు ఉంటే సైరిచండి. – శ్రీ భాగవతదాస్.

***

తెలంగాణా రాష్ట్ర బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి **బ్రహ్మశ్రీ**
**రామావఝుల రవికుమార్ శర్మ గారు**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో శ్రీరామనవమికి మరియు నిత్యకల్యాణాలలో సీతారాములకు కళ్యాణం మరియు వివిధ రకాల పూజలలో సీతారాముల నిజమైన గోత్ర ప్రవరలు చెప్పేవారు.

గతంలో మా గురువుగారైన బ్రహ్మశ్రీ చల్లా కోదండరామయ్య శర్మగారు భద్రాచలం దేవస్థానంలో ఆస్థాన పురోహితులుగా ఉండేవారు.

ఆ సమయంలో సీతారాముల కల్యాణం జరిగినప్పుడు ఈ క్రింది విధంగా గోత్రప్రవరలు చెప్పేవారు. సీతాదేవి గోత్రము గౌతమ, సీతాదేవి తండ్రి జనకమహారాజుగారు తాతగారు హ్రస్వరోమ మహారాజుగారు ముత్తాత స్వర్ణరోమ మహారాజుగారు. సీతాదేవి నామ్నీం ఇమాం కన్యాం అని చెప్పేవారు.

శ్రీరామచంద్రస్వామి వారి గోత్రము వశిష్ఠ శ్రీరాముని తండ్రి దశరథ మహారాజు తాత అజమహారాజు, ముత్తాత నాభాగమహారాజు అని చెబుతూ శ్రీ రామచంద్రస్వామినే వరాయ అని చెప్పి కళ్యాణం జరిపించేవారు.

✶✶✶

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త **డా॥ మైలవరపు శ్రీనివాసరావు గారు**

నమస్కారం. ఓ పండగొస్తే ఈ రోజా, ఆ రోజా అని ఓ చర్చ. దాని మీద విపరీతమైన గోష్ఠి. ఓ పద్ధతంటూ ఏమీ లేదు హిందూ సంప్రదాయానికి అని ముగింపు. ఓ పురాణం అని అనగానే దాని గురించి ఏ మాత్రం అవగాహన లేని ఇద్దరు కూచుని, రాముడు ఇలాంటివాడు, అలాంటివాడు, సీతమ్మ పాపం పతివ్రత అనే గుర్తింపునకు నోచుకునేటటువంటి ఒక స్త్రీ అని దుర్విమర్శలు చేస్తూ మరో ముగింపు. ఇలా హిందూ సంప్రదాయాన్ని తిట్టడమే పనిగా లోకం సాగిపోతుంటే మళ్ళీ కొత్త చర్చలు తేవాలని తపన పడ్డం చాలా విచారకరమైన అంశం.

రాముణ్ణి శ్రీ సీతారామచంద్రస్వామి అని భద్రాచలంలో ఎన్నో సంవత్సరాల నుంచి తెలియజేస్తూ ఉంటే, అనాదిగా ఆ పేరు వస్తూ ఉంటే, ఇప్పుడు కొత్త పేర్లు తీసుకొచ్చి, ఏమిటి సాధించాలని ఈ చర్చ ?

ఫలానివారు ఈ చర్చ కోసం ఈ బీజాన్ని నాటారు. ఇదీ పేరు, ఇలా చేయాలని చెప్పారని చెప్పండి, నేరుగా వారి వద్దకు వెళ్ళి, వారితో వాదించి వస్తాం.

ఒక్క క్షణం ఆలోచించుకోగలగాలి ! హిందూ సంప్రదాయాన్ని, హిందూ పద్ధతిని ఆదరించేవారే ఈ విధంగా చేస్తే హిందూ వ్యతిరేకులైన వారు దీని గురించి ఎలా ఆలోచిస్తారో ఒక్క క్షణం ఆలోచించండి. సాధించేటటువంటిది ఏమీ ఉండదు. హిందూ సంప్రదాయాన్ని ధ్వంసం చేయడం తప్ప.

✶✶✶

'ఆగమ ప్రవర' మహదాచార్య, శతాధిక ప్రతిష్ఠాపనాచార్య

## శ్రీమాన్ పరాంకుశం కేశవాచార్యులు గారు

**శ్లో॥ కూజన్తం రామరామేతి మధురం మధురాక్షరమ్**
**ఆరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకికోకిలం ॥**

శ్రీ మద్రామాయణం ప్రపంచానికే ఆదర్శ గ్రంథరాజము. యుగాదిగా దశావతార నిరూపణలో మత్స్యః కూర్మ వరాహశ్చ నారసింహశ్చ వామనః వరకు కృతయుగధర్మం 4 పాదాలతో నడిస్తే త్రేతాయుగం ఒక్క సీతారాములతో నడిచింది. ప్రక్కన లక్ష్మణునితో భరత శతృఘ్నులతో దాసుడయిన ఆంజనేయునితో నడిచింది రామాయణం. బాలకాండ, అయోధ్యాకాండ, అరణ్యకాండ, కిష్కింధాకాండ, సుందరకాండ, యుద్ధకాండ, శ్రీరాముడు సాక్షాత్తు విష్ణువయితే ఆదిశేషుడు లక్ష్మణుడయితే శంఖచక్రాలుగా భరత శత్రుఘ్నులుగా శివాంశగా ఆంజనేయుడుతో రామాయణకథ ఇక్ష్వాకు వంశంగా, వాశిష్ఠ మైత్రావరణ కౌండిన్య త్రయార్షేయ) ప్రవరాన్విత వాశిష్ఠ గోత్రోద్భవస్య రఘుమహారాజ వర్మణః, నప్త్రే, అజమహారాజువర్మణః, పౌత్రాయ, దశరథమహారాజ వర్మణః, పుత్రాయ వాశిష్ఠ గోత్రోద్భవాయ శ్రీరామచంద్ర పరబ్రహ్మణే వరాయ. సీతాదేవికి అంగీరస, అయాస్య గౌతమ, త్రయార్షేయ ప్రవరాన్విత గౌతమస గోత్రోద్భవస్య మహారాజవర్మణః నప్త్రీం, విదేహమహారాజ వర్మణః పౌత్రీం, జనక మహారాజవర్మణః పుత్రీం అయోనిజాం సీతాదేవీ నామ్నీం వర్మణః పాత్రం, జనకమహారాజ వర్మణః పుత్రీం అయోనిజాం సీతాదేవీ నామ్నీం ఇమాంకన్యాం అని స్పష్టంగా చెప్పుచున్నాయి ప్రామాణిక గ్రంథాలు. అలాగే కన్యాదానం చేసేటప్పుడు జనకమహారాజు "ఇయం సీతా మమసుతా సహధర్మచరీ తవ" అని స్పష్టంగా చెప్పియున్నవి. ప్రామాణిక గ్రంథాలు. ఇంకా ఇక్ష్వాకుల తిలక ఇక నైనా పలుకవే రామచంద్రా అని రామదాసుగారు అని రాముణ్ణి వేడుకొనినట్లు, ననుబ్రోవమని చెప్పవే సీతమ్మతల్లీ అని వేడుకొనెను. రామదాసుగారు జైలులో బాధతట్టుకొనలేక వేడుకున్నాడు.

తానీషాగారికి పైకం చెల్లించటానికి మారువేషాలతో వచ్చినపుడు మీరెవరని ప్రశ్నించినపుడు మేము రామోజీ లక్ష్మోజీ అని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తుంది. రామదాసుగారికి గురువు కబీరుదాసుగారే. కబీరు దాసుగారు రామదాసుగారికి రామమంత్రాన్ని ఉపదేశించినట్లుగా శాస్త్ర ప్రమాణం. అలా అని భద్రాద్రిలో ఒక చోట దేవాలయంలో కబీరుగారి విగ్రహం చిత్రించటం జరిగింది. వామాంక స్థిత జానకీ పరిలసత్కోదండ దండంకరే అని చెప్పబడియున్నది. వ్రాయబడి యున్నది. ఇటువంటి నిదర్శనలలో భద్రాద్రిలో సీతారామలక్ష్మణస్వాములే గాని లక్ష్మీనారాయణులు కానే కారు. రామనారాయణుడు కాదు. ఇటీవల పాంచరాత్రాగమ గ్రంథ ప్రామాణానికి అపచారం చేస్తూ లక్ష్మీనారాయణుల గోత్రాలు చదువుట మహాపచారం 18వ శతాబ్దిలో తూము నరసింహదాసుగారు అంతకు ముందు కాలాల్లో భద్రుడు, రామదాసు సరసదాసుగార్లు తప్ప వేరెవ్వరూ ప్రమాణం కాజాలరు. తూము నరసింహదాసుగారు తమ ఉద్యోగాన్ని మానుకొని శ్రీ భద్రాద్రి రామచంద్రస్వామివార్లకు నిత్యనైమిత్తక కార్యక్రమాలు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. వారు ఎక్కడా కూడా ఎప్పుడు గూడా రామనారాయణ అని గాని, లక్ష్మీనారాయణ అని సంబోధించలేదు. తమ కీర్తనాలలో వ్రాయలేదు. కళ్యాణంలో గూడా వాసిష్ఠ గోత్ర ప్రవర + సీతమ్మతల్లిది గౌతమస గోత్రంగానే చెప్పినట్లు శాస్త్ర ప్రామాణాలు. రామదాసుగారు నిర్మించింది సీతారామస్వామి ఆలయాన్నే నిర్మించారు గాని రామనారాయణ దేవస్థానం కాదుగా? ఒక భక్తునకు ఒక సి.డి.దొరికితే అందులో శ్రీరామచంద్రస్వామినే వరాయ అని యున్నది. ఒకప్పుడు ఆలయ ఇ.వో. గారు గోత్ర ప్రవరలు మార్చి చదివినప్పుడు అట్లా కాదండి రామచంద్రస్వామి సీతాదేవి గోత్ర ప్రవరలు మాత్రమే చదవండి. ఇది భద్రాద్రి రాముడు గదా ప్రపంచానికంతా ఆదర్శం గదా అని గట్టిగా చెప్పినా వారు వినకుండా లక్ష్మీనారాయణ ప్రవరలే చదివి ఆయనను కోప్పడి ధర్నాచేసి గోలచేసినట్లుగా వినికిడి. ఇంతెందుకు నేను ఆప్రాంతంలో భద్రాద్రి వెళ్లి కళ్యాణాన్ని చూచినపుడు సీతారాముల ప్రవరలే చదివి యున్నారు. అప్పుడు వ్యాఖ్యాతలుగా వున్నపుడు సీతారాముల ప్రవరలే చదివినారు. నేను వైఖానసాగమ పండితుడుగా కళ్యాణం చూడటానికి వెళ్లాను. పాద్మసంహిత, కళ్యాణ సంహిత, పరాశర సంహితలలో పాంచరాత్రాగమ సంహితలలో ఉన్నట్లే సీతారామ ప్రవరలే చదివి యున్నారు. నేను స్పష్టంగా విన్నాను. మాధవరామశర్మగారు, రంగాచార్యులు వ్యాఖ్యానం చేస్తూ శర్మగారు అమ్మా సీతమ్మతల్లి ఇప్పటివరకు గౌతమసగోత్రం అదిగో చూడమ్మ

రామచంద్రమూర్తి నీ తలపై గుడజీరక మిశ్రమాన్ని ఉంచుతున్నారు. రాముని చాయల చూడమ్మ ఇకనుండి నీవు రామచంద్రమూర్తి గోత్రమైన వాసిష్ఠంలోకి వెళ్తున్నావమ్మా! అంటూ ప్రత్యక్షంగా చూచినట్లే వ్యాఖ్యానించారు. నేను ఒక ఆగమశాస్త్ర పండితుడుగా నాటి నుండి నేటి వరకూ వాసిష్ఠ గోత్రమే, అమ్మది గౌతమసగోత్రమే చెప్పుచున్నాను. నేను ఎక్కువ రామాలయాలే ప్రతిష్ఠ చేయించాను. సీతారామ కళ్యాణాలే చేయించాను. సీతారామ కళ్యాణము చేయుట పట్టాభిషేకము చేయుట పరిపాటిగా వస్తున్నది. రామనారాయణులకు భద్రాద్రిలో కళ్యాణమేమిటి మరునాడు సీతారామ సామ్రాజ్య పట్టాభిషేకమేమిటి? ఆగమశాస్త్ర ద్రోహం జరుగుచున్నది. ఆ భద్రుని కోరికపై భద్రాచలం అయింది. ఆ భద్రాచలంపై 'వామాంకస్థిత జానకీపరిలసత్ కోదండ దండంకరే' అని శంకరులు అన్నారు. విశిష్టాద్వైత సాంప్రదాయము ప్రకారము సీత కుడిప్రక్కన వుంటే చతుర్భుజాలతో వున్నందున నారాయణుడనుకోవచ్చు స్పష్టంగా సీత ఎడమ ప్రక్కనే వున్నది. రామనారాయణుడు ఎట్టి పరిస్థితులలో కావటానికి వీలులేదు. స్పష్టంగా సీతారాముల ప్రవరలతోనే కళ్యాణం జరుపవలసినదే. అక్కడ చేస్తున్నవి ఆగమ ద్రోహం, దైవద్రోహం. జనం పిచ్చివాళ్లు కారు. ఆగమ పండితులు సాంప్రదాయ వ్యతిరేకమైతే క్షమాపణ లేదు. ఇది గమనించి పూర్వ సాంప్రదాయకంగా సీతారాముల ప్రవరలతో కళ్యాణం చేయించుట శ్రేయస్కరం లేనిచో శిక్షార్హులు అవుతారు. తెలియక తప్పు చేస్తే రాముడు కరుణామయుడు క్షమిస్తాడు ధృవమూర్తులు, ఉత్సవమూర్తులు ఒకరైతే ఇంకొక స్వామివారి గోత్ర ప్రవరలు చదువుట ఎంతవరకూ ధర్మమో ఆలోచించుడు. పూర్వకాలం నుండి గోత్రములు చెప్పుకొనుట చేతనే అతను ఆ గోత్రీకుడు అవుతాడు. ఒకే పేరుతో అనేకమంది వుంటారు. కాని వాడి గోత్రము ప్రవరతోనే స్పష్టంగా ఆ వ్యక్తి అవుతాడు. ఇది గమనించగలరు. ప్రజలు ఈ విషయంలో తీవ్రంగా ఆలోచించి ఆగమపండితులు అర్చకులతో సంప్రదించి తప్పును సవరించగలందులకు సహకరించండి.

***

భద్రాద్రి యందలి అపచారాల ప్రతిఘటనలో ఆద్యులు, రామాయణం శర్మగా సుప్రసిద్ధులు **శ్రీ బొడ్డపాటి శ్రీరామ సుబ్రహ్మణ్యేశ్వర శర్మ గారు**

భద్రాచలం.

నేను భద్రాచలంలో 1995 నుండి 24 సంవత్సరములుగా నివసిస్తూ, స్థిర

నివాసము ఏర్పరచుకుని యున్నాను. 2001 నుంచి 2015 వరకూ (2014లలో (SVBC/DOORDARSAN) శ్రీరామనవమి శ్రీ సీతారామ కళ్యాణం ఆకాశవాణి ప్రత్యక్ష వ్యాఖ్యాతగా పాల్గొని యున్నాను.

కళ్యాణం మొదటినుంచీ చివరిదాకా స్వామి నామాన్ని శ్రీరామచంద్ర స్వామి అనే పేర్కొనేవారు. 2013 ప్రాంతం నుంచీ ఒక్క ప్రవరలో మాత్రం "రామచంద్రుడు"గా కాక "రామనారాయణుడు"గా మార్చారు.

అప్పటినుండీ మేము అధికారయంత్రాంగం దృష్టికి తీసుకు వస్తూ, సరిచేయమని అభ్యర్థిస్తునే ఉన్నాము. మార్పు ఉన్నట్లైతే సరిచేయమని, దేవాదాయ శాఖ కమీషనరు – కార్యనిర్వహణాధికారికి దిశానిర్దేశం కూడ చేసి యున్నారు. కానీ ప్రయోజనం శూన్యం. అదృశ్యహస్తం అడ్డుకుంటూ, మార్పుకు సహకరిస్తోంది.

శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో కళ్యాణంతోసహా స్వామి సేవలన్నీ "రామచంద్రుని" పేరుతోనే జరుగుతున్నప్పుడు, ఆ కళ్యాణ ప్రవరలో "రామనారాయణుని" నామంగా మార్చిన పేరు సరిచేసి, "రామచంద్రుడు"గా ఉంచండి అనే ఈ ప్రయత్నంలో అందఱూ స్పందించి సహకరించాలి.

సంతకాల సేకరణ ఉద్యమమూ, ఇతర కార్యక్రమాల ద్వారా అందరూ మద్దతు ఇచ్చి, రామకార్యానికి పూనుకోవాలి.

***

'పురాణ రత్నాకర' **శ్రీ గడ్డమణుగు తేజస్వి శర్మ గారు** హైదరాబాద్.

## అబద్ధాల పుట్ట

శ్రీరామచంద్రమూర్తియే భద్రాద్రి యందు వేంచేసియున్న దైవమన్నది నిర్వివాదము. కాని ఇటీవలి కాలంలో 'రామనారాయణుడిగా' స్వామి నామాన్ని స్థిరపరచడానికి అక్కడి అధర్వణ వేదపండితులు శ్రీ గుదిమెళ్ళ మురళి కృష్ణమాచార్యులుగారు చేసే ప్రయత్నాలు, కుయుక్తులు వేదమాతనే ఆశ్చర్య పరుస్తున్నాయి. భక్తి టి.వి.లో 2018లో ప్రసారమైన కార్యక్రమం మరియు ఇతరత్రా కార్యక్రమాలలో వారి వాక్యాలు వింటే వీరు 'అబద్ధాల పుట్ట' అనడంలో సందేహం లేదు. 1. ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయంలో స్వామి వారికి కౌండిన్యస గోత్రం చెబుతారని, 2. భద్రాచల క్షేత్ర మహాత్మ్యం రచించిన శ్రీ పొడిచేటి రంగాచార్యులకు మతిభ్రమణమని, 3. భద్రాద్రిలో ఉత్సవమూర్తులను రామనారాయణుడిగా సంబోధిస్తారని, 4. ఈ క్షేత్రంలో అనాదిగా 'శ్రీరామ

నారాయణస్వామినే' వరాయ అనడమే పరిపాటిగా 350 సం॥ వస్తోందని ఇలా... అనేకమైన అసత్యాలను లయబద్ధంగా చెప్పిన అబద్దాల పుట్ట వీరు. తొండ ముదిరి ఊసరవెల్లి అయినట్లు నిత్యకళ్యాణంలో కూడా 'శ్రీరామనారాయణ స్వామినే' వరాయ అనడం, ధృవమూర్తులను రామనారాయణుడిగా చూపటం విచారకరం. (18.4.2019, 9.05.2019వ తేదీలలో పై విషయమై నా వివరణ అనేక దినపత్రికలలో కూడా ప్రచురితమైనది. అలాగే యూ ట్యూబ్‌తో కూడా చూడవచ్చు) ఇటువంటి వితండ వితర్క వాదులను పారద్రోలి భక్తరామదాసు, తూము నరసింహదాసు ప్రభృతి భక్తవరేణ్యుల అభిమతం మేరకు మరల భద్రాద్రి పూర్వ వైభవం సంతరించుకొనే విధంగా ఎల్లరకు బుద్ధిని ప్రబోధన చేయవలసి నదిగా శ్రీ సీతారామచంద్ర మహాప్రభువుల వారిని వేడుకొంటున్నాను.

భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షులు, వ్యయప్రయాసలకోర్చి
రామనారాయణ ప్రతిఘటనోద్యమాన్ని నడిపిస్తున్నవారు

## శ్రీ బూసిరెడ్డి శంకర రెడ్డి గారు

భద్రాచలంలో కొలువై యున్నది సీతాలక్ష్మణసమేతుడైన శ్రీరామచంద్ర మహాప్రభూ అని జగమెరిగిన సత్యం. కానీ భద్రాద్రి వేదపండితులు, అర్చకులు దైవాపచారం చేస్తున్నారు. శ్రీరామనవమి రోజున జరిగే శ్రీసీతారాముల కళ్యాణం ప్రవరలో గత 350 ఏండ్లుగా పలుకుతున్న 'శ్రీరామచంద్రస్వామినే వరాయ' కాకుండా 'శ్రీరామ నారాయణస్వామినే వరాయ'గా దైవనామాన్ని మార్చివేసి ద్వినామంగా గత 6 సంవత్సరాల నుండీ పలుకుతున్నారు. ఇది దైవద్రోహం, అత్యంత గర్హనీయం.

ఇప్పుడు నా వయస్సు 58 సంవత్సరములు. నా ఊహ తెలిసినప్పటినుండి కనీసం ఓ 30 కల్యాణాల్లో శ్రీరామనవమి రోజున మిథిలా స్టేడియంలో జరిగే శ్రీ సీతారాముల కల్యాణంలో పాల్గొనేవాడిని. శ్రద్ధగా వినేవాడిని. తిలకించే వాడిని. 1989-1994 వరకూ ఆనాటి రాష్ట్ర, కేంద్రమంత్రులతో పాటుగా వెళ్ళి శ్రీసీతారాముల కల్యాణం జరిగే మిథిలా స్టేడియం VVIP గ్యాలరీలో కూర్చొనేవాడిని. ఆనాడు నేను విన్నదీ, కన్నదీ, నవమి రోజున జరిగే కల్యాణ ప్రవరలో 'శ్రీరామచంద్రస్వామినే వరాయ' అని చెప్పేవారు. గోత్రాలు కూడా సీతారాముల గోత్రాలయిన గౌతమి, వశిష్ఠ గోత్రాలే చెప్పేవారు.

కానీ ఇటీవలన గత 5, 6 సంవత్సరముల నుండి కల్యాణ ప్రవరలో 'శ్రీరామచంద్రస్వామినే వరాయ' అని చెప్పకుండా 'శ్రీరామనారాయణస్వామినే వరాయ' అని ద్వినామంగా మార్చి చెపుతున్నారు.

ఇది అన్యాయం. దైవద్రోహం మాత్రమే కాకుండా ఈ సమాజానికి అరిష్టం. శ్రీరామచంద్రునకు జరుగుతున్న దైవాపచారాన్ని ఖండిస్తూ, దైవ ద్రోహంపై మరియు ఆలయంలో జరుగుతున్న అనేక అక్రమ విధివిధానాలనే కొనసాగించాల్సిందిగా అభ్యర్థిస్తూ, పునరుద్ధణ కోసం పోరాడుతున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డా. శ్రీ అన్నదానం చిదంబర శాస్త్రి గారికి అభినందలతో నా నమఃసుమాంజలులు తెలియజేస్తూ, ఈ దైవాపచారాలను సరిచేయవలసినదిగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖనూ, గౌరవ ప్రజా ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు గారికీ విజ్ఞప్తి చేయుచున్నాము. ఆధ్యాత్మిక వేత్తలందరూ ఈ శ్రీరామ కార్యంలో పెద్దలు శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి గారి వెన్నంటి ఉండి ఈ దైవాపచారాన్ని నిరోధించే కార్యంలో కార్యోన్ముఖులుగా ఉండి, దైవాపచారాలను, దైవద్రోహులను అరికట్టవలసినదిగా భద్రాద్రివాసునిగా ప్రార్థిస్తున్నాను.

✶✶✶

భద్రాచలం శ్రీ గౌతమి బ్రాహ్మణ పురోహిత సంఘం ఉపాధ్యక్షులు **బ్రహ్మశ్రీ కోపూరు సుందరరామ శాస్త్రి గారు**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో శ్రీరామనవమికి మరియు నిత్యకల్యాణాలలో సీతారాములకు కళ్యాణం మరియు వివిధ రకాల పూజలలో సీతారాముల నిజమైన గోత్ర ప్రవరలు చెప్పేవారు.

గతంలో మా గురువుగారైన కీర్తిశేషులు కోపూరు విశ్వనాథం గారు ప్రముఖ పురోహితులుగా ఉండేవారు. మరియు దేవాలయంలో ప్రతినిత్యం దాశరథి శతకములు పారాయణం చేసేవారు. వారి పాండిత్యానికి మెచ్చి దేవస్థానం తరఫున వారికి గజారోహణ సత్కారం కూడా చేసారు. మరియు దేవస్థానంలో జరిగే వివిధ పూజాకార్యక్రమాలలో కూడా పాల్గొనేవారు. వారు మాకు చెప్పిన విధంగా సీతారాములకు కల్యాణంలో నిజమైన గోత్ర ప్రవరలు చెప్పేవారు. శ్రీరాముడి గోత్రం వశిష్ఠ గోత్రం. సీతమ్మవారి గోత్రం గౌతమస గోత్రం అని మరియు వీరి తండ్రులుగా దశరథమహారాజు జనకమహారాజు వంశం వారి పేర్లు చెప్పేవారు. కనుక శ్రీ సీతారాముల కల్యాణంలో నిజమైన గోత్రప్రవరలు చెప్పవలసిందిగా కోరుతున్నాను.

✶✶✶

కవిపండితులు **శ్రీమాన్ నడాదూర్ వేంకట రాఘవన్ గారు** చేవెళ్ళ

శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రిగారు నాకు ఆధ్యాత్మికమిత్రులు. వారు రామభక్తులు. విశేషించి హనుమద్భక్తులు. భద్రాచలలంలో జరిగే సీతారామ కల్యాణం విషయంలో

వారు చాలా ఆందోళన పడుతున్నారు. అక్కడ జరుగుచున్న తప్పులను గూర్చి అధికారులకు, అర్చకులకు లేఖలు వ్రాశారు. కాని ప్రయోజనం లేకపోయింది. అందుకోసం ఈ చిన్న పుస్తకం వ్రాసి వెలువరిస్తున్నారు. ఇందులో భద్రాద్రిలో ఉన్నది శ్రీరామచంద్రుడే కాని రామనారాయణుడు కాదని వైష్ణవ ఆగమ శాస్త్ర ప్రమాణాలతోనే నిరూపించారు. ఈ వివాదం చిలికి చిలికి గాలివాన కాకూడదని, కోర్టుల పాలయి దేవాలయ వ్యవహారాలు రోడ్డు కెక్క కూడదని మా ఆకాంక్ష. కాబట్టి తప్పక గ్రంథమంతా చదవండి. సీతారాముల కల్యాణాన్ని సీతారాముల గోత్ర ప్రవరలతోనే సక్రమంగా జరిపించుమని మీరు కూడా అర్చకులకు, అధికారులకు జాబులు వ్రాయండి. మీవల్లే మంచి జరుగుతుందేమో. చైత్ర శుద్ధ నవమి నాడు దశరథుని కుమారుడు పుట్టాడు. ఆ రోజుననే భద్రాచలంలో కళ్యాణం జరుగుతుందంటే ఆ రాముడు ఆ దశరథ సుతుడనే కదా! అప్పుడు మరి దశరథుడు జనకుడు వాళ్ళ గోత్ర ప్రవరలే చెప్పటం న్యాయం కదా! ఎందుకు మారుస్తున్నారో అర్థమవటం లేదు. పోనీ మనకెందుకని ఊరుకోకూడదు కదా! భారతంలో

**'సారపు ధర్మమున్ విమలసత్యము పాపముచేత బొంకుచే**
**పారము పొందలేక చెడబారినదైన యవస్థ దక్షు లె**
**వ్వార లుపేక్ష చేసిరది వారల చేటగు గాని ధర్మని**
**స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడిన్** ' అని చెప్పబడింది. కాబట్టి మనం ఊరుకోకూడదు. దీనిని పూర్తిగా చదివి యథార్థాలు గ్రహించి సీతారామకల్యాణం పూర్వం వలె శాస్త్రోక్తంగా జరిగేటట్లు ప్రయత్నించవలసినదిగా కోరుచున్నాను.

***

## శ్రీమాన్ పుట్టపర్తి అరవింద్ గారు

### S/o **శ్రీమాన్ పుట్టపర్తి నారాయణా చార్యులు గారు** బెంగుళూరు

మీరు పంపిన భద్రాద్రి శ్రీసీతారామ కల్యాణంను గురించిన పుస్తకాన్ని ఆమూలాగ్రం చదివాను. భద్రాద్రిలో శ్రీవారి కల్యాణం జరిగేటప్పుడు పురోహితులు శ్రీసీతారాముల వారి గోత్రములను గాని, వారి తల్లిదండ్రుల గోత్రనామాల ప్రవరను ఉచ్ఛరించడము లేదనేది లోక విధితము. మరియు శ్రీరామచంద్రుల వారిని "రామనారాయణుడని' వక్కాణించడం పూర్తిగా విరుద్ధము. దీనితో మీతో నేను ఏకీభవిస్తున్నాను.

మరియు శ్రీ సీతారాముల వారిని సేవించిన కంచర్ల గోపన్న (రామదాసు) గారు ఎంతో ధన్యులు. వీరి కాలమున 'కబీఉదాసు' గా నుండిరి. కంచర్ల గోపన్న వారి చిన్నతనముననే 'కబీరుదోహా' లు పాడుతున్న కబీరుదాసు శిష్యులైరి. అప్పట్లో 'రఘునాథ భట్టార్' అనునతను లేకుండె.

భద్రాద్రిలో శ్రీసీదారాముల కల్యాణం జరుగుతున్నప్పుడు అర్చకులు తప్పని సిగా శ్రీరామచంద్రులు మరియు శ్రీమతి సీతమ్మ వారి గోత్రనామాలను మరియు వారి వారి తల్లిదండ్రుల పేర్లను మరియు గోత్రములను ఉచ్ఛరించవలయునని కోరుతున్నాను. భవిష్యత్తులో ఇలాంటి పొరబాట్లను జరుగుకుండా ఉండాలని ఆశిస్తూ....

✶✶✶

'సాహితీ రత్న' 'కవితా విశారద' 'పుంభావ సరస్వతీ స్వరూప' ఉపన్యాససింహ

**శ్రీమాన్ దీవి శ్రీనివాసమూర్తి గారు** బాపట్ల

## అర్థం లేని అమానుష చర్య

దక్షిణ భారత పుణ్యక్షేత్రాలలో ప్రసిద్ధకీన పావన గోదతావరి తీరాన వెలసిన భద్రాద్రి. తరతరాలుగా కమనీయమగు సీతారాముల కల్యాణం కనులారా చూచి లేదా చెవులారా విని ఆశేజ ప్రజానీకం తరిస్తోంది. అట్టి సీతారముల కళ్యాణవైభోగంలో వారి వారి గోత్ర నామాలు ప్రవరలు చెప్పటం ఆనవాయితిగా యుంది. ఆ కళ్యాణమును తన వాగ్ధాటితో మన కళ్ళకు కట్టినట్లు వ్యాఖ్యానించిన శ్రీయుత జమ్ములమడక మాధవరామశర్మగారు తదితర ప్రముఖ పండితులు కూడా సీతారాముల గోత్రనామ ప్రవరులకి చెప్పారు. కాని మరొక విధంగా ఏనాడు చెప్పలేదు.

దాశరథి శతకంలోని శ్రీయుత జానకీరమణ చిన్మయరూప రమేశ రామ నారాయణ పాహి పాహి అని సంబోధనా పరంగా ఆ నామాలు ఉంటే వానిలోని రామనారాయణ పదాన్ని ఏక పదంగా సృష్టించి లక్ష్మీనారాయణ కళ్యాణానికి, లక్ష్మీనారాయణ గోత్రనామ ప్రవరలు చెప్పటానికి శ్రీమాన్ గుదిమెళ్ళ మురళీకృష్ణమాచార్యులు గారి వ్యాఖ్యానం కీలకం. దాని పూర్వోపరాలు పరిశీలించక మన వైష్ణవ స్వాములు అమలు పరచటం ఎంతో బాధాకరం. ఈ విధంగా రామదాసు గారి మాటలను ఛీట్ చేసారు. రామనారాయణగా వేరుమార్చి ఆ భద్రాద్రి రామునికి అన్యాయం చేసారు. ఇది సమంజసమేనా? సరియైనదేనా? ఎందుకిలా జరుగుతోంది? ఏమాశించి? ఎవరి మెప్పుకోసం ? ఈ విషయాన్ని నిరసిస్తూ ఎంతమంది విన్నపాలు చేసిన అక్కడి అర్చకులు మనవైష్ణవ స్వాములు గాని ప్రభుత్వాధికారులు గాని ఏ మాత్రం పట్టించుకొనుట లేదా ? ఎందుకని?

ఒక్కసారి అందరూ ఆలోచించండి. ఆపద్యంలో 6 సంబోధనలు వరుసగా

ఉంటే రామనారాయణ శబ్దాన్ని ఏకంచేసి మార్పులు చేయటం తగదు. శ్రీసీతారామ కల్యాణంలో సీతారాముల గోత్రనామప్రవరలనే చెప్పాలని విజ్ఞప్తి చేస్తున్నాం. సీతారాములు భగవదంశలే కావచ్చు. కానీ సాంప్రదాయంగా వచ్చే పద్ధతిని మార్చవద్దని మరీ మరీ కోరుతున్నాం.ఇప్పటికైనా ఈ విషయాన్ని ఎంతమంది నిరసిస్తూ మనస్తాపం పొందుచున్నారని గ్రహింపమని కోరుకుంటున్నాం. నమస్తే

***

**రొంపిచర్ల భట్టర్ హనుమంతాచార్యులు గారు –**

శ్రీ ఆంజనేయస్వామి పాదార్చకులు, పాశ్చాపురం

మాన్యులు శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి గారు సామాజిక మాధ్యమాల ద్వారా భద్రాచలంలో రామునికి జరుగుచున్న అపచారాన్ని తెలియజేశారు. వీరి వాదనతో నేను పూర్తిగా ఏకీభవిస్తూ, ఒక్క విషయం శ్రీశాస్త్రి గారిని సమర్థిస్తూ ప్రశ్నించుచున్నాను.

భద్రాచలంలోని అర్చకులు రాముడు అయోధ్యరాముడు కాదనినప్పుడు "పట్టాభిషేకం ఎందుకు జరుపుతున్నారు? రామునికి తప్ప మరే ఇతర అవతారానికి పట్టాభిషేకం జరుగదు. ఇది లోకవిదితం. పర్ణశాల ప్రాంతాన్ని రాముడు నడయాడిన నేల అని ఎందుకంటున్నారు? అక్కడ ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఎందుకు కల్పించారు?

పై రెండు ప్రశ్నలకు సమాదాన మిచ్చి, శ్రీశాస్త్రి వారి సలహాలను పాటించి భద్రాద్రిరాముని అయోధ్యరామునిగా అంగీకరించడం అక్కడి అర్చకులకు పెద్దలకు సముచితమైనది. కాదని ప్రవర్తించుట వారికి లోకానికి క్షేమంకాదు.

***

**శ్రీమాన్ పరాశరం వేదమూర్తి గారు** విశ్రాంత పండితులు, శ్రీరాంపూర్.

భద్రాచలంలో వెలసిన శ్రీసీతారామచంద్రస్వామి వారి నిత్యనైమిత్తిక కార్యక్రమాలు అనాదిగా యథావిధిగా సాంప్రదాయబద్ధంగా జరుగుతున్నాయి. కాని ఇటీవల కాలంలో స్వామివారికి జరిగే కల్యాణోత్సవాలలో కొన్ని మార్పులు సామాన్యులు గుర్తించలేని విధంగా జరుగుతున్నాయి. కల్యాణోత్సవ విషయాలు తెలిసిన పెద్దలు ఆ పొరపాట్లను తెలియజేసినా అక్కడ పూర్వంలాగా యథావిధిగా జరగటం లేదు. స్వామివారి, అమ్మవారి 'ప్రవరలు' మార్చినారు. శ్రీరామచంద్రమూర్తిని, 'శ్రీరామనారాయణుడి'గా పిలుస్తున్నారు. ఈ విషయం

రాష్ట్రంలోని పెద్దలు, ఆధ్యాత్మిక వేత్తలు, దేవాలయం నిర్వహణలో బాధ్యతలు గల పెద్దలందరికి తెలియజేసినారు. అయినా మార్పు రాలేదు.

కాబట్టి బాధ్యత గల పౌరులుగా మన మందరం ఈ విషయాన్ని తీవ్రంగా ఖండించాలి. రామచంద్రస్వామికి కల్యాణోత్సవాలలో యథాతథ స్థితి తీసుకురావాలి. మార్పులను ప్రజలు ఆమోదించరు. ఈ విషయంలో భక్తులందరు శ్రద్ధ వహించి, ఉద్యమించి, పూర్వంలాగా రాములవారి, సీతాఅమ్మవారి ప్రవరలే చెప్పే విధంగా నిర్వాహకుల మీద వత్తిడి తీసుకురావలసిందిగా, ఒక రామభక్తుడిగా కోరుతున్నాను.

***

**ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి.** ప్రముఖ ఆధ్యాత్మికవేత్త

## భద్రాద్రి దేవుడు శ్రీరామచంద్రుడే.

భద్రాద్రిలో కొలువు తీరిన దైవం ఎవరు? అనే అంశంపై గత కొంతకాలంగా సాగుతున్న వివాదం విచారకరం. "సీతారామస్వామీ! నే చేసిన నేరములేమీ?" అని భక్త రామదాసు చేసుకున్న విన్నపం ఆ దైవం శ్రీరామచంద్రుడే అని చెప్పటానికి అక్షరసాక్ష్యం. "శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం" అది నిస్సందేహంగా.

ఆరుసంవత్సరాలకుపైగా ప్రతి ఏటా ఆకాశవాణి, భక్తి టివి మాధ్యమాలలో శ్రీ సీతారామ కల్యాణంలో స్వయంగా పాల్గొని, ఆ కల్యాణం కన్నులారా వీక్షించి, నోరారా వర్ణించి, ఆనందించిన అదృష్టం నాది. ప్రత్యక్ష వ్యాఖ్యాతగా పాల్గొన్న ఆ కాలంలో ఎన్నడూ ఈ వివాదం నేను వినలేదు, కనలేదు. ఆనాడుకాని, అంతకు ముందుకాని ఎన్నడూ కల్యాణం సందర్భంలో స్వామివారి గోత్రప్రవరలలో ఏ విధమైన వ్యత్యాసమూ లేదు. ఆ స్వామి దశరథపుత్రుడైన శ్రీరాముడే. ఆ తల్లి జనకపుత్రిక సీతమ్మే. ఇది కల్యాణ శుభవేళలో ఆ గోత్రప్రవరలలో స్పష్టంగా వినిపించే, కనిపించే యథార్థం. దృశ్య శ్రవ్య మాధ్యమాలు భద్రపరచిన దృశ్యాలూ ధ్వనిముద్రణలూ ఇందుకు తిరుగులేని సాక్ష్యాలు.

తపస్సుచేసిన భద్రుడికి స్వామి ఇచ్చిన వరం "సీతా లక్ష్మణ సమేతంగా ఆ క్షేత్రంలో కొలువుతీరి ఉంటాను" అనే కదా! దేశ చరిత్ర, అనూచాన ఆచార పరంపర, సంప్రదాయానుసారంగా ఆ క్షేత్రంలో దశాబ్దాల తరబడి సాగిన శ్రీ సీతారామకల్యాణ సన్నివేశాలు ఆ స్వామి శ్రీరామ చంద్రుడని వేనోళ్ళ చాటుతున్నాయి.

శ్రీరాముడు నారాయణ స్వరూపుడే. కాదని ఎవ్వరూ అనరు. అయినా 'దశరథపుత్రుడు ఎవరు?' అంటే 'రామచంద్రుడు' అంటాముకానీ 'రామ నారాయణుడు' అనము కదా!

“సీతాయాః పతయే నమః” అన్నప్పుడు 'సీతమ్మభర్త ఎవరు?' అని అడిగితే, ఆబాలగోపాలమూ ముక్తకంఠంతో '(శ్రీరాముడు' అనే చెప్తుంది కాని, 'రామ నారాయణుడు' అని ఎవ్వరూ అనరు కదా!

ఆశ్చర్యకరమైన సంగతి ఏమంటే, ఈ సత్యాలన్నీ ఈ వివాదం లేవనెత్తినవారికి తెలియనివికావు. అయినా, అర్థరహితమైన ఈ వివాదాన్ని ఎందుకు లేవనెత్తారో వారికే తెలియాలి. “లోగుట్టు పెరుమాళ్ళు కెఱుక” కదా! వివేకంతో, విచక్షణతో ప్రవర్తిద్దాం. సంప్రదాయం పాటిద్దాం. చారిత్రకసత్యాలను శిరసా వహిద్దాం. మన ధర్మాన్ని అన్యమతస్థులు వేలెత్తిచూపే అవకాశం ఇవ్వకుండా జాగరూకత వహిద్దాం. మన జాతిని, సంస్కృతిని సంరక్షించుకుందాం. రామనుగ్రహానికి పాత్రుల మవుదాం.

జై శ్రీరామ్.

✶✶✶

**డా. అనంతలక్ష్మి గారు** ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకురాలు

శ్రీరామచంద్రుణ్ణి చేరటానికి, ఆ ప్రభువు అనుగ్రహం పొందటానికి అనుసంధానం చేసేది ఆయన దాసుడు, రామభక్తాగ్రగణ్యుడు హనుమంతుడు. రాముడి మీద ఈగ వాలితే సహించ లేడు. ఇప్పటికే ఆయన ఆగ్రహోదగ్రుడై ఉంటాడు. అయినా పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం దేనికి? నేను స్వయంగా రావాలా ఇటువంటి విషయాలకి? అని తన భక్తాగ్రగణ్యుణ్ణి సాధనంగా ఎన్నుకున్నాడు. ఆయనే బ్రహ్మశ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి గారు. శ్రీ శాస్త్రిగారు హనుమదుపాసకులు. లక్ష్మీనారాయణ పూజ చేయనిదే అన్నం ముట్టరు. సీతారామచంద్ర స్వామి, రామనారాయణ వివాదం గురించి నిగ్గు తేల్చటానికి వారిని మించిన అర్హత, అధికారం మరెవ్వరికి ఉంటాయి?

అందుకే బృహత్ ప్రయత్నం చేసి, ఒక పరిశోధనాత్మక చిరుగ్రంథాన్ని ఆధారాలతో తయారు చేశారు. భద్రాద్రిలో ప్రతిష్ఠించ బడినది ఇన్నాళ్లుగా పూజలు అందుకుంటున్నది, ప్రతి ఏటా కల్యాణోత్సవం నిర్వహించుకుంటున్నది సీతారామచంద్రులే కాని, రామనారాయణుడు కాదని సోపపత్తికంగా నిరూపించారు. దీనికి ఆగమ శాస్త్రాలని, పురాణాలని, క్షేత్రచరిత్రని, సాహిత్యాన్ని, ఇంతకు ముందు అచ్చు వేసిన సీతారామచంద్రస్వామి కల్యాణ శుభలేఖలని, ఆకాశవాణిలో ప్రత్యక్ష వ్యాఖ్యలని, క్షత్రియుడైన దాశరథిని శర్మగా ప్రతిపాదిస్తూ ప్రవరలు చెప్పటంలోని అనౌచిత్యం మొదలైన వాటితో పాటు చివరికి పోలీసు కేసును కూడా ఆధారాలుగా

చూపించారు. నిజానికి ఈ చిన్ని గ్రంథం చాలు రామనారాయణ వాదం వీగి పోవటానికి.

దండకారణ్య ప్రాంతాన్ని హల్యగ మార్చి ఇక్కడ పంటలు పండేట్టు చేసిన రాముడి పట్ల అనుచితంగా ప్రవర్తించటమే రైతుల ఆత్మహత్యలకి కారణమని చెప్పిన మాట హేతుబద్ధంగా ఉంది. నిజానికి ఇది కనువిప్పు. రాముణ్ణి రాముడుగా పూజించి, సీతారామ కల్యాణాన్ని నిర్వర్తిస్తే అంటే సీతకి అనగా నాగేటి చాలుకి, సూర్య వంశపు చిరుమబ్బు అయిన రాముడికి అనుసంధానం చేస్తే ఆహార పంటలే కాదు, ముక్తి కూడా పండుతుంది. మనకి అటువంటి భాగ్యం మళ్ళీ కల్పించటానికి భక్త రామదాసు, తూము నరసింహ దాసు ప్రభృతులు శ్రీ అన్నదానం చిదంబర శాస్త్రి గారిని ప్రేరేపించి ఉంటారని నా భావన. వీరిని హనుమ నడిపిస్తాడని వారి విశ్వాసం. శ్రీరామ చంద్రుడే శరణం.

**శ్రీ పన్నాల వెంకట బుచ్చిరామశాస్త్రి** , గుంటూరు

భద్రాద్రిలో సీతారామకల్యాణం విషయంలో జరుగుచున్న అన్యాయాన్ని గూర్చి కొందరు విచారమును, మరికొందరు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రీశునికి సీతారామ కల్యాణం జరుగుతోంది. గోత్ర ప్రవరలే కళ్యాణానికి ముఖ్యం గోత్రప్రవరులతోబాటు కొన్నేండ్లుగా పేర్లుకూడా మార్చేశారు. అర్చకులు తెలివిగా చెబుతుండడటం వల్ల అందరూ రామకల్యాణమే జరుగుతుందని అనుకుంటున్నారు. మొదట ప్రవర మార్చారు. తదుపరి పేర్ల మార్చడం జరిగింది. ఆ తర్వాత సాంప్రదాయంలో కూడా మార్పు సంభవిస్తుందని సందేహము కలుగుతున్నది.

17 వ శతాబ్దములో కంచర్ల గోపన్న వ్రాసిన దాశరథీ శతక మకుటమీ పద్యం ఇక్కడ రామదాసు సుస్పష్టంగా విశ్వష్టంగా ఖండితంగా ఆర్తిగా రఘురామ అని సంభోధించినట్లు తెలియవస్తున్నది కానీ, 'రామనారాయణ' అని ప్రస్తుతించిన దాఖలాలు లేవు.

కేవలం వ్యక్తిగతమైన భావజాలంతో కొందరి ప్రేరణ వలన నేడు ఈ క్షేత్ర పురోహితులు వక్రీకరించి ప్రవర చదవడం హేయమైన చర్యే! ఇది నూరుశాతం రామభద్రుడికి జరుగుచున్న ఘోరమైన అపచారం.

కావున దేవాదాయ శాఖాధిపతులు, మంత్రివర్యులు ఈ విషయంలో శీఘ్రంగా స్పందించి త్వరితగతిన దీనిని పరిష్కరించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ విషయమై శ్రీ అన్నదానం చిదంబరశాస్త్రి గారు బాధపడి, విషయాలన్నీ

కూలంకుషముగా గ్రహించి, "భద్రాద్రీశునకు జరుగుతున్న ఘోరపచారం" అనే పుస్తకాన్ని వ్రాయగా శ్రీ శాస్త్రిగారిని వైష్ణవ మతద్వేషిగా ప్రచారాన్ని చేస్తున్నారు.

ఈ విషయంలో కంచర్ల గోపన్న వంశస్థుడైన శ్రీ కంచర్ల వేంకట రమణ 11 వ తరము వారసులు తమ పూర్వీకులకు ఆత్మక్షోభ కలిగేలా జరుగుతున్నది. ఈ దుశ్చర్యను రూపుమాపటానికి చేస్తున్న ప్రయత్నం శ్లాఘనీయం.

ఈ కార్యక్రమము విజయవంతము కావాలని ఆ రామభక్తుని యొక్క ఆశీస్సులు కోరుతూ 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కూడా చేస్తున్నారు. ఈ సందర్భముగా కంచర్ల వారి కుటుంబాలను ఏకతాటిపై తెచ్చే ప్రయత్నం ఎంతో అభినందనీయము.

## శ్రీమాన్ నారాయణం ఆనందాచార్యులు గారు

అర్చకులు, శ్రీగుంటి ఆంజనేయస్వామి దేవస్థానం, వినుకొండ

భద్రాచలంలో వేంచేసియున్న సీతారాముల స్వామి వార్లకు జరుగు కల్యాణమహోత్సవములో జరుగు తీరు దారుణంగా ఉంది. అక్కడ ఉన్నది సీతారాముల వారు అయితే రామనారాయణుడి గోత్ర ప్రవరలు చెప్పి కల్యాణం జరుపుట శ్రేయస్కరం కాదు. దీనిని తీవ్రంగా ఖండించడమైనది.

***

## సి.వి.బి. సుబ్రహ్మణ్యం

సంప్రదాయాన్ని అనుసరించడం మంచిది. ముందువారికంటే మార్పు చేయాలనే భావన వలన కొత్తదనాలువస్తాయి. లౌకికవిషయాలలో ఈ కొత్తదనాలు వస్తాయి. లౌకిక విషయాలలో ఈ కొత్తదనాలు బాగుండవచ్చు. ఆధ్యాత్మిక విషయాలలో ప్రాచీనాన్ని అనుసరించడమే మేలు. రాముని రామునిగా గుర్తించడం మనందరికీ మంచిది.

ఈ విషయంలో చక్కని కృషి చేస్తున్న శ్రీ కంచెర్ల వెంకటరమణ గారు ప్రశంశనీయులు. వారితో మనమంతా పయనిద్దాం.

## శ్రీ నల్లూరి సంపత్ కుమారాచార్యులు గారు

నిత్య హనుమద్ పాదార్చకులు, వినుకొండ

నూతన వసంతంలో వధూవరులు కావటానికి శ్రీరామనవమి కల్యాణం ప్రమాణంగా శ్రీరామచంద్రుని కల్యాణమహోత్సవం కాగానే మానవాళి వారి యింట గడప పచ్చన చేసికొని వివాహం చేసికోవడం, సీతారాములునే ఆదర్శవంతముగ

చేసికొని మానవులు జీవించడం, ధర్మానికి మారుపేరు శ్రీరాముడు. అలా నమ్మి మానవులంతా జీవనం కొనసాగిస్తున్నారు. ఆ నమ్మకాన్ని దూరం చేస్తూ భద్రాద్రి దేవాలయ అర్చకస్వాములు, పూర్వపు ప్రవరలు మార్చి, దేవదేవుని నామధేయములు మార్చి మంత్రములు చదవడం ఎంత వరకు సమంజసం? ఇప్పటికైనా వారి పద్ధతులు మార్చుకొని, పాత సాంప్రదాయాన్ని కొనసాగిస్తే బాగుంటుంది మరి.

✶✶✶

## అళహరి మారుతి కృష్ణమోహనా చార్యులు గారు

భాగవత సప్తాహ దీక్షితులు, ఒంగోలు

భద్రాచల క్షేత్రము శ్రీసీతారామచంద్రస్వామి నిలయము ఆనాదిగా కళ్యాణ క్రతువులు జరిగినా శ్రీసీతారామచంద్రస్వామి వారి గోత్ర నామములతో కల్యాణ ప్రవరలతో  జరుగుతూ ఉంది. ప్రస్తుతం కొద్దికాలంగా శ్రీసీతారామచంద్రస్వామి వారికి బదులుగా శ్రీరామనారాయణ స్వామివారి పేరు చెప్పటం, గోత్రనామములు గాని, కల్యాణ ప్రవరలుగా వేరుగా చెపుతున్నట్లుగా తెలుస్తుంది. ఇది చాలా అధర్మం. అన్యాయం. ఆనాదిగా జరుగుతున్న ఆచార వ్యవహారములను ఎవరి ఇష్టమొచ్చినట్లుగా వారు మార్చడం పద్ధతిగాదు. ఆలయఅధికారులు  ఆలయ అర్చకస్వాములు ఈ విషయాన్ని గమనించగలరని విన్నవించుకొనడమైనది.

✶✶✶

అభ్యుదయ భారతి అధ్యక్షులు **శ్రీమాన్ డా॥ రత్నాకరం రాము గారు**

ఆగమశాస్త్ర ప్రకారం శ్రీసీతారాముల వారి విగ్రహములను ప్రతిష్టించిన దేవాలయంలో సీతారామ కల్యాణమునే చేయాలి. అందుకు భిన్నముగా చేయుట ఆగమ విరుద్ధము.

జైశ్రీరామ్